ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




శనివారం 10 అక్టోబర్ 2026 | సంపుటి: 28 సంచిక: 175
Saturday 10 octobar 2026 | Vol.No 28 Issue No .175
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘన ఆహ్వానం

- ఆలయ వేద పండితులచే సీఎంకు వేద ఆశీర్వచనం
- తరలివచ్చిన గద్వాల సంస్థాన వారసులు



తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 9, విజన్ ఆంధ్ర: శక్తిపీఠాలలో ఒకటైన అలంపూర్ శ్రీ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెలలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి ని అధికారికంగా ఆహ్వానించారు. శుక్రవారం హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిసిన మిగతా 2లో..

## ఎల్‌నినో ప్రభావం..
# వర్షాభావంపై సీఎం కీలక సమీక్ష

- ఈ నెల 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం
- 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు.. రైతుల ఇబ్బందులపై చర్చ
- రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీకి కేంద్రానికి విజ్ఞప్తి
- వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరాపై దృష్టి



హైదరాబాద్ (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఈ నెల 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్రంలో వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం తక్షణం చేపట్టాల్సిన సహాయక చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. వ్యవసాయ రంగంపై వర్షాభావ ప్రభావం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, ప్రజల తక్షణ అవసరాలపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించిన నేపథ్యంలో, తదుపరి మిగతా 2లో..




## నేటి నుంచే దసరా సెలవులు
### - 10 రోజులు ఫుల్ పండగ సందడి!

తెలంగాణ స్టేట్ బ్యూర,అక్టోబర్ 09,విజన్ ఆంధ్ర: తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది విద్యార్థులకు, తల్లిదండ్రులకు అదిరిపోయే గుడ్ న్యూస్. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న దసరా సెలవులు వచ్చేశాయి. నేటి నుంచి అనగా అక్టోబర్ 10వ తేదీ నుంచే దసరా సెలవులు ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ఈ 10 రోజుల సెలవుల కాలం పూర్తిగా పండుగల మయం కానుంది. మిగతా 2లో..

## 22A సమస్యల పరిష్కారంలో మరో కీలక ముందడుగు
### 500 చ.గ.లోపు పెండింగ్ దరఖాస్తులకు నెల రోజుల్లో పరిష్కారం

- ఇప్పటివరకు ఏడు ఉత్తర్వులు జారీ, శరవేగంగా హామీలు అమలు



హైదరాబాద్ : ఏళ్ల తరబడి ఎదురుచూపులు.. భూమిపై హక్కు కోసం నిరీక్షణలు ఫైళ్లకే పరిమితమైన దరఖాస్తులు.. దశాబ్దాల చిక్కుముడులు ఒక్కొక్కటిగా విప్పుకుంటూ పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు ప్రజాప్రభుత్వం పరిష్కారం చూపుతోంది. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి హామీ మేరకు 22ఎ సమస్యల పరిష్కారానికి ఫాస్ట్‌ట్రాక్ విధానంలో కార్యాచరణ చేపట్టాము. ఈరోజు డా. బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో 22-ఎ సమస్యలపై ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా సమీక్షించడం జరిగింది. ముఖ్యంగా జి.ఓ. ఎంఎస్. నెం.59 కింద 500 చదరపు గజాలు, అంతకంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడంజరిగింది. ఈ మేరకు గతంలో జారీ చేసిన జీవో నెంబర్లు 14, 22, 29, 41 అనుగుణంగా మెమో నెంబర్. 48030ను జారీ చేయడం జరిగింది. మిగతా 2లో..

## తొలగించిన ఓట్లలో
# తెలంగాణ టాప్
### - దేశంలోనే సంచలనం




తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 09: ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియ తెలంగాణలో పెను దుమారం రేపుతోంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ జరిగినా, తెలంగాణలోనే అత్యధికంగా ఓట్లను తొలగించడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఎన్నికల సంఘం విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం, తెలంగాణలో ఏకంగా 95 లక్షల ఓట్లను తొలగించారు. ఇది సాధారణ తొలగింపు కాదు, దాదాపు ఒక రాష్ట్ర జనాభాకు సమానం.

3.38 కోట్ల నుంచి 2.43 కోట్లకు:

సర్ ప్రక్రియకు ముందు తెలంగాణలో మొత్తం 3.38 మిగతా 2లో..

### విజన్ ఆంధ్ర - ప్రత్యేక కథనం....
# ఎల్-నినో భయం
### - 2027 వరకు దేశంలో కరువు ముప్పు!

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 9, విజన్ ఆంధ్ర: భారతదేశ ప్రజలకు వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు షాకింగ్ హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం దేశంలో ఎల్-నినో పరిస్థితి చాలా ఘోరంగా ఉందని, ఈ సంవత్సరం, వచ్చే సంవత్సరం కూడా కాలం అనుకూలంగా ఉండబోదని స్పష్టం చేశారు. మిగతా 2లో..



United States El Niño Impacts | NOAA Climate.gov

## ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?

- ప్రజా తీర్పును గౌరవించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదన్న కిషన్ రెడ్డి
- రాహుల్ గాంధీ తీరులో ప్రమాదకర ధోరణులు కనిపిస్తున్నాయని విమర్శ
- ఫలితాలు వ్యతిరేకిస్తే రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తుందని మండిపాటు



హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజా తీర్పును మిగతా 2లో..

### విజన్ ఆంధ్ర - ఎక్స్ క్లూజివ్
## హైదరాబాద్ బ్రేకింగ్
# హైడ్రా పేరుతో బిల్డర్ల దగ్గర భారీ వసూళ్లు
### - టౌన్ ప్లానింగ్ అధికారుల దందా బట్టబయలు!



మిగతా 2లో..

## దసరా సెలవుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### - మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ జానకి ధరావత్, IPS సూచనలు!




తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 9 : దసరా పండుగ, విద్యాసంస్థలకు సెలవుల నేపథ్యంలో విద్యార్థులు, కుటుంబ సభ్యులు స్వగ్రామాలకు వెళ్లే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ శ్రీమతి జానకి ధరావత్, సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం నుండి శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ స్వగ్రామాలకు వెళ్లే ముందు ఇంటి తలుపులు, మిగతా 2లో..

## ప్రజలకు అందుబాటులో
# నాణ్యమైన వైద్యం అందించాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.
- తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రి ప్రారంభించిన మంత్రి




ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర ): తూర్కయంజాల్ బ్రాహ్మణపల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రినీ తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాలు సినిమాటోగ్రాఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటెలా రాజేందర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, దేవరకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే బాలు నాయక్, అచ్చంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, రోడ్ల కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి మిగతా 2లో..

## ట్యాంక్ బండ్‌పై అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలకు చెక్
### - చిన్నారి మృతి ఘటనతో సీపీ సజ్జనార్ సంచలన ఆదేశాలు!

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 9,విజన్ ఆంధ్ర: హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ట్యాంక్ బండ్‌పై అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలకు ఇక చెక్ పడనుంది. ఇటీవల ట్యాంక్ బండ్‌పై పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ చేస్తుండగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల చిన్నారి, ఆమె కుటుంబ సభ్యుల్లో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన విషాద మిగతా 2లో..



## రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప
# ఆందోళన చెందకూడదు



- ప్రకాశం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- 'మీ భూమి-మీ హక్కు' కింద రాజముద్రతో కొత్త పాస్‌బుక్‌ల పంపిణీ
- రూ.166 కోట్లతో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన
- అధికారుల పనితీరుపై బహిరంగంగా సమీక్ష.. పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశం
- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన ముఖ్యమంత్రి

ప్రకాశం : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన సాగిస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలులో శుక్రవారం ఆయన పర్యటించి, 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రైతు పొలంలో పంట గురించి ఆలోచించాలి గానీ, తన భూమి భద్రతపై ఆందోళన చెందకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

#### భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల విషయంలో జరిగిన అవకతవకలను మిగతా 2లో..

## పాలమూరు జిల్లాలో మరోసారి ఫుడ్ పాయిజన్ కలకలం

- 50 మంది విద్యార్థినులకు అస్వస్థత
- నాణ్యత లేని భోజనంతో ప్రాణాల మీదికి!



తెలంగాణ స్టేట్ బ్యూరో,వనపర్తి, విజన్ ఆంధ్ర – అక్టోబర్ 09: ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా హాస్టళ్లు, గురుకులాల్లో ఉంటున్న విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో అస్వస్థతకు గురై ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న ఘటనలు ఇటీవల కాలంలో అనేకమార్లు జరుగుతున్నాయి. నాణ్యత లేని భోజనం కారణంగా వరుస ఘటనలు జరుగుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. తాజాగా వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ శివారులోని ప్రభుత్వ మిగతా 2లో..

## కల్వకుర్తిలో బతుకమ్మ సంబరాల సందడి

- మిలీనియం హైస్కూల్ వినూత్న ప్రయోగం
- రావణాసురుడి దహనంతో చెడు అలవాట్లకు చెక్!

మిగతా 2లో..



## దసరా సెలవుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కిటికీలు సక్రమంగా మూసివేయాలని, విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, నగదును భద్రంగా ఉంచుకోవాలని, వీలైతే బ్యాంక్ లాకర్లలో భద్రపరచాలని సూచించారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని, తమ ప్రయాణ వివరాలను సోషల్ మీడియా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ స్టేటస్‌లలో బహిరంగంగా వెల్లడించకూడదని, దీనివల్ల దొంగలకు అవకాశం ఇచ్చినట్లవుతుందని హెచ్చరించారు. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతున్నా లేదా ఏదైనా అనుమానాస్పద కదలికలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. పొరుగువారికి, సన్నిహితులకు ఇంటిపై ఒక కన్నేసి ఉంచమని చెప్పాలని సూచించారు. ప్రయాణ సమయంలో ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ గారు కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ ధరించాలని పేర్కొన్నారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, రాంగ్ రూట్ లో వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం చేయకూడదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని స్పష్టం చేశారు. బస్సులు, రైళ్లలో రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి తమ విలువైన వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పిల్లలను రద్దీ ప్రదేశాల్లో, జాతరలు, దేవాలయాల వద్ద ఒంటరిగా వదిలివేయకూడదని, ప్రయాణాల్లో వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లను గుర్తుంచుకునేలా చేయాలని కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంటుందని, జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా ఏదైనా అనుమానాస్పద ఘటన జరిగితే వెంటనే డయల్ 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని, పోలీసులకు సహకరిస్తూ దసరా పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీమతి జానకి ధరావత్, ఐపిఎస్ తెలియజేయడం జరిగింది.

## శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘన ఆహ్వానం

దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ హనుమంతరావు, అలంపూర్ ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీమతి దీప్తి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో తాజ్ జీవీకే హోటల్స్ అధినేత, గద్వాల సంస్థాన వారసులు అయిన శ్రీ కృష్ణ రామ్ భూపాల్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. వారితో పాటు ఆలయ ప్రధాన వేద పండితులు, అర్చక బృందం కూడా హాజరయ్యారు. ఆహ్వాన పత్రికను స్వీకరించిన అనంతరం ఆలయ వేద పండితులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా ముఖ్యమంత్రి కి వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వచనం అందించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను కూడా అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఈ సందర్భంగా కమీషనర్ ముఖ్యమంత్రి కి వివరించారు. దసరా ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు ఘనంగా చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

## 22A సమస్యల పరిష్కారంలో మరో కీలక ముందడుగు



అదేవిధంగా గతంలో జీ.వో 59ను అనుసరించి జరిగిన అక్రమాలు, తప్పులు పునరావృతం కాకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇప్పటికే పరిష్కరించబడిన కన్వేయన్స్ డీడ్స్ ల జారీ అయిన కేసులను కూడా సమగ్రంగా పరిశీలించాలని సూచించడం జరిగింది. దరఖాస్తుల పరిశీలనలో ఏమైనా నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడం జరిగింది. ఏళ్ల తరబడి భూమిపై హక్కుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు భరోసా కల్పిస్తూ, ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్న సామాన్యులకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం అనేక నిర్ణయాలను తెసుకోవడం జరిగింది. ఇప్పటివరకు జి.ఓ.118, జి.ఓ.76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలు జారీ, 22-ఎలో ఉన్నా +ఎవీజ, ఎవీణూ, ఱజూ, మున్సిపల్ అనుమతులున్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల రిజిస్ట్రేషన్లకు పరిష్కారం, ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుతో పాటు జి.ఓ. ఎంఎస్. నెం.59ని కలుపుకుని ఏడు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. సమస్యలను కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలో పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ, అర్హులైన భూ సమస్యల బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది.

## ట్యాంక్ బండ్‌పై అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలకు చెక్

ఘటన యావత్ నగరాన్ని కలచివేసింది. వేగంగా వచ్చిన వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ విషాద ఘటనపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ సజ్జనార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నగరంలో ఇటీవల కాలంలో ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్డు, చెరువుల కట్టలు, పార్కులు వంటి బహిరంగ ప్రదేశాల్లో అర్ధరాత్రి వేళ యువత బర్త్‌డే వేడుకలు, కేక్ కటింగ్‌లు, డీజే పార్టీలు చేయడం ఫ్యాషన్ గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు మధ్యలో వాహనాలు ఆపి, కేక్ కట్ చేయడం, గట్టిగా అరుస్తూ హంగామా చేయడం వల్ల వెనుక నుంచి వచ్చే వాహనాలకు ప్రమాదం జరుగుతోందని హెచ్చరించారు. ఇలాంటి నిర్లక్ష్యం, ప్రమాదకర చర్యల వల్ల సంతోషంగా జరగాల్సిన పుట్టినరోజు వేడుకలు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయని సజ్జనార్ పేర్కొన్నారు. ఇకపై ట్యాంక్ బండ్‌తో పాటు నగరంలోని ఏ బహిరంగ ప్రదేశంలోనూ అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలు చేయొద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువతతో పాటు తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని, తమ పిల్లలను ఇలాంటి ప్రమాదకర వేడుకలకు వెళ్లకుండా నియంత్రించాలని, రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన తర్వాత ట్యాంక్ బండ్‌పై పోలీస్ నిఘా మరింత పెంచినట్లు తెలుస్తోంది.

## హైదరాబాద్ బ్రేకింగ్ : హైడ్రా పేరుతో బిల్డర్ల దగ్గర భారీ వసూళ్లు

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 09,విజన్ ఆంధ్ర: హైదరాబాద్ లో సంచలనం సృష్టిస్తున్న హైడ్రా (న్ణ=ూ) పేరును అడ్డం పెట్టుకొని కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు బిల్డర్ల దగ్గర లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్న దందా వెలుగులోకి వచ్చింది. మాట వినని బిల్డర్ల ఆస్తులు రిజిస్ట్రేషన్ కాకుండా సబ్ రిజిస్ట్రార్లకు లేఖలు రాస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్న తీరు బయటపడింది.మెహిదీపట్నం సర్కిల్‌లో భవన నిర్మాణం కోసం ఓ వ్యక్తి నుంచి రూ.4 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ తులసిరాం సునీతను విచారించగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. హైడ్రా పేరు చెప్పి డబ్బులు ఇవ్వకపోతే భవనం కూల్చేస్తామని భయపెట్టి, రూ.8 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని రూ.4 లక్షలు తీసుకుంటుండగా ఆమె పట్టుబడింది.ఇది ఒక్క ఘటనే కాదు, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలో హైడ్రా బూచి చూపిస్తూ అధికారులు జోరుగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణంలో ఉన్న భవనాలకు జీహెచ్ఎంసీ నోటీసులు ఇచ్చి, అందులో అవకతవకలు ఉన్నాయని, అనుమతుల్లో లోపాలున్నాయని చెప్పి లక్షల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇవ్వని బిల్డర్ల ఆస్తులు రిజిస్ట్రేషన్ కాకుండా రిజిస్ట్రేషన్ శాఖకు లేఖలు రాసి అడ్డుకుంటున్నారని, రిజిస్ట్రేషన్ శాఖతో కుమ్మక్కై ఈ దందా సాగిస్తున్నారని బిల్డర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కబ్జాకోరులు, అక్రమార్కుల కోసం ఏర్పాటు చేసిన హైడ్రా ఇప్పుడు చివరికి అధికారులకు కూడా బ్లాక్ మెయిలింగ్ టూల్ గా మారడం విశేషం. భవన నిర్మాణదారుల నుంచి అక్రమంగా రూ. లక్షల్లో వసూలు చేస్తున్నా హైడ్రా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ అక్రమ వసూళ్లపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బిల్డర్లు కోరుతున్నారు.

## ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?

గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతిమయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ కీలకమైన సంస్థలపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని దెబ్బతీసే లక్ష్యంతోనే కాంగ్రెస్ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

### తొలగించిన ఓట్లలో

# తెలంగాణ టాప్

కోట్ల మంది ఓటర్లు ఉండేవారు. సర్ పేరుతో జరిగిన పరిశీలన తర్వాత ఆ సంఖ్య 2.43 కోట్లకు పడిపోయింది. అంటే ఐ27.8% ఓట్లనులి ఏకంగా జాబితా నుంచి తీసేశారు. పెద్ద రాష్ట్రాల్లో ఇంత భారీ స్థాయిలో ఓటర్లను కోల్పోయిన రాష్ట్రం తెలంగాణ ఒక్కటే కావడం గమనార్హం.

***బీజేపీ రాష్ట్రాల్లో తక్కువ - తెలంగాణలోనే ఎక్కువ ఎందుకు?***

అసలు వివాదం ఇక్కడే మొదలైంది. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్, ఉత్తరప్రదేశ్ లాంటి పెద్ద రాష్ట్రాల్లో కేవలం 13% ఓట్లను మాత్రమే తొలగించారు. బెంగాల్ లో 11.6%, బిహార్ లో అయితే కేవలం 6% మాత్రమే తొలగించారు. మరి తెలంగాణలోనే ఎందుకు 27.8% తొలగించారని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

***హైదరాబాద్ టార్గెట్ - 43 లక్షల ఓట్లు మాయం:***

ఈ తొలగింపు వెనుక పెద్ద కుట్ర ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం హైదరాబాద్ పరిధిలోని 28 నియోజకవర్గాల్లోనే 43 లక్షల ఓట్లను తొలగించారు. అంటే సగానికి పైగా ఓట్లు కేవలం రాజధాని పరిధిలోనే తొలగించడం అనుమానాలకు తావిస్తోంది.

***నియోజకవర్గాల వారీగా చూస్తే:***

- శేరిలింగంపల్లి - 3.29 లక్షలు (రాష్ట్రంలోనే టాప్)
- కుత్బుల్లాపూర్ - 2.76 లక్షలు
- ఎల్బీనగర్ - 2.70 లక్షలు

ఈ మూడు నియోజకవర్గాలు హైదరాబాద్ లోని కీలకమైన ఐటీ, సెటిలర్లు అధికంగా ఉండే ప్రాంతాలు కావడం విశేషం.

***బీజేపీ కుట్ర అంటున్న బీఆర్ఎస్:***

తెలంగాణలోనే భారీగా ఓట్లు తొలగించడం వెనుక బీజేపీ కుట్ర ఉందని బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. కావాలనే తెలంగాణ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని సర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, నిజమైన ఓటర్లను కూడా తొలగించారని మండిపడుతున్నారు. తాజా గణాంకాలు చూస్తుంటే సర్ ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని స్పష్టమవుతోందని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి లిజ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలనిలి బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ ప్రకటించింది.

# కల్వకుర్తిలో బతుకమ్మ సంబరాల సందడి

కల్వకుర్తి, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 9: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ సంబరాలు కల్వకుర్తి పట్టణంలో అంబరాన్నంటాయి. నేటి నుంచి దసరా సెలవులు ప్రారంభం కానుండటంతో చివరి రోజు పట్టణంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు,కళాశాలలోపాటు ఒకేషనల్ కళాశాలల్లో శుక్రవారం బతుకమ్మ సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" అంటూ ఆటపాటలతో కోలాహలం చేశారు. అయితే అందరి దృష్టిని ఆకర్షించింది మిలీనియం హైస్కూల్ నిర్వహించిన సంబరాలే. యాజమాన్యం పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్ లో భారీ ఎత్తున బతుకమ్మ సంబరాలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మభూషణ్ అవార్డు గ్రహీత, డాక్టర్ కిన్నెర మొగులయ్య,పట్టణ మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ హాజరై సందడి చేశారు. వారి సమక్షంలో విద్యార్థినుల బతుకమ్మ నృత్యాలు, పాటలు అలరించాయి.

***ఏ ప్రైవేటు పాఠశాల చేయని వినూత్న ప్రయత్నం - రావణాసురుడి దహనం:***

మిలీనియం స్కూల్ యాజమాన్యం ఏ పాఠశాల చేయని ఒక వినూత్న ప్రయత్నాన్ని చేసి అందరి ప్రశంసలు అందుకుంది. విద్యార్థులు చిన్నపాటి రావణాసురుని బొమ్మను తయారుచేసి, ఆ రావణాసురుని ఒక్కో తలకు ఒక్కో చెడు అలవాటు హెడ్‌లైన్‌ను అతికించారు.

- ఫోన్ల అతి వాడకం
- అబద్ధాలు ఆడడం
- డ్రగ్స్ కి దూరంగా ఉండటం
- ఆన్‌లైన్ గేమింగ్
- అతివేగంగా వాహనాలు నడపడం వంటి వాటికి దూరంగా ఉండాలని ప్రతి విద్యార్థి ఆ రావణాసురుని చూసి గుర్తుంచుకునేలా ఈ ప్రయోగం చేశారు.

చెడు అలవాట్లు అనే రావణాసురుడిని దూరంగా పెట్టాలనే సందేశంతో చివరకు ఆ రావణాసురుని బొమ్మను విద్యార్థుల సమక్షంలో దహనం చేశారు. ఈ వినూత్న ఆలోచనకు తల్లిదండ్రులు, అతిథులు హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు దసరా నవరాత్రి ఉత్సవాలలో తొమ్మిది రోజులు తొమ్మిది రూపాలుగా ఉన్నటువంటి అమ్మవార్ల విశిష్టత గురించి కూడా అవగాహన కల్పించారు. చదువుతోపాటు తెలంగాణ యాస, భాష, ఆటపాటలు, సంస్కారం కూడా ముఖ్యమే అని చాటిచెప్పారు. ప్రతి పాఠశాల, కళాశాల యాజమాన్యం ఇలా తెలంగాణలో జరిగే ప్రతి పండుగను గొప్పగా, గర్వంగా చెప్పుకునే విధంగా నిర్వహిస్తున్నందుకు పట్టణ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఎల్‌నినో ప్రభావం.. వర్షాభావంపై సీఎం కీలక సమీక్ష

కార్యాచరణపై ఈ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు ప్రభుత్వం పేర్కొంది. దీంతో దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు, పంటలపై ప్రభావం, నీటి లభ్యత వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

***రూ.20 వేల కోట్ల ప్యాకేజీకి విజ్ఞప్తి***

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కరువు మండలాలను ప్రకటించడంతోపాటు, ప్రభావిత ప్రాంతాలకు తగిన ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రానికి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది.

***సహాయక చర్యలపై కార్యాచరణ***

వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. అఖిలపక్ష సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలు, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణులు చేసిన సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలను ఖరారు చేయనున్నట్లు సమాచారం.వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు శాఖలవారీగా తీసుకోవాల్సిన చర్యలు, రైతులకు అవసరమైన సహకారం, తాగునీరు--సాగునీటి నిర్వహణ, విద్యుత్ సరఫరాపై అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశం కీలకం కానుంది.

# నేటి నుంచే దసరా సెలవులు

10 రోజులు పండుగలే పండుగలు

- అమ్మవారి నవరాత్రుల్లో విద్యార్థుల సందడి

ఈ సెలవుల కాలంలోనే అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. 9 రోజుల పాటు దుర్గమ్మ ఆలయాలు, అమ్మవారి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోనున్నాయి. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కలిసి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం, రోజూ అమ్మవారి ప్రత్యేక అలంకరణలు చూడటం, బతుకమ్మ సంబరాల్లో ఆటపాటలతో సందడి చేయడం, దేవీ నవరాత్రుల్లో కోలాహలంగా గడపనున్నారు.

***దసరా షాపింగ్ తో మార్కెట్లలో ఫుల్ జోష్:***

దసరా సెలవులతో పాటు మార్కెట్లలో షాపింగ్ సందడి కూడా పీక్స్ కు చేరింది. కొత్త బట్టలు, బంగారం, వాహనాలు, బొమ్మలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడుతున్నారు. విద్యార్థులు కూడా తమకు నచ్చిన ఫ్యాషన్ దుస్తులు, క్రాకర్స్, గిఫ్ట్ లు కొనుగోలు చేసేందుకు ఈ సెలవులను ఫుల్ గా వినియోగించుకుంటున్నారు. హైదరాబాద్ తో పాటు అన్ని జిల్లాల్లోని బట్టల షాపులు, షాపింగ్ మాల్స్, బంగారం షాపుల్లో ఇప్పటికే దసరా బంపర్ ఆఫర్లు




మొదలయ్యాయి.

జూనియర్ కాలేజీలకు నేటి నుంచి 21 వరకు - 22న రీఓపెన్:

ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మొత్తం 12 రోజుల పాటు దసరా సెలవులు. తిరిగి కళాశాలలు అక్టోబర్ 22వ తేదీ బుధవారం నుంచి యథావిధిగా ప్రారంభం.

పాఠశాలలకు 10 నుంచి 22 వరకు - 23న తిరిగి ప్రారంభం:

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు నేటి తేదీ నుంచి 22వ తేదీ వరకు మొత్తం 13 రోజుల పాటు సెలవులు. తిరిగి పాఠశాలలు అక్టోబర్ 23వ తేదీ గురువారం నుంచి పునఃప్రారంభం.

## రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప ఆందోళన చెందకూడదు

సరిదిద్ది, రైతులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "మీ భూమి మీదే, హక్కు మీదే, ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. అందుకే పాత పాస్‌బుక్‌లపై నాయకుల బొమ్మలు తొలగించి, ప్రభుత్వ రాజముద్రతో గ్యారెంటీ ఇస్తున్నాం" అని అన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని, ప్రకాశం జిల్లాలోనే 3,304 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాల ఆశలను నిజం చేశామని తెలిపారు. గర్భకంద్రిగ వంటి ఏళ్లనాటి భూములకు సైతం విముక్తి కల్పించామన్నారు. భూ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరిచామని, రైతులు తమ ఇంటి నుంచే తమ భూమి వివరాలను ఫోన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ప్రతి నెలా 9వ తేదీన ఈ కార్యక్రమ పురోగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని, అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

**ప్రాజెక్టులకు శంకుస్థాపన.. అభివృద్ధికి బాటలు**

ఈ పర్యటనలో భాగంగా, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి, పాలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లోని 30,000 మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను నీళ్లు విడుదల చేశాకే జాతికి అంకితం చేశామని, ఫేజ్-2ను కూడా పూర్తి చేసి ఏటా నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే మూడేళ్లలో రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, బీపీసీఎల్ రూ.50 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అన్నారు. దోనకొండను కీలక పారిశ్రామిక టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

**వేదికపైనే 'పబ్లిక్ ఆడిట్'.. అధికారులకు చురకలు**

ఈ సభలో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రధాన ఘట్టం.. చంద్రబాబు వేదికపైనే నిర్వహించిన 'పబ్లిక్ ఆడిట్'. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను వేదికపైకి పిలిచి, ప్రజా స్పందన ఆధారంగా రూపొందించిన పనితీరు గణాంకాలను (పెర్ఫార్మెన్స్ డేటా) చదివి వినిపించారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే ప్రకాశం జిల్లా, కొండేపి నియోజకవర్గం ఏయే అంశాల్లో వెనుకబడి ఉందో అంకెలతో సహా వివరించారు.

ముఖ్యంగా తాగునీటి సరఫరా (-7.93%), రవాణా శాఖ పన్నులు (-7.32%), రీ-సర్వే (-7.53%), అంగన్‌వాడీ సేవలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి అంశాల్లో ప్రతికూల పనితీరుపై అధికారులను నేరుగా ప్రశ్నించారు. "మీరు సరిగా పనిచేయకపోతే ప్రజలు నన్ను నిందిస్తారు. మీవల్ల నేను మాట పడాలా? పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అదే సమయంలో గృహ నిర్మాణం (హౌసింగ్), ఇసుక సరఫరా, మత్స్యకార భరోసా వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు.

**నాలుక చెప్పిందని కాకుండా, మంచి ఆహారం తీసుకోవాలి**

రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, తాను రోజూ మూడు కోడిగుడ్లలోని తెల్లసొనతో చేసిన ఆమ్లెట్ తింటానని, అదే తన ఆరోగ్య రహస్యమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంటగదినే ఔషధశాలగా మార్చుకోవాలని, నాలుక చెప్పిందని కాకుండా శరీరానికి ఏది మంచిదో అదే తినాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, సరైన సమయంలో మందులు వేసుకునేలా గుర్తుచేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, రాజకీయ అంశాలపై వ్యాఖ్యలు**

ఎన్డీఏ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ వేగంతో పనిచేస్తోందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి ట్రిబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటివి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, తాము 34 శాతానికి పెంచితే, ప్రత్యర్థులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీపరంగా 34 శాతం కంటే ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చి వారి రాజకీయ ఎదుగుదలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు**

నీతివంతమైన రాజకీయాలు చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను నీతివంతుడిగా ఉంటే సరిపోదు, నా కింద పనిచేసే అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు కూడా అవినీతికి దూరంగా ఉండాలి. చిత్రగుప్తుడిలా అందరి ఖాతాలను రాసుకుంటున్నాను. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే ఎవరికీ తెలియదనుకోవడం భ్రమ. నేను 360 డిగ్రీల కోణంలో అందరినీ గమనిస్తున్నాను" అని హెచ్చరించారు. ప్రజాసేవకుడిగా ప్రజల బాగోగులే తనకు ముఖ్యమని, దేశభక్తిని, రాష్ట్రంపై అభిమానాన్ని పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని కోరారు. అంతిమంగా, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే తన ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## పాలమూరు జిల్లాలో మరోసారి ఫుడ్ పాయిజన్ కలకలం

మహిళా పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ లో దారుణం చోటుచేసుకుంది. గురువారం రాత్రి డిన్నర్ లో చికెన్ తిన్న 40 నుంచి 50 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో విద్యార్థినులు నొప్పి తట్టుకోలేక కన్నీళ్లు పెట్టుకున్న పరిస్థితి నెలకొంది. ఈ ఘటన జరిగిన వెంటనే విద్యార్థినులను హుటాహుటిన ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. అయితే విషయం బయటకు రాకుండా తొక్కిపెట్టే ప్రయత్నం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థినులు తీసిన వీడియోలు బయటకు రాకుండా ఫోన్లు లాక్కున్నారని, ఇది ఫుడ్ పాయిజన్ కాదు వైరల్ ఫీవర్ అంటూ కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

***ప్రత్యేక కమిటీ వేయాలని డిమాండ్:***

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం పట్ల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిగా ఉన్న శ్రీ ఎ. రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. దసరా సెలవుల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, భోజనం విషయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్రస్థాయిలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ప్రతి హాస్టల్ లో నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ఎల్-నినో భయం

వర్షాభావం కారణంగా పంటలు పండక తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడబోతున్నాయని తెలిపారు. ఈ కరువు పరిస్థితి ఏకంగా 2027 డిసెంబర్ వరకు కొనసాగే అవకాశం ఉందని, 2028 పరిస్థితి ఎలా ఉంటుందో వచ్చే ఏడాది ఏప్రిల్ లో సముద్రంలో టెస్ట్ చేసి ప్రకటిస్తామని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎండలు విపరీతంగా పెరగబోతున్నాయని, ఈ సంవత్సరం చలికాలం కూడా సరిగ్గా ఉండదని, ఉక్కపోతతో కూడిన ఎండలతో పాటు కరెంటు కోతలు కూడా ఎక్కువగా ఉండబోతున్నాయని హెచ్చరిస్తున్నారు. కావున ప్రజలందరూ పరిస్థితులు అనుకూలంగా లేవని గ్రహించి సర్దుబాటు తత్వంతో మసలుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే కొంతమందికి ఈ విషయం తెలిసినా మరోసారి గుర్తు చేయడం కోసమే ఈ హెచ్చరిక చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ముఖ్యంగా ఖర్చులను చాలా వరకు తగ్గించుకోవాలని, అనవసరంగా బట్టలు కొనడం, ప్రతి చిన్న దానికి ఇంట్లో ఫంక్షన్లు చేయడం, చిన్న చిన్న దేవతా విగ్రహాలు పెట్టి ఊరంతా పిలిచి భోజనాలు పెట్టడం, ఖరీదైన గిఫ్టులు ఇవ్వడం, కుటుంబ సభ్యులకు దావత్ లు ఇవ్వడం వంటి ఆర్భాటాలను పూర్తిగా మానుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితిలో మాత్రమే పది నుంచి పదిహేను వేల లోపు అప్పు చేయాలని, మనవాడే కదా అని ఎవరికీ సూరిటీ సంతకాలు పెట్టవద్దని హెచ్చరించారు. అలాగే ఎట్టి పరిస్థితుల్లోనూ కోటా బియ్యం, రేషన్ రైస్ ప్రతి నెలా తప్పకుండా తీసుకొని భద్రపరచుకోవాలని, చిరుధాన్యాలను నిల్వ చేసుకోవాలని తెలిపారు. ప్లాట్ల కొనుగోలు, ఖాళీ స్థలాలకు ప్రహరీ గోడలు కట్టడం, ఇంటికి కొత్త రంగులు వేయడం వంటివి ప్రస్తుతానికి వాయిదా వేయాలని సూచించారు. టూ వీలర్ ఉంటే చాలా జాగ్రత్తగా వాడుకోవాలని, పెట్రోల్ రేట్లు కూడా బాగా పెరగబోతున్నాయని, అనవసరంగా బండి వాడకుండా నడక లేదా సైకిల్ పై వెళ్లడం అలవాటు చేసుకోవాలని, కరెంటును కూడా చాలా జాగ్రత్తగా వాడుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం అందించాలి

రాంరెడ్డి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ఎమ్మెల్సీ ఎలిగంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్, డిజి నర్సింహా రావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి లు పాల్గొని ఆసుపత్రిలోని వివిధ విభాగాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.....ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించే లక్ష్యంతో తూర్కయంజాల్ లో 'తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రినీ ఘనంగా ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించి లాభాపేక్షతో కాకుండా సేవా గుణంతో ప్రజలకు వైద్యం చేయాలనీ సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం, దేవరకొండ, కల్వకుర్తి, మునుగోడు, అచ్చంపేట నియోజకవర్గాల ప్రజలకు మా ఆసుపత్రి అందుబాటులో ఉంటుందనీ చెప్పారు. "సామాన్య ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన వైద్యం అందించడమే మా ప్రధాన లక్ష్యం. తార మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించి, ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తాము" అని తెలిపారు. ఈ ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, కార్డియాలజీ, జనరల్ సర్జరీ, అనేస్తాషియా వంటి అన్ని ప్రధాన విభాగాలు అందుబాటులో ఉంటాయి. అనుభవజ్ఞులైన డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది మరియు అత్యాధునిక పరికరాలతో 24/7 అత్యవసర సేవలు, ల్యాబ్, ఫార్మసీ,సిటీ స్కాన్, ఇన్-పేషెంట్ సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం డాక్టర్లు తరుణ్ తెజ్, సంతోష్ వర్మ, ఐశ్వర్య, లక్ష్మణ్ రెడ్డి, శ్రవణ్ కుమార్, మాలోత్ రాజు, సుధాకర్ రెడ్డి, లహరీ తిరుణగారి, అలేఖ్య రెడ్డి, శృతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఎరుపు రంగులోకి భుగోళంసూపర్ డూపర్

పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడిన ఎల్ నినో క్రమంగా తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే దీని ప్రభావంతో భారత్ సహా దక్షిణాసియాలో నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య ఇది మరింత తీవ్రస్థాయికి చేరుకుంటుందని ఇటీవల ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది. తాజాగా, అంతర్జాతీయ వాతావరణ నిపుణులు ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ.. సూపర్ ఎల్ నినో దెబ్బకు భూగోళం మొత్తం ఎరుపుగా మారిపోయిందని మ్యాప్‌ను షేర్ చేశారు.గతంలో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయికి చేరుకుంటోన్న ఎల్ నినో ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1950 తర్వాత నమోదుకాబోతున్న అత్యంత బలమైన వాతావరణ పరిణామాలలో ఇది ఒకటి కావచ్చని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. మానవ తప్పిదాల వల్ల జరుగుతున్న వాతావరణ మార్పుల తీవ్రతను ఈ ఎల్ నినో మరింత పెంచుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్రం అంతర్భాగంలో దాగివున్న అధిక ఉష్ణోగ్రతలను బయటకు విడుదల చేయడం వల్ల భూగోళంలో అత్యధిక భాగం అసాధారణమైన వేడిని ఎదుర్కొంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.రియాన్ మౌ అనే అంతర్జాతీయ వాతావరణ నిపుణుడు మొత్తం భూగోళానికి సంబంధించిన క్లైమేట్ మ్యాప్‌ను సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విట్టర్)లో పంచుకుంటూ... భూగోళం అంతా దాదాపుగా ఎరుపు రంగులోకి (తీవ్రమైన వేడికి సూచికగా) మారిపోయిందని పేర్కొన్నారు. “అమెరికా మినహా మిగిలిన ప్రపంచమంతటా ఉష్ణోగ్రతలను విపరీతంగా పెంచుతూ ఈ ఎల్ నినో శీతాకాలంలో కూడా తన ‘గరిష్ట ప్రతాపాన్ని’ చూపిస్తోంది” అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఎల్ నినో తీవ్రత వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్న చిఓూ అంచనాతో ఆయన కూడా ఏకీభవించారు.మరో శాస్త్రవేత్త జీకే హాస్‌ఫాథర్ స్పందిస్తూ... “ఈ ఏడాది ఎల్ నినో రికార్డులను తిరగరాస్తూ కొత్త గరిష్టాలకు చేరుకుంటోంది.. నినో 3.4 ప్రాంతంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3.4 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదయ్యాయి. ఇది ఇప్పటివరకు నమోదైన ఏ ఇతర ఎల్ నినో పరిణామం కంటే కూడా అత్యధికం” అని పేర్కొన్నారు. లియోన్ సిమన్స్ అనే మరో నిపుణుడు ఈ పరిణామాన్ని ‘సూపర్-డూపర్ ఎల్ నినో’ గా అభివర్ణించారు.ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 చివరి నెలల్లో ప్రపంచంలోని ఎక్కువ భాగంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఎల్ నినో పుట్టకకు కేంద్రమైన మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రికార్డు స్థాయిలో 3.7 డిగ్రీల సెల్సియస్ (6.7 డిగ్రీల ఫారెన్‌హీట్) ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు.సాధారణంగా ఎల్ నినో అనేది సహజంగా సంభవించే ‘ఎల్ నినో-సౌత్ ఐసోలేషన్’ చక్రంలో భాగమైన ఒక వేడి దశ. ఇది ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ప్రతి రెండు నుంచి ఏడేళ్లకు ఒకసారి సంభవించే ఈ వాతావరణ మార్పుల వల్ల ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా, వర్షపాత వ్యవస్థలు దెబ్బతింటాయి. దీనివల్ల కొన్ని ప్రాంతాల్లో తీవ్ర కరువు కాటకాలు, మరికొన్ని ప్రాంతాల్లో తుఫానులు, భారీ వర్షాలు సంభవిస్తాయి.ఈ అసాధారణ పరిస్థితుల వల్ల ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, తీవ్రమైన ఈదురుగాలులు, తీరప్రాంత వరదలు, బీచ్ కోత ప్రమాదాలు చాలా ఎక్కువగా ఉంటాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించిన కాలిఫోర్నియా గవర్నర్ గెవిన్ న్యూసమ్, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు, శీతాకాలపు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా గత నెలలోనే రాష్ట్ర అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.సమీప కాలంలో ద్రవ్యోల్బణంపై సరఫరా వైపు నుంచి ఒత్తిళ్లు కొనసాగొచ్చని ఆర్బీఐ తెలిపింది. బలహీనమైన నైరుతి రుతుపవనాలు, ఎల్ నినో పరిస్థితులు, అంతర్జాతీయ చమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు దీనికి కారణమవుతాయని పేర్కొంది. చమురును మినహాయిస్తే ఆహార విభాగంలోని పలు కమోడిటీల ధరల్లో కూడా ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది. కోర్ ద్రవ్యోల్బణం పెరగడం, సీపీఐ బాస్కెట్‌లోని మరిన్ని వస్తువుల ధరలు పెరగడం చూస్తే ద్రవ్యోల్బణం ఒకటి రెండు వస్తువులకు పరిమితం కాకుండా విస్తృతంగా మారే తొలి సంకేతాలు కనిపిస్తున్నాయని ఆర్బీఐ తెలిపింది. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని 2026-27లో సీపీఐ ద్రవ్యోల్బణం 5.2 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. రెండో త్రైమాసికంలో 4.9 శాతం, మూడో త్రైమాసికంలో 6.0 శాతం, నాలుగో త్రైమాసికంలో 5.7 శాతంగా ఉండొచ్చని తెలిపింది. 2027-28 తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.6 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. దీనికి సంబంధించిన రిస్కులు కూడా ఇరువైపులా సమానంగా ఉన్నాయని పేర్కొంది. 2026-27 మొత్తం సంవత్సరానికి కోర్ ద్రవ్యోల్బణం 4.4 శాతంగా ఉంటుందని ఆర్బీఐ అంచనా వేసింది.అమెరికాలోని ఆరు రాష్ట్రాలు ఈ శీతాకాలంలో అత్యంత తీవ్రమైన వర్షపాతం, భారీ హిమపాతాన్ని ఎదుర్కోనున్నాయి. కాలిఫోర్నియాతో పాటు నెవాడా, ఉతా, కొలరాడో, న్యూ మెక్సికో, అరిజోనా రాష్ట్రాలపై ఈ ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ రాష్ట్రాల్లోని పర్వత ప్రాంతాలు, ఎత్తైన ప్రదేశాల్లో సగటు కంటే చాలా ఎక్కువగా హిమపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ పరిశోధకులు గత నెలలో వెలువరించిన వివరాల ప్రకారం... ఈ ఏడాది వచ్చిన ఈ ‘సూపర్-ఎల్ నినో’ కారణంగా జూన్ నుంచి ఫిబ్రవరి 2027 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 4,51,000 మందికి పైగా మరణించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# ఎన్నికలు వాయిదా సాధ్యమేనా

నెల్లూరు, అక్టోబరు 9, ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికలకు ముందే రాజకీయ వేడి రాజుకుంది. ఒకవైపు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం.. మరోవైపు అదే రిజర్వేషన్లను కోర్టులో సవాలు చేసిన పిటిషన్లు.. తాజాగా హైకోర్టు తీర్పు.. ఆ తర్వాత సుప్రీంకోర్టు మెట్లెక్కిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇదంతా కేవలం న్యాయపరమైన వివాదమేనా? లేక స్థానిక ఎన్నికల వెనుక పెద్ద రాజకీయ వ్యూహం నడుస్తోందా?ఆగస్టు 20, 2026న ఏపీ ప్రభుత్వం జారీ చేసిన ఉ.వా.ఓబ.ఔనీ.105 ద్వారా పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించింది. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 1న ఏపీ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 34 శాతం బీసీ రిజర్వేషన్‌కు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా గరిష్ఠంగా ఆరు వారాల్లో ప్రారంభించాలని ఆదేశించింది.వైసీపీ వర్గాలు మాత్రం 34 శాతం బీసీ కోటా చట్టపరమైన పరిమితులను దాటుతుందని ముందే హెచ్చరించామని చెబుతున్నాయి. వైసీపీ అధికారిక వాదన ప్రకారం.. ప్రభుత్వం చట్టపరమైన సమస్యలు వస్తాయని తెలిసినా 34 శాతం కోటాను ప్రకటించి తర్వాత కోర్టు అడ్డంకిని రాజకీయంగా ఉపయోగించుకుంటోందని ఆరోపిస్తోంది. మరోవైపు కూటమి ప్రభుత్వం మాత్రం బీసీలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతోనే 34 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చామని చెబుతోంది.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికలను ఎదుర్కోవడానికి భయపడుతున్నారని, అందుకే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని న్యాయపరమైన వివాదంగా మార్చి ఎన్నికలను ఆలస్యం చేయాలని చూస్తున్నారని కూటమి వర్గాలు ఆరోపిస్తున్నాయి.పంచాయతీ ఎన్నికలు జరిగితే గ్రామస్థాయిలో అధికార పార్టీ, ప్రతిపక్షాల బలాబలాలు స్పష్టంగా బయటపడతాయి. ఎవరి క్యాడర్ బలంగా ఉంది? ఎవరి నాయకత్వానికి గ్రామాల్లో ఆదరణ ఉంది? ఏ సామాజిక వర్గం ఎటువైపు నిలుస్తోంది? అన్నది ఎన్నికల ఫలితాలతో తేలిపోతుంది. అందుకే స్థానిక ఎన్నికలే ఇప్పుడు రెండు ప్రధాన పార్టీలకు రాజకీయ పరీక్షగా మారాయి.స్థానిక సంస్థలకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వివిధ గ్రాంట్లు, ఆర్థిక సంఘాల నిధులు, అభివృద్ధి నిధులు అందుతాయి. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2021-26 కాలానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.10,231 కోట్ల కేటాయింపు ఉండగా రూ.10,055.82 కోట్లు విడుదలయ్యాయి. అయితే రూ.12,000 కోట్ల “పే కమిషన్ నిధులు” ఎన్నికలను ఆపడానికి జగన్ చేస్తున్న కుట్రలో భాగమే ఈ ఎన్నికలు అడ్డుకునే ప్రక్రియ అనే వాదన వినిపిస్తోంది.బీసీ రిజర్వేషన్లను వైసీపీ ఎందుకు అడ్డుకుంటోంది.? ప్రభుత్వం తీసుకొచ్చిన 34 శాతం కోటా చట్టపరమైన పరీక్షను ఎందుకు మోకాలడ్డుతోంది.? టీడీపీకి ఎన్నికల్లో ప్రయోజనం దక్కుండా చేసేందుకే ఈ కుట్ర చేస్తోంది.? ఎన్నికలు ఆలస్యం అయితే రాజకీయంగా వైసీపీకి లాభమా? గ్రామీణ స్థాయిలో బలాబలాలు బయటపడకుండా ఎన్నికల ప్రక్రియను సాగదీయడం వైసీపీ వ్యూహమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబోయే రోజుల్లో కోర్టు తీర్పులతో పాటు రాజకీయ పరిణామాలు కూడా ఇవ్వనున్నాయి.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది. అక్టోబర్ 9న ఈ అంశంపై సుప్రీంకోర్టులో తదుపరి విచారణ జరగనుంది. కాబట్టి.. ఇది కేవలం 34 శాతం బీసీ రిజర్వేషన్ వివాదం కాదు. ఇది గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ఆధిపత్యం కోసం జరుగుతున్న మరో పెద్ద పోరాటం.ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి? బీసీలకు చివరకు ఎంత రిజర్వేషన్ దక్కుతుంది? కోర్టు నిర్ణయం ఎటువైపు ఉంటుంది? మరి ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయంగా లాభపడేది ఎవరు? సమాధానం కోసం రాబోయే పరిణామాలను గమనించాల్సిందే!

# ఏపీలో కొత్త పార్టీకి స్పేస్ ఉందా

విజయవాడ, అక్టోబరు 9,ఏపీ రాజకీయం ఎప్పుడూ వేడిమీదే ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ఏపీ పొలిటికల్ స్క్రీన్‌పై సరికొత్త ట్రెండ్ కనిపిస్తోంది. జడ శ్రవణ్ కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ విజయకుమార్, బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు, కేకే సర్వేస్ కొండేటి కిరణ్.. చివరికి వైఎస్సార్‌సీపీ నుంచి దూరమైన రాజ్యసభ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వరకు కొత్త రాజకీయ వేదికలు, పార్టీలు లేదా స్వతంత్ర రాజకీయం వైపు ప్రయాణిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. అసలు ఏపీలో రాజకీయం అంటే అంత సింపుల్ అయిపోయిందా? ప్రెస్ మీట్లు పెట్టడం, జెండా ఎగరేయడం, కొత్త పార్టీ అని ప్రకటించేయడం ఇంత సులువైన వ్యవహారమా? అనే ప్రశ్నలు సామాన్య ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. కొత్త పార్టీల స్థాపన వెనుక ప్రధానంగా మూడే మూడు అంశాలు కనిపిస్తున్నాయి. మొదటిది రిటైర్మెంట్ పొలిటికల్ అంబిషన్ , రెండోది సామాజిక వర్గాల ఆత్మగౌరవ పోరాటాలు , మూడోది ప్రధాన పార్టీల్లో అవకాశాలు దక్కక సొంత దుకాణం తెరవడం! కానీ, క్షేత్రస్థాయిలో ఒక రాజకీయ పార్టీని స్థాపించి, దానిని జిల్లాల వారీగా, మండలాల వారీగా కేడర్‌తో నిర్మించడం, భారీ ఎత్తున ఎన్నికల వ్యయాన్ని తట్టుకోవడం ఎంత సంక్లిష్టమైన విషయమో ఈ కొత్త నేతలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కేవలం టివి డిబేట్లు, సోషల్ మీడియా క్లిప్పింగులతో ఎన్నికల్లో నెగ్గుకురావచ్చనే భ్రమలోనే ఈ కొత్త పార్టీల హడావుడి సాగుతోంది.ఇక అసలైన ప్రశ్నకు వస్తే.. ఈ కొత్త రాజకీయ వేదికల్లో ఒక్కటైనా ప్రధాన పార్టీలైన తెలుగుదేశం , వైఎస్సార్‌సీపీ లేదా కూటమిలో భాగమైన జనసేన ఓటు బ్యాంకును చీల్చగలదా? దీనికి సమాధానం ఖచ్చితంగా లేదు అనే వస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖాముఖి రాజకీయాలకు అలవాటుపడిన రాష్ట్రం. ఇక్కడ ఓటరు చాలా స్పష్టంగా అధికార-ప్రతిపక్షాల మధ్యే తన తీర్పును విభజిస్తాడు. గతంలో విపరీతమైన ప్రజాదరణ ఉన్న సినీ గ్లామర్, భారీ నిధులు ఉన్న చిరంజీవి , సుదీర్ఘకాలం పోరాడిన పవన్ కళ్యాణ్ (కూడా ఓటు బ్యాంకును సీట్లుగా మార్చడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అటువంటిది ఎటువంటి కేడర్, స్పష్టమైన సిద్ధాంతం లేని ఈ చిన్న పార్టీలు ప్రధాన పార్టీల గట్టి ఓటు బ్యాంకును కదిలించడం దాదాపు అసాధ్యం.జడ శ్రవణ్ లేదా రామచంద్ర యాదవ్ వంటి నేతలు బిసి, దళిత సామాజిక వర్గాల ఓట్లను ప్రభావితం చేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ, ఆయా సామాజిక వర్గాలు ఇప్పటికే సంక్షేమ పథకాలు, పొలిటికల్ రిజర్వేషన్ల ప్రాతిపదికన టీడీపీ-వైఎస్సార్‌సీపీల మధ్య స్పష్టంగా చీలిపోయి ఉన్నాయి. అలాగే రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులైన ఏబీ వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు లేదా సీనియర్ నేత విజయసాయిరెడ్డి వంటి వారు రాజకీయ వేదికలు పెట్టినా.. అవి కేవలం పట్టణ ప్రాంత మేధావులు, మీడియా రచ్చబండలకే పరిమితమవుతాయి తప్ప, గ్రామీణ పోలింగ్ బూత్‌లో ప్రభావం చూపే స్థాయికి వెళ్లలేవు. ఈ పార్టీల వల్ల ప్రధాన పార్టీలకు జరిగే ఒక్కే ఒక్క నష్టం.. ఓట్ల చీలిక ! హోరాహోరీ స్థానాల్లో ఈ చిన్న పార్టీలు లేదా స్వతంత్రులు చీల్చే కొన్ని వందల ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థుల జాతకాలను తలకిందులు చేసే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, బిసివై పార్టీ కొద్దిపాటి ఓట్లను చీల్చినా, అది ఆ నియోజకవర్గంలో గెలిచే అభ్యర్థి మార్జిన్‌పై ప్రభావం చూపుతుంది. అంటే ఇవి ఓడించే లేదా గెలిపించే బలం లేని పార్టీలే కానీ, వోట్ కట్టర్ గా మాత్రమే ఉపయోగపడతాయి.ఏపీలో కొత్త పార్టీల హడావుడి అనేది కేవలం తాత్కాలిక మీడియా ఆకర్షణ , నేతల వ్యక్తిగత ఉనికి కాపాడుకునే ప్రయత్నం మాత్రమే! ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్లాట్‌ఫామ్‌పై బలమైన బూత్ నెట్‌వర్క్, వేల కోట్ల నిధుల నిర్వహణ, పటిష్టమైన కేడర్ లేనిదే మనుగడ సాగించడం సాధ్యం కాదనేది చారిత్రక సత్యం. బాబు, జగన్, పవన్ లీడ్ చేస్తున్న ప్రధాన రాజకీయ కంబైన్లను దాటుకుని ఈ కొత్త కూటములు లేదా పార్టీలు ఒక్క శాసనసభ లేదా లోకల్ బాడీ స్థానాన్ని కూడా సొంతంగా ప్రభావితం చేయలేవని అనుకోవచ్చు.

# శాతం బీసీ వర్గాలకు సాధ్యమేనా

రాజమండ్రి అక్టోబరు 9, ఏపీ రాజకీయం మళ్లీ పాత పద్ధతిలోకే వెళ్లింది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి , క్రిష్ణమూర్తి కేసు తీర్పు ఆధారంగా రూపొందించిన ట్రిపుల్ టెస్ట్ విధానాన్ని అధిగమించడం అంత తేలిక కాదు అని తెలిసినప్పటికీ, ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా 34% లేదా అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ల ప్రతిపాదనతో జీవోలు తీసుకువచ్చింది. చట్టపరంగా నిలబడదని అందరికీ తెలుసు. హైకోర్టులో ఇటువంటి నిర్ణయాలు సమీక్షకు వచ్చినప్పుడు 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టం కావడం దీనికి ప్రధాన నిదర్శనం. దీనివల్ల రిజర్వేషన్ల అంశం న్యాయస్థానాల్లో చిక్కుకోవడం, చివరికి పాత పద్ధతిలోనే ఎన్నికలు జరగడం లేదా ఆలస్యం కావడం పరిపాటిగా మారింది.అయితే, సాధ్యం కాదని తెలిసినా రాజకీయ పార్టీలు ఈ తప్పును పదే పదే ఎందుకు చేస్తాయి? అనేదే అసలు ప్రశ్న. దీని వెనుక ప్రధాన కారణం రాజకీయ క్రెడిట్ దక్కించుకోవడం , నెపం ప్రత్యర్థులపైకి నెట్టేయడం . 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా సింహభాగాన్ని ఆకట్టుకోవడానికి ప్రతీ అధికార పార్టీ తాము బీసీలకు గరిష్ట స్థాయిలో స్థానిక పదవులు ఇస్తున్నామనే భావనను కల్పించడానికి ప్రయత్నిస్తుంది. ఆ తర్వాత కోర్టులు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తే, మేము ఇవ్వడానికి సిద్ధపడ్డాము కానీ కో ప్రత్యర్థి పార్టీలు వేసిన పిటిషన్ల వల్ల రద్దయ్యాయి అంటూ తమ తప్పును దాచుకునేందుకు , ప్రత్యర్థులను బీసీ వ్యతిరేకులు గా చిత్రీకరించేందుకు ఈ డ్రామా ఉపయోగపడుతుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలోనూ సరిగ్గా ఇదే తరహా పరిణామాలు చోటుచేసుకున్నాయి. 34% రిజర్వేషన్ జీవోలు తేవడం, అది కోర్టుల్లో రద్దు కావడం, ఆపై 24% కు తగ్గించి ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా అదే తరహా నిర్ణయాలతో ముందుకు వెళ్తోంది. ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విషయంలోనూ కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు హామీల చుట్టూ ఇవే న్యాయపరమైన సవాళ్లు దాగి ఉన్నాయి. చట్టపరమైన వెసులుబాటు , సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసన తీర్పుల పరిమితిపై స్పష్టత ఉన్నప్పటికీ ఏ పార్టీ కూడా నిజం చెప్పే సాహసం చేయడం లేదు. ఒకవేళ పొలిటికల్ పార్టీలకు బీసీలకు న్యాయం చేయాలనే నిజమైన కట్టుబడి ఉంటే, చట్టపరమైన రిజర్వేషన్ల శాతం కోసం కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేయడం కంటే పార్టీ బి-ఫామ్‌ల కేటాయింపులో తమ నిజాయితీని నిరూపించుకోవచ్చు. మునిసిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు లేదా కార్పొరేషన్ ఎన్నికల్లో చట్టబద్ధంగా వచ్చే రిజర్వేషన్ శాతానికి అదనంగా, పార్టీల తరఫున జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇచ్చి గెలిపించే వెసులుబాటు రాజకీయ పార్టీలకు ఉంది. కానీ ఏ పార్టీ కూడా జనరల్ స్థానాలను బీసీలకు ఇచ్చేందుకు సిద్ధపడదు. కేవలం రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉండే ప్రభుత్వ రిజర్వేషన్ల పేరు చెప్పి కాలం వెళ్లదీస్తాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఈ రిజర్వేషన్ల కంటితుడుపు చర్యలు కేవలం ఎన్నికల నాటికి ఓటర్లను మభ్యపెట్టడానికే తప్ప క్షేత్రస్థాయిలో బీసీలకు దక్కే నికర ప్రయోజనం శూన్యమని నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు.కోర్టు తీర్పుల సాకుతో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లడం, పొలిటికల్ మైలేజ్ మాత్రం పొందే ప్రయత్నం చేయడం పరిపాటిగా మారింది.చట్టం పరిధి తెలిసీ ప్రజలను ఆశల్లో ముంచెత్తడం, ఆ తర్వాత న్యాయస్థానాల వైపు వేలు చూపించడం అనేది ఏపీ . ఇతర రాష్ట్రాల రాజకీయాల్లో ఒక ఫార్ములాగా మారిపోయింది. రాజకీయ పార్టీలు ఈ డ్రామాలను పక్కనపెట్టి, నిజాయితీగా పార్టీ టికెట్ల పంపిణీలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదా రాజ్యాంగ సవరణల దిశగా జాతీయ స్థాయిలో ఒత్తిడి తేడమే నిజమైన పరిష్కారమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

# 54 మందికి ఒకే ఇల్లు అమ్మకం భాగ్యనగరంలో బడా మోసగాళ్లు

హైదరాబాద్, అక్టోబరు 9 హైదరాబాద్ నగరంలో ఆస్తి మోసాల ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ పుంజుకోవటం, నగరంలో ప్రాపర్టీలకు డిమాండ్ పెరగటంతో మోసాలు కూడా ఎక్కువవుతున్నాయి. తాజాగా.. ఒకే భవనాన్ని 54 మందికి విక్రయించి, తాకట్టు పెట్టి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసిన వ్యవహారం బయటపడగా.. మరోచోట ప్రభుత్వ అధికారుల సంతకాలు, కార్యాలయాల సీళ్లు ఫోర్జరీ చేసి నకిలీ ఆస్తి పత్రాలు సృష్టించిన ముఠా గుట్టు రట్టయింది. ఇంకోవైపు ఖాళీగా ఉన్న భూములను గుర్తించి నకిలీ యజమానులను సృష్టించి విక్రయించేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మూడు కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేయగా.. పలువురు నిందితులు పరారీలో ఉన్నారు. నకిలీ పత్రాలతో ఆస్తి మోసాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని మల్కాజిగిరి సీపీ బి.సుమతి హెచ్చరించారు.మాదన్నపేట దారాబ్‌జంగ్ కాలనీలో గ్రౌండ్ ఫ్లోర్, రెండు అంతస్తులు, పెంట్‌హౌస్ ఉన్న భవనం రషాద్ ఉల్ ఖైర్, ముంతాజ్‌బేగం ఆధీనంలో ఉంది. దాన్ని వివిధ వ్యక్తులకు ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించేందుకు ఒప్పందాలు చేసుకున్నట్లు సీసీఎస్ పోలీసులు తెలిపారు. బ్రోకర్ల ద్వారా ప్రచారం చేయడంతోపాటు, నమ్మకం కలిగించేందుకు పెంట్‌హౌస్‌లో ఉంటున్న అస్మాబేగంను కిరాయిదారుగా చూపించారు. కొందరికి కొంతకాలం అద్దె కూడా చెల్లించారు. 2021 మార్చి నుంచి ఈ ఏడాది జూన్ వరకు 54 మంది నుంచి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. రూ.15 లక్షలు నష్టపోయిన నయీం బాను ఫిర్యాదుతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అస్మాబేగంను అరెస్టు చేయగా.. ప్రధాన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.మరో కేసులో డాక్యుమెంట్ రైటర్ దేవగుప్తు వీర వెంకట సత్యనారాయణ, అతని మాజీ డ్రైవర్ పోలె రాజుతో కలిసి సుమారు ఎనిమిదేళ్లుగా నకిలీ ఆస్తి పత్రాల దందా సాగించినట్లు పోలీసులు గుర్తించారు. జీపీఏ, ఎస్పీఏ, సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, మార్టిగేజ్ రిలీజ్ వంటి పత్రాలతోపాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారుల సంతకాలు, నకిలీ స్టాంపులు ఉపయోగించినట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లోని విలువైన స్థలాలకు సంబంధించిన నకిలీ పత్రాలను తయారు చేసినట్లు వెల్లడించారు. ఎల్బీనగర్‌లోని ఓ ఫ్లాట్‌పై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు 25 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు, 41 నకిలీ రబ్బరు స్టాంపులు, పలు ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడిపై ఇప్పటికే తొమ్మిది కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# హుస్సేన్ సాగర్ టూ ప్రకాశం బ్యారేజ్ సీప్లేన్

హైదరాబాద్, అక్టోబరు 9హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ నీటిపై విమానం వేగంగా దూసుకెళ్లి ఆకాశంలోకి ఎగరడం, క్షణాల్లో కృష్ణా తీరానికి చేరుకుని విజయవాడ ప్రకాశం బ్యారేజీ జలాల్లో ల్యాండ్ అవ్వడం.. వినడానికే ఎంతో అద్భుతంగా అనిపించే ఈ ఊహ త్వరలోనే నిజరూపం దాల్చేలా కనిపిస్తోంది. ఇప్పటివరకు హైదరాబాద్-విజయవాడ నగరాల మధ్య నిత్యం వేలాది మంది ప్రయాణికులు జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శంషాబాద్-గన్నవరం విమాన సర్వీసులపై ఆధారపడుతున్నారు. అయితే, సాధారణ రవాణా వ్యవస్థకు పూర్తి భిన్నంగా, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సాగే అత్యాధునిక సీప్లేన్ సేవలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఈ సర్వీసులు ప్రారంభమైతే ప్రయాణ సమయం ఆదా కావడమే కాకుండా, తెలుగు రాష్ట్రాల పర్యాటక రంగానికి ఊహించని సరికొత్త ఊపు లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా సాహసోపేత, జల పర్యాటకాన్ని ఇష్టపడే దేశ, విదేశీ పర్యాటకులకు ఇదొక అద్భుతమైన అనుభూతిని అందిస్తుందనడంలో సందేహం లేదు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రాధాన్యతనిస్తూ, నూతన పర్యాటక పాలసీని రూపొందించి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రితో భేటీ అయినప్పుడు హుస్సేన్‌సాగర్-ప్రకాశం బ్యారేజీల మధ్య సీప్లేన్ సేవల నిర్వహణ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ సమావేశం అనంతరం ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసే ప్రక్రియ ఊపందుకుంది.దీనిలో భాగంగా భారత విమానాశ్రయాల సంస్థ (ఏఏఐ)కి చెందిన ఉన్నతాధికారుల ప్రత్యేక బృందం క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేపట్టింది. రాష్ట్ర పర్యాటకశాఖ, హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ఉన్నతాధికారులతో కలిసి ఏఏఐ ప్రతినిధులు హుస్సేన్‌సాగర్‌లోని వివిధ ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. జల విమానాలు సురక్షితంగా నీటిపై దిగేందుకు (ల్యాండింగ్), పైకి ఎగిరేందుకు (టేకాఫ్) అవసరమైన నీటి లోతు, ఉపరితల వైశాల్యం, ప్రవాహ వేగం వంటి సాంకేతిక అంశాలను లోతుగా లెక్కించారు. దీంతోపాటు విమానం నీటిపై ప్రయాణించే మార్గం (ట్యాక్సీ పార్క్), ప్రయాణికులు ఎక్కేందుకు మరియు దిగేందుకు వీలుగా జెట్టీలు, ప్యాసింజర్ టెర్మినల్ సదుపాయాలు ఎక్కడ ఏర్పాటు చేయవచ్చనే అంశాలపై సమగ్ర పరిశీలన జరిపారు.హుస్సేన్‌సాగర్‌లో చేపట్టిన క్షేత్రస్థాయి తనిఖీలకు సంబంధించిన అన్ని సాంకేతిక, పర్యావరణ వివరాలతో ఏఏఐ నిపుణుల బృందం త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికను (డీపీఆర్ రూపంలో) సమర్పించనుంది.

# కామ్రేడ్ నవ్వుల పువ్వులే

హైదరాబాద్, అక్టోబరు 9కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్’ అని పిలిపించుకొంటున్న హీరో? శ్రీవిష్ణు. నిజానికి ఇలాంటి గుర్తింపు దక్కడం నిజంగా ఓ అదృష్టం. శ్రీవిష్ణు అలాంటి సరదా కథల్ని ఎంచుకొంటుంటాడు. తాను చిన్న ఎక్స్‌ప్రెషన్ ఇచ్చినా, డైలాగ్ ని తనదైన శైలిలో మెలిక పెట్టినా.. ఓ చిరునవ్వు పెదాలపై పూస్తుంటుంది. ‘సామజవరగమన’, ‘సింగిల్’ సినిమాల్లో కామెడీతో మరింత చొచ్చుకుపోయాడు. తన సినిమాకు ‘కామ్రేడ్ కళ్యాణ్’ అనే టైటిల్ పెట్టినా, అందులో ఉండేది కామెడీ కళ్యాణే అని ఆడియన్స్ కూడా ఫిక్సయిపోతారు. తన మార్క్ అలాంటిది. టీజర్, ట్రైలర్ లోనూ దట్టమైన వినోదమే కనిపించేలా జాగ్రత్త పడ్డారు. మరి థియేటర్లోనూ నవ్వులు పండాయా, కామ్రేడ్ సృష్టించిన ఈ నవ్వుల విప్లవం.. ఎలాంటి ఫలితాన్ని ఇచ్చింది?మాడుగుల అనే ప్రాంతం అది. 1992.. నాటి కాలం. కళ్యాణ్ (శ్రీవిష్ణు) ఆర్.నారాయణమూర్తి ఫ్యాన్. ఓ థియేటర్ ని లీజుకు తీసుకొని నారాయణమూర్తి సినిమాల్ని ఆడించుకొంటూ కాలం గడిపేస్తుంటాడు. అమ్మ (రాధిక) అంటే ప్రాణం. ఓసారి.. ప్రాణాపాయంలో ఉన్న తన అమ్మ ని.. కేరళ నుంచి వచ్చిన సితార (మహిమా నంబియార్) కాపాడుతుంది. ఆ క్షణం నుంచే సితార ప్రేమలో పడిపోతాడు కళ్యాణ్. తన మనసులోని ప్రేమని సితారకు చెప్పాలనుకొంటున్న సమయంలో ఆమెకు సంబంధించిన ఓ నిజం బయటపడుతుంది. అదే సమయంలో.. సితారని ఓ ప్రమాదం నుంచి బయటపడేయాలంటే రూ.5 లక్షలు అవసరం అవుతాయి. అందుకోసం ఎవరూ చేయని ఓ సాహసం చేస్తాడు కళ్యాణ్. అదేంటి? ఊర్లో.. కళ్యాణ్‌గా ఉన్న హీరో.. అడవికి వెళ్లి కామ్రేడ్ కళ్యాణ్ గా ఎలా మారాడు? అడవిలోకి వెళ్లాక కళ్యాణ్ ని ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? అనేది మిగిలిన కథ.శ్రీవిష్ణు సినిమా అంటేనే ఎంటర్టైన్‌మెంట్. ఈ జోనర్ సౌలభ్యం ఏమిటంటే? పెద్దగా కథ అవసరం లేదు. ప్రేక్షకులు లాజిక్కులు కూడా పట్టించుకోరు. ఊర్లో చాలా సాధారమైన జీవితాన్ని గడుపుతున్న కుర్రాడు.. సడన్ గా అన్నగా ఎలా మారాడు? అనుకోకుండా ఆ ఉచ్చులో ఎలా చిక్కుకోవాల్సి వచ్చింది అనేది ఇంట్రస్టింగ్ టాపిక్కే. దాని చుట్టూ కావల్సినంత వినోదం పండించొచ్చు. శ్రీవిష్ణు సినిమా అనేసరికి ప్రేక్షకులు కూడా లాజిక్కులు పట్టించుకోరు కాబట్టి.. పేపర్ మీద ఈ కాన్సెప్ట్ సేఫ్ గేమ్ అనిపించడంలో ఎలాంటి అనుమానం లేదు. ఫస్టాఫ్ కూడా చాలా జాలీగా, సరదాగా గడిచిపోతుంది. నక్సల్స్ పై కోపం పెంచుకొన్న పోలీస్ ఆఫీసర్ (షైన్ టామ్ చాకో) ఎపిసోడ్ నుంచి కథ ఆసక్తిగా మొదలవుతుంది. ఈ సినిమాకు నక్సల్ అనే పాయింట్ కీలకం కాబట్టి.. కథ మెల్లగా అడవిలోకి షిఫ్ట్ అవుతుంది కాబట్టి, తొలి సీన్ లోనే దర్శకుడు అందుకు కావాల్సిన పునాది వేసేశాడు.ఆ తరవాత.. ఓ అన్న పాటతో? శ్రీవిష్ణుని పరిచయం చేసి, మెల్లమెల్లగా తనక్యారెక్టర్ ని రివీల్ చేయడం, పేకాట ఆడే అమ్మ పాత్ర (రాధిక)ని కథలోకి ప్రవేశ పెట్టడం, ఆ తరవాత హీరోయిన్ ఎపిసోడ్.. ఇవన్నీ చక చక సాగిపోతాయి. హీరోయిన్ ఒరియా పిల్ల కావడం వల్ల కథకు ఒనగూరే అదనపు ప్రయోజనం ఏమీ లేదు. కేవలం కామెడీ కోసం రెండు మూడు ఎపిసోడ్లు రాసుకోవడానికి ఉపయోగపడింది. మరీ ముఖ్యంగా దుబాయ్ బాలు (సత్య)తో కామెడీ చేయించడానికి ఈ ట్రాక్ దోహదం చేసింది. దుబాయ్ నుంచి వచ్చినట్టు సత్య బిల్డప్పులు ఇవ్వడం, ఇంగ్లీష్ లో లవ్ లెటర్ రాయడం.. ఈ సీన్లు బాగా వర్కవుట్ అయ్యాయి. సత్య ఎప్పుడు కనిపించినా ఏదో ఓ జోక్ పేల్చి వెళ్తాడు. దాంతో తను కనిపించినప్పుడల్లా టైమ్ పాస్ అయిపోతుంది. ఉపేంద్ర లిమాయో ట్రాక్ కూడా కామెడీ కోసమే రాసుకొన్నాడు దర్శకుడు.

## ప్రజావాణిలో దివ్యాంగుడి విజ్ఞప్తికి స్పందించి బ్యాటరీ వాహనంను అందజేసిన కలెక్టర్

కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 8(విజన్ఆంధ్ర) ప్రజావాణిలో దివ్యాంగుడి విజ్ఞప్తికి స్పందించి బ్యాటరీ వాహనంను అందజేసిన కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమంలో బిచ్కుంద మండలానికి చెందిన దివ్యాంగుడు గండ మల్లా గంగాధర్, చేసిన విజ్ఞప్తికి స్పందించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ సమీపంలో ఆయనకు బ్యాటరీ విల్ చైర్ అందజేశారు. ప్రజావాణికి వచ్చిన దివ్యాంగుడు తన ఇబ్బందులను జిల్లా కలెక్టర్‌కు వివరించి, తన రోజువారీ అవసరాలకు, జీవనోపాధికి ఉపయోగపడేలా బ్యాటరీ వాహనం అందించాలని కోరారు. ఆయన పరిస్థితిని సానుకూలంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, మరుసటి రోజు కలెక్టరేట్‌కు పిలిపించి బ్యాటరీ వాహనాన్ని అందజేశారు. ప్రజల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని, అర్హులైన వారికి అవసరమైన సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి డి డబ్ల్యుఓ వెంకటేష్, పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ సంబరాలు




కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 9(విజన్ఆంధ్ర) తెలంగాణ ఆడపడుచులు ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ నెటి నుండి ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభం కానుంది. తొమ్మిది రోజులపాటు సాగే పూల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. బతుకమ్మ వేడుకల్లో భాగంగా మహిళలు తంగేడు, గునుగు, బంతి, చామంతి పలు రకాల పూలు తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం గ్రామ చావడిలోని ఒకచోట చేర్చి బతుకమ్మల చుట్టూ ఆడుతూ పాడుతూ, సంప్రదాయ దుస్తులను ధరించి పాటలు పాడుతూ సంబరాలు జరుపుకుంటారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే వేడుకలు సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులపాటు కొనసాగుతాయి. ప్రతి రోజూ ప్రత్యేక నైవేద్యాలు సమర్పిస్తూ అమ్మవారిని పూజించడం ఆనవాయితీ. ప్రకృతిలో లభించే పూలను పూజించడం ద్వారా ప్రకృతి పరిరక్షణ ప్రాధాన్యతను ఈ పండుగ చాటిచెబుతుంది. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుకునే ఆధ్యాత్మిక వేడుకగా ప్రసిద్ధి చెందింది. కామారెడ్డి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు బతుకమ్మ సందడి నెలకొనకోంది తెలంగాణ పల్లెలు పూల పరిమళాలతో పండుగ శోభను సంతరించుకుంది,

## ఎల్.నీ.నో... సాకుతో ధరల మోత..!

### కరువు భయంతో నిత్యావసరాల ధరలకు రెక్కలు..
### పేదలపై పెరుగుతున్న భారం
### నిల్వలపై తనిఖీలు చేపట్టి ధరలు నియంత్రించాలని ప్రజల విజ్ఞప్తి



గద్వాల అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర బ్యూరో)కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందనే ప్రచారం నేపథ్యంలో గద్వాల మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెరిగిన ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలపై ధరల పెరుగుదల మరింత భారంగా మారుతోంది. సన్న బియ్యం 24 కిలోల ప్యాకెట్ సుమారు రూ.1,800 వరకు విక్రయిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. బియ్యం, పప్పులు, నూనెలు తదితర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో రోజువారీ కుటుంబ అవసరాలను తీర్చుకోవడం కష్టంగా మారిందని వారు వాపోతున్నారు. కరువు వస్తుందనే అంచనాలతో కొందరు వ్యాపారులు ముందస్తుగా సరుకులను అధికంగా నిల్వ చేసుకుంటే, మార్కెట్‌లో కృత్రిమ కొరత ఏర్పడి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గోదాములు, దుకాణాల్లో ఉన్న నిత్యావసర సరుకుల నిల్వలపై సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. ప్రజలపై అనవసరమైన ధరల భారం పడకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయా లేదా అనే అంశంపై విజిలెన్స్, పౌర సరఫరాల అధికారులు తనిఖీలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సరుకులను నిల్వ ఉంచడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలు గుర్తిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గద్వాల పట్టణంలోని అనేక ప్రాంతాలలో రిటైల్ గా బియ్యం, జొన్నలు, రాగులు, గోధుమలు తదితర నిత్యావసర వస్తువులను అధిక రేట్లకు విక్రయించే షాపులపై అధికారులు దాడులు చేస్తే సామాన్యుడికి తక్కువ రేట్లకు లభిస్తాయని పలువురు కోరుతున్నారు. ఏది కొనాలన్నా ధరలు పెరిగిపోతే పేద కుటుంబాలు ఎలా బతకాలి, ప్రభుత్వం స్పందించి నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించి, పేదలకు ఉపశమనం కల్పించాలి అని ప్రజలు కోరుతున్నారు.

## హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువతలో అవగాహన పెంపునకు బైక్ ర్యాలీ



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 9(విజన్ఆంధ్ర) హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువతలో అవగాహన పెంపునకు బైక్ ర్యాలీహెచ్ఐవీ నివారణకు అవగాహనే ప్రధాన ఆయుధం -- అదనపు కలెక్టర్ విక్టర్హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువతలో విస్తృత అవగాహన కల్పించి, వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు శుక్రవారం కామారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి నిర్వహించిన హెచ్ఐవీ, ఎయిడ్స్ అవగాహన బైక్ ర్యాలీని అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్. వై గిరితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా యువతకు సరైన అవగాహన ఉండాలని అన్నారు. వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించి, నివారణ మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతలో చైతన్యం పెంపొందించాలని సూచించారు. హెచ్ఐవీ నివారణకు వైద్యారోగ్య శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ బైక్ ర్యాలీ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ప్రారంభమై నూతన బస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రైల్వే స్టేషన్, సిరిసిల్ల రోడ్డు మీదుగా రామారెడ్డి చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం తిరిగి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం వద్ద ముగిసింది. ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ నివారణకు విస్తృత అవగాహన కార్యక్రమాలుఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వై.ఎన్. గిరి మాట్లాడుతూ, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. వ్యాధి పట్ల వివక్ష చూపకుండా, బాధితులకు గౌరవం, సహకారం అందించాలని సూచించారు. నివారణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, యువత ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. హెచ్ఐవీ రహిత జిల్లాగా కామారెడ్డిని తీర్చిదిద్దేందుకు కృషిజిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జె. వెంకటి మాట్లాడుతూ, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో హెచ్ఐవీ నివారణ, అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యారోగ్య శాఖ ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై మరింత చైతన్యం కల్పించేందుకు రానున్న రోజుల్లోనూ విస్తృతంగా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. హెచ్ఐవీ నివారణపై సరైన అవగాహన కల్పిస్తూ, కామారెడ్డిని హెచ్ఐవీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, డాక్టర్ వెంకట్ స్వామి, డాక్టర్ రోహిత్, డాక్టర్ సాయి ఈశ్వరి, డాక్టర్ స్నేహ, డాక్టర్ అంచల్, జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి సుధాకర్, ఉప జిల్లా విస్తరణ మరియు మాధ్యమ అధికారి వేణుగోపాల్, ఓఎస్‌డీ చలపతి, ఈసీ స్వామి, రమేష్, కార్యాలయ పర్యవేక్షకుడు అమ్రీష్, కార్యాలయ సిబ్బంది, హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది, రాజీవ్‌నగర్, ఇస్లాంపురా సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి మహోత్సవం శుభ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ




హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర) శుక్రవారం రోజున ఉదయం 10:30 గంటలకు హనుమకొండ ప్రెస్ క్లబ్ నందు శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవస్థానం ఏకశిలా నగరం హనుమకొండ జిల్లా శరన్నవరాత్రి మహోత్సవం శుభ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ11-10-2026 ఆదివారం నుండి22-10-2026 గురువారం వరకు అమ్మవారిని వివిధ అలంకరణలో కార్యక్రమాలు నిర్వహించబడును ఆదివారం ఉదయం 9 గంటలకు జ్యోతి ప్రజ్వలన హనుమకొండ పశ్చిమ శాసనసభ్యులు నాయని రాజేందర్ రెడ్డి నీలిమ దంపతులచే మరియు కూడా చైర్మన్ గుండు సుధారాణి ప్రభాకర్ దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొంటారు ప్రతిరోజు సుప్రభాతము అభిషేకము అలంకరణ ఉపనిషత్ పారాయణం చండీ సప్తశతి హవనము నవగ్రహ రుద్ర హవనము సాయంకాలము లలిత శాస్త్ర పారాయణం చతుర్వేద స్వస్తి హారతి మంత్రపుష్పం భవద్గీత పారాయణం మొదలైన కార్యక్రమాలు నిర్వహించబడును మొదటి రోజు శైలపుత్రి అలంకరణ రెండవ రోజు బ్రహ్మచారిని అలంకరణ మూడవరోజు చంద్రగంటల ఘన నాలుగవ రోజు కూష్మాండి అలంకరణ ఐదవరోజు స్కందమాతాలంకరణ ఉపాంగ లలిత వ్రతం లక్ష పుష్పార్చన ఆరవరోజు కాత్యాయిని అలంకరణ ఏడవ రోజు కాలరాత్రి అలంకరణ ఎనిమిదో రోజు మహాగౌరీ అలంకరణ దుర్గాష్టమి సద్దుల బతుకమ్మ అదే రోజు రాత్రి 12 గంటలకు కాళరాత్రి హవనము 9వ రోజు సిద్ధి రాత్రి ధాత్రి అలంకరణ మహర్నవమి సుహాసిని పూజ మహా పూర్ణాహుతి బుత్విక్ సన్మానము పదో రోజు అపరాధితా దేవి అలంకరణ విజయదశమి దసరా ఆయుధపూజ 21-10-2026 బుధవారం రోజున మహా స్నపనం సాయంకాలం ఆరు గంటలకు రథోత్సవం ఉత్సవమూర్తి ఊరేగింపు 22-10-2026 గురువారము ఉదయం పదిన్నర గంటలకు హనుమద్గిరి పద్మాక్షి దేవి శాంతి కళ్యాణము సాయంత్రము తే ప్పోత్సవము పద్మాక్షి తటాకం నందు ఈ కార్యక్రమం నిర్వహించ బడును బ్రహ్మశ్రీ నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించబడును ప్రెస్ మీట్ లో పాల్గొన్న నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని నీలారపు రాజ్ కుమార్ దేవాలయ అభివృద్ధి కార్యకర్త కనుకుంట్ల రవికుమార్ ప్రచార కార్యదర్శి మునుగోటి రమేష్ దేవాలయ అభివృద్ధి కార్యకర్త గోవర్ధన వెంకటరమణాచారి తదితరులు పాల్గొన్నారు

## పంటల పరిశీలన, చీడపీడల నివారణపై రైతులకు శాస్త్రీయ సూచనలు

### క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



గద్వాల అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లాలోని ఎర్రవల్లి, గద్వాల మండలాల పరిధిలోని బీచుపల్లి, అనాతపురం, పూడూరు, కొండపల్లి గ్రామాల్లో శుక్రవారం తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం గద్వాల సమన్వయకర్త డాక్టర్ పి. ఆర్చన,అల్సర్స . శాస్త్రవేత్తలు ఎ. శ్రీరామ్, డాక్టర్ కె. మమత, డాక్టర్ జి. మాధురితో కలిసి పంటల క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, మిరప, కంది, బెండ, పత్తి పంటలను పరిశీలించి, పంటల ఎదుగుదల, చీడపీడల ఉధృతి, రైతులు అనుసరిస్తున్న యాజమాన్య పద్ధతులను పరిశీలించారు. ఈ సందర్భంగా డా. పి. అర్చన రైతులతో మాట్లాడి పంటల సమస్యలపై శాస్త్రీయ సూచనలు అందించారు. పత్తి: పత్తి పంట కోత దశలో ఉన్నట్లు గుర్తించారు. కొన్ని పొలాల్లో గులాబీ రంగు కాయతొలుచు పురుగు (పింక్ బోల్‌వార్మ్) ఉనికిని గమనించారు. పంట పరిపక్వత, పొలాల పరిస్థితులను బట్టి నవంబర్ మొదటి పక్షం నాటికి మిగిలిన పత్తి కోత పనులను పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. మిరప: బిందు సేద్యం ద్వారా సాగు చేస్తున్న మిరప పంటలో ఆకులు పైపైపుకు ముడుచుకునే లక్షణాలను గమనించారు. తామర పురుగుల నివారణకు ఇప్పటికే ఏడు ఎర్లు మందులు పిచికారీ చేశామని, ప్రస్తుతం పురుగుల ఉధృతి సమర్థవంతంగా తగ్గిందని రైతులు తెలిపారు. బెండ: సుమారు రెండు నెలల వయస్సు కలిగిన బెండ పంటలో 43వ కోత దశను గమనించారు. కాయతొలుచు పురుగు నివారణకు రైతు ఎమామెక్టిన్ బెంజోయేట్ మందును పిచికారీ చేసినట్లు తెలిపారు. వరి: వరి పంట క్రియాశీల పిలకల దశలో ఉంది. పంటలో పానికిల్ మైట్ (వెన్ను/కంకి మైట్) సమస్యను గుర్తించారు. పురుగు లక్షణాలను నిర్ధారించిన తరువాత వరి పంటకు అనుమతించబడిన తగిన పురుగుమందును లేబుల్ సూచనల ప్రకారం మాత్రమే ఉపయోగించాలని శాస్త్రవేత్తలు సూచించారు. అలాగే కంది పంటను కూడా పరిశీలించి, పంట ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులను అంచనా వేశారు. పంటల్లో చీడపీడల గుర్తింపు, నివారణ చర్యలు, శాస్త్రీయ పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు. ఈ క్షేత్ర సందర్శనలో మొత్తం ఐదుగురు రైతులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగాల కోసం గిరిజన యువతకు 60 రోజుల ఉచిత శిక్షణ

### అక్టోబర్ 13 వరకు దరఖాస్తుల స్వీకరణ
### గిరిజన యువత పోలీస్ ఉద్యోగాల శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
### ప్రాజెక్ట్ అధికారి సలోని ఛబ్రా

గద్వాల అక్టోబర్ 9( విజన్ ఆంధ్ర బ్యూరో)పోలీస్ కానిస్టేబుల్,ఎస్ఐ ఉద్యోగాల సాధనకు సిద్ధమవుతున్న ఎస్టీ,ఆదివాసీ, గిరిజన యువతీ యువకులకు తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ప్రాజెక్ట్ అధికారి సలోని ఛబ్రా,ఐఏఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ),పీవీటీజీ--చెంచు విభాగం,మన్ననూర్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలకు చెందిన అర్హులైన అభ్యర్థులకు ఉచిత భోజన,వసతి సౌకర్యాలతో కూడిన రెసిడెన్షియల్ కోచింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా పోలీస్ ఉద్యోగాల పోటీ పరీక్షలకు అభ్యర్థులను సిద్ధం చేయనున్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా మొత్తం 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి,ఎంపికైన వారికి సుమారు రెండు నెలల పాటు ప్రిలిమినరీ పరీక్షకు సన్నద్ధమయ్యేలా ఉచిత శిక్షణ అందించనున్నారు. అర్హత కలిగిన గిరిజన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్ట్ అధికారి సూచించారు. అభ్యర్థులు రూ.3 లక్షల వార్షిక ఆదాయ పరిమితికి సంబంధించిన ఆదాయ ధ్రువపత్రం,కుల ధ్రువీకరణ పత్రం,ఆధార్ కార్డు, విద్యార్హతలకు సంబంధించిన స్టడీ సర్టిఫికెట్లు, పోలీస్ ఉద్యోగానికి దరఖాస్తు చేసినట్లు తెలిపే పత్రాలను సమర్పించాలన్నారు. అభ్యర్థులు పోలీస్ రిక్రూట్‌మెంట్ నిబంధనలకు అనుగుణంగా అర్హతలు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ 05-10-2026 నుంచి 13-10-2026 సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి అభ్యర్థుల ఎంపికలో భాగంగా 15-10-2026న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి,16-10-2026న అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నారు. అనంతరం 17-10-2026న తదుపరి ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి,19-10-2026న తుది ఎంపిక జాబితాను ప్రకటించనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు 21-10-2026 నుంచి ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో కూడిన రెసిడెన్షియల్ శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు తమ జిల్లాలోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు పత్రాన్ని ఉచితంగా పొంది,అవసరమైన ధ్రువపత్రాలతో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఐటీడీఏ కార్యాలయం, మన్ననూర్ లేదా నాగర్‌కర్నూల్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

## తెలంగాణలోకి అకున్ సబర్వాల్

హైదరాబాద్, అక్టోబరు 9, సీనియర్ ఐపీఎస్ అధికారి అకున్ సబర్వాల్ తిరిగి తెలంగాణ క్యాడర్‌లోకి రానున్నట్లు సమాచారం. దీంతో రాష్ట్ర పోలీసు, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. కేంద్ర డిప్యుటేషన్ పూర్తి చేసుకున్న ఆయనకు త్వరలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో.. గతంలో ఆయన చేపట్టిన సంచలనాత్మక టాలీవుడ్ డ్రగ్స్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. 2017లో హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ రాకెట్ దర్యాప్తులో అప్పటి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న అకున్ సబర్వాల్ కీలక పాత్ర పోషించారు. ఆయన నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం పలువురు సినీ ప్రముఖులను విచారించింది. అప్పట్లో ఎల్ఎస్‌డీ,ఎండీఎంఏ వంటి మాదకద్రవ్యాల సరఫరా వ్యవహారం హైదరాబాద్‌లో సంచలనం సృష్టించింది. డ్రగ్ పెడ్లర్ల అరెస్టుల అనంతరం వారి కాంటాక్ట్ లిస్టుల్లో సినీ ప్రముఖుల ఫోన్ నంబర్లు ఉన్నాయన్న అంశం ఆధారంగా పలువురికి నోటీసులు ఇచ్చి విచారించారు. అయితే కేవలం ఫోన్ నంబర్లు ఉండటం, పరిచయం ఉండటం మాత్రమే నేరానికి ఆధారం కాదని దర్యాప్తు సంస్థలు స్పష్టం చేశాయి. అప్పట్లో సినీ పరిశ్రమను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారన్న విమర్శలను సబర్వాల్ కూడా ఖండించారు. తదుపరి దశలో ఈ కేసుల దర్యాప్తు తీరుపై పలు ప్రశ్నలు తలెత్తాయి. 2024లో ఈ వ్యవహారానికి సంబంధించిన ఆరు కేసులను తగిన ఆధారాలు లేవన్న కారణంతో కోర్టు కొట్టివేసినట్లు నివేదికలు వెల్లడించాయి. దర్యాప్తులో అనుసరించాల్సిన విధానాలు పాటించలేదని, కొన్ని కేసుల్లో సరైన సాక్ష్యాలు లేవని కోర్టు పేర్కొన్నాయి. ఇక అంతకు ముందే అకున్ సబర్వాల్ కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన తిరిగి తెలంగాణకు రావడం సహజంగానే పాత కేసుపై ఆసక్తిని పెంచుతోంది

## బిచ్కుందలో నూతన బార్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

### - జిల్లా ఆబ్కారీ అధికారి బి, ముకుంద రెడ్డి



కామారెడ్డి బ్యూరో (బిచ్కుంద), అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర):బిచ్కుంద ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బిచ్కుంద మున్సిపాలిటీలో నూతనంగా బార్ ఏర్పాటు చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆబ్కారీ అధికారి బి. ముకుంద రెడ్డి తెలిపారు. నూతన బార్ ఏర్పాటుకు సంబంధించి జిల్లా ఆబ్కారీ కార్యాలయానికి ఇప్పటివరకు 13 దరఖాస్తులు అందినట్లు ఆయన వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుదారులు ఫారం-1 ద్వారా రూ.1 లక్ష దరఖాస్తు రుసుమును డిమాండ్ డ్రాఫ్ట్ లేదా చలాన్ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుతో పాటు మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ ప్రతులను జత చేయాలని సూచించారు. దరఖాస్తులను అక్టోబర్ 12వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా ఆబ్కారీ కార్యాలయంలోని కార్యాలయ పనివేళల్లో సమర్పించవచ్చని తెలిపారు. ఎంపికైన బార్‌కు సంబంధించి ప్రతి సంవత్సరం రూ.30 లక్షల ఎక్సైజ్ పన్ను ప్రభుత్వానికి నిబంధనల ప్రకారం విడతల వారీగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బార్ కేటాయింపు ప్రక్రియను అక్టోబర్ 16వ తేదీన ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఆబ్కారీ అధికారి తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

## దంతాల సున్నితత్వంపై అవగాహన అవసరం

### -పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ సోనియా దత్తా



హైదరాబాద్, అక్టోబర్ 09 (విజన్ ఆంధ్ర) : బుతు మార్పుల సమయంలో వేడి, చల్లని పానీయాల వల్ల దంతాల సున్నితత్వం పెరిగే అవకాశం ఉందని పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ సోనియా దత్తా(ఎండిఎస్, పిహెచ్డి) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దంతాల సున్నితత్వంపై డాబర్ రెడ్ టూత్‌పేస్ట్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. దంతాలు, చిగుళ్ల ఆరోగ్యానికి రోజువారీ నోటి సంరక్షణకు లవంగం, అల్లం వంటి ఆయుర్వేద పదార్థాలుగల ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడిఎ) ఆమోదం పొందిన డాబర్ రెడ్ టూత్‌పేస్ట్ ఉపయోగ పడుతుందని తెలిపారు.

## ఏపీఎల్‌లో రాజ్‌పుతానా రాయల్స్ శుభారంభం

హైదరాబాద్, అక్టోబర్ 09 (విజన్ ఆంధ్ర) : ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాజ్‌పుతానా రాయల్స్ శుభారంభం చేసిందని నిర్వాహకులు, భారత ఆర్చరీ సంఘం ప్రతినిధులు తెలిపారు. హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో జరిగిన తొలి మ్యాచ్‌లో పృథ్వీరాజ్ యోధాస్‌పై 5-3తో విజయం సాధించినట్లు చెప్పారు. రాజ్‌పుతానా తరఫున ఓజస్ దియోతలే, ఎల్లా గిబ్సన్, మేటే గజోజ్, అంకితా భకత్ రాణించగా, పృథ్వీరాజ్ తరఫున అభిషేక్ వర్మ, మథియాస్ గ్రాండే, ఆండ్రియా బెసెర్రా పోరాడారని పేర్కొన్నారు. భారత ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలోని లీగ్‌లో 6 జట్లు, 48 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, అక్టోబర్ 18న టైటిల్ ఫైట్ జరగనుందని తెలిపారు.



# ఎన్నికల సామగ్రి భద్రత గదులను పరిశీలన

## ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 09 ( విజన్ ఆంధ్ర ) : శుక్రవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను కుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమములో అదనపు కలెక్టర్ వెంకటాచారి,ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హోలీ, తహసిల్దార్ లక్ష్మీనారాయణ,సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఆదిలాబాద్‌లో త్వరలో 10 సోయాబీన్ కొనుగోలు కేంద్రాలు: కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 9 )విజన్ ఆంధ్ర)జిల్లాలోని రైతులకు సోయాబీన్ అమ్మకాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోయాబీన్ పంట కొనుగోలు, సంబంధిత అంశాలపై ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా రైతుల సౌకర్యార్థం 10 కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ప్రారంభించాలని కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఆదిలాబాద్, జైనథ్, బేల, ఇచ్చోడ, బోథ్, ఉట్నూర్ (హస్నాపూర్), ఇంద్రవెల్లి, నార్నూర్, నేరడిగొండ ప్రాంతాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు తమ పంటను దళారులకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర పొందాలని సూచించారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, కేంద్రాల వద్దకు వచ్చే రైతుల కోసం తాగునీరు, నీడ తదితర మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ధాన్యం తూకంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని, కొనుగోలు చేసిన పంటకు సంబంధించిన నగదును సత్వరమే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. వ్యవసాయ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, మార్క్‌ఫెడ్ డి.ఎం. మహేష్ కుమార్, కేంద్ర గిడ్డంగుల సంస్థ మేనేజర్ రవికుమార్, ఏవో టెక్నికల్ విశ్వామిత్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో ప్రోటోకాల్ కచ్చితంగా పాటించాలి

## ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశం



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 9 విజన్ ఆంధ్ర)ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియలో వేగం పెంచాలని, రాబోయే దసరా పండుగ లోపు అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రొసీడింగ్స్ తో పాటు మార్కవుట్లు పూర్తి చేసి అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సర్వేలు, ప్రొసీడింగ్స్ జారీ ప్రక్రియపై ఆయన సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ ఈఈలు ప్రత్యేకాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పత్రాలు అందజేసేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోటోకాల్ ఇష్యూలు తలెత్తకుండా చూడాలని, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను ఈ కార్యక్రమాలలో విధిగా భాగస్వామ్యం చేయాలని తేల్చిచెప్పారు. కేటాయించిన కోటా ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందాలని, ఇప్పటివరకు రాని వాటిని వెంటనే పరిశీలించి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని ఆదేశించారు. మున్సిపాలిటీ, ఉట్నూర్, ఇంద్వెల్లి, గాదిగూడ, ఆయా మండలాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే క్లియర్ చేయాలని, సిరికొండలో మిగిలిన 29 ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక అధికారులతో కొన్ని రోజుల పాటు క్షేత్రస్థాయిలో కూర్చుని సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒకసారి ప్రొసీడింగ్స్ ఇచ్చిన తర్వాత వాటిని మళ్లీ వెనక్కి తీసుకోవడం గానీ, జాప్యం చేయడం గానీ జరగకూడదని హెచ్చరించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులను సైతం ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేస్తూ, పారదర్శకతతో అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల మంజూరు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రా, ఎస్.రాజేశ్వర్, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, భూ సర్వే కొలతల శాఖ ఏడి ప్రభాకర్, హౌసింగ్ పీడీ శంకర్, హౌసింగ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ)ఆధ్వర్యంలోఘనంగా కిసాన్ మేళా

## రైతులు సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి

## రైతులకు మేలు జరిగేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలి

## ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తగు చర్యలు అవసరం

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర బ్యూరో)రైతులు ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ ప్రకృతి వ్యవసాయంపై ఎక్కువగా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, ఆత్మ చైర్మన్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో శుక్రవారం గద్వాలలోని కెఎస్ ఫంక్షన్ హాల్ లో 'కిసాన్ మేళా' పేరుతో వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, రైతులు, శాస్త్రవేత్తలతో సమావేశ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ముందుగా ముఖ్య అతిథులు, ఇతర అతిథిలతో కలిసి వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక, ఉద్యాన, తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. స్టాల్స్ లో ఏర్పాటు చేసిన ఆయా యంత్రాలను, ఇతర ఉత్పత్తులను రైతులతో కలిసి తిలకించి ప్రశంసించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేసి తెలంగాణ రాష్ట్ర గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రైతులు ప్రతిభావంతులని, ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినప్పటికీ ఎంతో కష్టపడి వివిధ పంటలు సాగు చేయడం అభినందనీయమన్నారు. రైతులు డ్రోన్స్ ను వినియోగించుకోవాలని, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. యూరియా యాప్ ద్వారా రైతులకు యూరియా వాడకంపై అవగాహన కలిగించడం జరిగిందన్నారు. దాంతో హెక్టార్ కు సగటున 500 కేజీల వరకు యూరియా వినియోగాన్ని తగ్గించడంతో జిల్లా వ్యాప్తంగా సుమారుగా 2330 టన్నుల యూరియాను తగ్గించడం జరిగిందన్నారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో జిల్లా రైతుల సంక్షేమానికి అధికార యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. జిల్లాలోని పలు రిజర్వాయర్ల సామర్థ్యాన్ని ప్రభుత్వం పెంచడంతో రానున్న రోజుల్లో సాగు, తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ పంటకు మంచి డిమాండ్ ఉన్నందున ఉమ్మడి జిల్లాలోనే జోగులాంబ గద్వాల జిల్లా రైతులు అత్యధిక ఎకరాల్లో సాగు చేశారని కొనియాడారు. జిల్లాలో పాల ఉత్పత్తి పెరిగేలా ఆవులు, గేదెల పెంపకం చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలు, మేకలు పెంచే వారికి ప్రయోజనం చేకూరేలా బీమా పథకాన్ని ప్రవేశపెట్టినందున సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో 80 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నందున ప్రభుత్వాలు రైతులకు ఎంతో ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఏ పార్టీలు అధికారంలోకి వచ్చినా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పథకాలను పకడ్బందీగా అమలు చేస్తే అన్నదాతలకు మేలు జరుగుతుందన్నారు. వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్తు సరఫరా ఉండాలని, కనీసం 18 గంటలైన ఇవ్వాలన్నారు. రైతుల కష్టానికి తగిన ఫలితం రావాలంటే వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, రైతులు బాగుంటేనే అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తాయని, ఆయా రంగాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఎల్ నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందు చూపు అవసరమని, అధికారులు సకాలంలో సరైన అవగాహన కల్పించడం వలన అన్నదాతలు నష్టపోకుండా ఆరుతడి పంటలు సాగు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. శాస్త్రవేత్తలు కూడా రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని పరిశోధనలు చేయాలని, రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.రాష్ట్ర గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత మాట్లాడుతూ సమస్త మానవాళి జీవనాధారానికి మూలం రైతులేనని కొనియాడారు. అన్నదాతలు ఒకప్పుడు పంటలతో పాటు పాడికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చే వారని, రైతులు పాడి పరిశ్రమపై కూడా దృష్టి సారించేలా సంబంధిత పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రోత్సహించాలన్నారు. మానవ తప్పిదాలతోనే పర్యావరణంలో కాలుష్యం పెరుగుతోందని అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ ను నిషేధించడమే కాక వాతావరణానికి హాని కలిగించే అన్ని కారకాలపై కొరడా జులిపించాలని ఫలితంగా భవిష్యత్తు తరాల మనుగడకు కృషి చేసిన వారమవుతామన్నారు. వర్షాలు సకాలంలో కురిస్తేనే రైతులు సుభిక్షంగా ఉంటారని, ఫలితంగా అన్ని రంగాలకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప మాట్లాడుతూ వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా రైతులకు మేలు జరిగేందుకు ఇటీవలే పలువురు ప్రజాప్రతినిధులు కర్ణాటక ముఖ్యమంత్రిని కలిసి ఆల్మట్టి డ్యాం నుంచి జూరాల ప్రాజెక్టుకు మూడు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరినట్లు గుర్తు చేశారు. నడిగడ్డను కరువు జిల్లాగా ప్రకటించాలని, అన్నదాతలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా సంబంధిత శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఆదర్శ రైతులు ప్రకృతి వ్యవసాయం, ఇతర వినూత్న పద్ధతులతో చేస్తున్న పంటల సాగుపై మాట్లాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, డీఏవో వీరప్ప, ఆత్మ డిప్యూటీ పీడీ జగ్గు నాయక్, గద్వాల పిఏసిఎస్ చైర్మన్ సుభాన్, ఇతర ప్రజా ప్రతినిధులు, పలువురు శాస్త్రవేత్తలు, అధికారులు, నేతలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ ప్రాజెక్టులలో ఉద్యోగ అవకాశాలు

## 102 అంగన్వాడీ టీచర్లు, 162 అంగన్వాడీ ఆయా ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర) : జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ పరిధిలోని ఐ సి డి ఎస్ ప్రాజెక్టులలో ఖాళీగా ఉన్న 102 అంగన్వాడీ టీచర్ల పోస్టులు, 162 అంగన్వాడీ ఆయా పోస్టులకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొడంగల్ ప్రాజెక్టులో అంగన్వాడీ టీచర్ల పోస్ట్ ఖాళీలు 13, అంగన్వాడీ ఆయా పోస్ట్ ఖాళీలు 31, మర్పల్లి అంగన్వాడీ టీచర్ల పోస్ట్ ఖాళీలు 21, అంగన్వాడీ ఆయా పోస్ట్ ఖాళీలు 14, పరిగి ప్రాజెక్టు లో అంగన్వాడీ టీచర్ల పోస్ట్ ఖాళీలు 27, అంగన్వాడీ ఆయా పోస్ట్ ఖాళీలు 78, తాండూర్ ప్రాజెక్టులో అంగన్వాడీ టీచర్ల పోస్ట్ ఖాళీలు 23, అంగన్వాడీ ఆయా పోస్ట్ ఖాళీలు 28 ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా వికారాబాద్ ప్రాజెక్టులో అంగన్వాడీ టీచర్ల పోస్ట్ ఖాళీలు 18, అంగన్వాడీ ఆయా పోస్ట్ ఖాళీలు 11 ఉన్నట్లు ఆయన తెలిపారు. అంగన్వాడీ టీచర్లు అంగన్వాడీ ఆయా పోస్టులకు సంబంధించిన అర్హతలు, వయోపరిమితి, స్థానికత, రిజర్వేషన్లు, ఎంపిక విధానం, నిబంధనలు ఇతర పూర్తి వివరాలు http:/ / wdcw.tg.nic.in వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. అంగన్వాడి కేంద్రంనకు కేటాయించిన రిజర్వేషన్ ప్రకారం, ఆ రిజర్వేషన్ కు సంబంధించిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్లైన్ దరఖాస్తుల స్వీకరణ అక్టోబర్ 10 నుండి 24 సాయంత్రం 5 గంటల వరకు http://wdcw.tg.nic.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి కలెక్టర్ తెలిపారు. ఆన్లైన్ దరఖాస్తు చేసిన అభ్యర్థులు, సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అక్టోబర్ 26 నుండి నవంబర్ 1 వరకు కార్యాలయ పనివేళలలో తమ దరఖాస్తుతో పాటు అవసరమైన ధృవీకరణ పత్రాలు గెజిటెడ్ అధికారితో ధృవీకరించిన జిరాక్స్ ప్రతులను సమర్పించాలని, కేవలం ఆన్లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకోబడుతుందని ఆయన తెలిపారు.ఈ నియామక ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ను రద్దు చేయుటకు, సవరించుటకు, మార్పులు చేయుటకు లేదా అవసరమైన సూచనలు జారీ చేయుటకు జిల్లా కలెక్టర్ ఽ చైర్మన్, కు పూర్తి అధికారం ఉంటుందని,ఏదైనా సమాచారం కోసం సంబంధిత చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారిని సంప్రదించాల్సిందిగా కలెక్టర్ తెలిపారు.

# నిజ నిర్ధారణ తర్వాతే వార్తలను ప్రచారం చేయాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షి షాలి



మీడియా ప్రతినిధులు వార్తలను ప్రచురించే ముందు వాస్తవాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిజ నిర్ధారణ చేసిన తర్వాతే ప్రజలకు అందించాలి ....జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీసీ హాల్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల జర్నలిస్టుల శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా, డిజిటల్ మీడియా విస్తరిస్తున్న నేపథ్యంలో ఫేక్ న్యూస్, తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. ఏఐ సాంకేతికతపై అవగాహన పెంచుకుంటూ, ధ్రువీకరించని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. వార్తల్లో వేగం కంటే వాస్తవికత, విశ్వసనీయతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలును వెలుగులోకి తీసుకురావడంలో స్థానిక విలేకరుల పాత్ర కీలకమన్నారు. జర్నలిస్టులకు శిక్షణ అందించడంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి మీడియా అకాడమీ కృషి చేస్తుందని తెలిపారు.అనంతరం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ రాజర్షి షాలను శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వేంకటేశ్వరరావు, డీపీఆర్వో విష్ణు వర్ధన్, రచన కళాశాల ప్రిన్సిపాల్ ఉమ మహేశ్వర్ రావు, మీడియా అసోసియేషన్ ప్రతినిధులు రాజేశ్వర్, దేవేందర్, బేత రమేష్, నవనందుల నర్సయ్య,వినోద్, సురేష్, షాహిద్, వెంకట్, కిరణ్ తదితరులతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విధులలో సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9:(విజన్ ఆంధ్ర)జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని సిర్పూర్ టి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులు, డెలివరీ వార్డులు, మందుల నిల్వలు, రోగ నిర్ధారణ యంత్రం పనితీరు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంలో ఆసుపత్రిలో 5 మంది వైద్యులు విధులు నిర్వర్తించవలసి ఉండగా ఒక్కరు మాత్రమే విధులలో ఉండటానికి గమనించి, మిగతా వారు విధులకు రాకపోవడానికి గల కారణాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవలసిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్యులు, ఇబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, మందుల కొరత లేకుండా అవసరమైన మందులను నిల్వ ఉంచుకోవాలని, వైద్య పరికరాలు వినియోగంలో ఉండేలా పర్యవేక్షించాలని తెలిపారు.



# భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న సమగ్ర భూముల రీ-సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, నిర్దేశిత లక్ష్యాలను ఎప్పటికప్పుడు సాధించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ మండలాల్లో సర్వే పురోగతి, లైసెన్స్ సర్వేయర్ల పనితీరుపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాబోయే అక్టోబర్ 20 తేదీ లోపు మరిన్ని రోవర్లు రానున్నాయని, వీటిని ప్రతి మండలానికి రెండు చొప్పున కేటాయించి సర్వే వేగాన్ని మరింత పెంచుతామని తెలిపారు. లక్ష్మీపూర్, నేరెడిగొండ తదితర గ్రామాల్లో నోటీసులు తక్షణమే జారీ చేసి అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియను ముగించాలని స్పష్టం చేశారు. ప్రతి మండలంలో రెవెన్యూ ఆఫీసర్, లైసెన్స్ సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్ లేదా గ్రామ పంచాయతీ కార్యదర్శితో కూడిన రెండు ప్రత్యేక బృందాలను క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, రోడ్లు, కాలువలు, జలవనరుల డిమార్కేషన్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లు ప్రతి 15 రోజులకు ఒకసారి తాము చేసిన సర్వే పనికి సంబంధించిన నివేదికను తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, ఏడీ సర్వే ఆఫీసుకు విధిగా సమర్పించాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన వెంటనే సంబంధిత ఫైల్స్ తయారీ పూర్తి చేసి తహసీల్దార్ల ధృవీకరణతో కేంద్ర సర్వే ఆఫీసుకు పంపాలని పేర్కొన్నారు. విధుల్లో అలసత్వం లేదా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రూ, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, భూ సర్వే కొలతల శాఖ ఏడి ప్రభాకర్, హౌసింగ్ పీడీ శంకర్, హౌసింగ్, సర్వేయర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హన్మకొండ ప్రోగ్రెస్ స్కూల్ విద్యార్థిని యశికకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

## ఒక్క నిమిషంలో 110 మానవ శరీర భాగాల పేర్లు చెప్పి అరుదైన ఘనత

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9 ( విజన్ ఆంధ్ర ) : హన్మకొండలోని ప్రోగ్రెస్ హైస్కూల్ విద్యార్థిని బోయిని యశిక తన అసాధారణ ప్రతిభతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. కేవలం 8 సంవత్సరాల 4 నెలల 15 రోజుల వయసులోనే మానవ శరీరంలోని 9 వ్యవస్థలకు సంబంధించిన 110 భాగాల పేర్లను ఒక్క నిమిషంలో చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్--2026లో స్థానం సంపాదించింది. ఈ సందర్భంగా అక్టోబర్‌లో ప్రోగ్రెస్ హైస్కూల్‌లో యశికకు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హన్మకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నేరెళ్ల వెంకట హైమ పూజిత, కాకతీయ విశ్వవిద్యాలయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ కె. అనితారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రోగ్రెస్ హైస్కూల్ ప్రిన్సిపల్, కరస్పాండెంట్ మల్లాది ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించగా, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రెక్టర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని చిన్నారి యశికను అభినందించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, చిన్న వయసులోనే అసాధారణ జ్ఞాపకశక్తి, ప్రతిభతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గౌరవం తెచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి విజయాలు స్ఫూర్తినిస్తాయని తెలిపారు.యశిక సాధించిన ఈ ఘనత పాఠశాలతో పాటు ఆమె తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచింది. చిన్న వయసులోనే జాతీయ స్థాయి రికార్డును సాధించిన యశికను పలువురు అభినందించారు.

# వైద్య సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9:( విజన్ ఆంధ్ర)ప్రభుత్వ ఆసుపత్రులలో అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండల కేంద్రంలో గల రైల్వే స్టేషన్ లో లైఫ్ లైన్ రైలులో ఏర్పాటుచేసిన పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుండి నవంబర్ 4వ తేదీ వరకు కాగజ్ నగర్ రైల్వే స్టేషన్ లో లైఫ్ లైన్ రైలులో వైద్యులు పలు రకాల వైద్య సేవలు, చికిత్సలను ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. వైద్య పరీక్షలకు వచ్చేవారు ఆధార కార్డును తీసుకురావాలని, ఈ వైద్య సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ ఉచిత వైద్య సేవలపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.

# ప్రజలకు మరింత చేరువగా "ప్రజాసేతు" డిజిటల్ వేదిక

## జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9:( విజన్ ఆంధ్ర)జిల్లాలో ప్రజా సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించడంతో పాటు, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో ఆధునిక సాంకేతికతతో పనిచేసే ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'కె.బి. ఆసిఫాబాద్ ప్రజాసేతు' ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాలలో నెలకొన్న పౌర సమస్యలు, మౌలిక వసతుల కొరత, పారిశుద్ధ్యం, త్రాగునీరు, రహదారులు, వీధి దీపాలు తదితర సమస్యలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను సులభంగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ డిజిటల్ వేదిక ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యాలయాల చుట్టూ తిరుగవలసిన అవసరం లేకుండా, వాట్సాప్ ద్వారా ఫిర్యాదులను సమర్పించే సదుపాయాన్ని కల్పించడం జరిగిందని తెలిపారు. వాట్సాప్ నంబర్: 7569986036 ద్వారా ప్రజలు తమ సమస్యలను సందేశం రూపంలో పంపవచ్చని సూచించారు. ఫిర్యాదును పంపేటప్పుడు సమస్యకు సంబంధించిన వివరాలు, సమస్య ఉన్న ప్రాంతం పేరు, గ్రామం / వార్డు వివరాలు, అవసరమైతే సంబంధిత ఫొటోలను జత చేయడం ద్వారా సమస్యను స్పష్టంగా తెలియజేయవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక వెబ్‌సైట్‌ను హ్ట్ట్ప్స్:// ఎమ్మెంఅట్టుఘ్మ్ఙ్ం.ఇఅ అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఈ వెబ్‌సైట్ ద్వారా ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావచ్చు అని తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సమర్థవంతంగా స్వీకరించి, సంబంధిత సమస్యలను గుర్తించి, పరిష్కార ప్రక్రియను మరింత సులభతరం చేయడమే కకాకుండా ప్రభుత్వ సేవలలో పారదర్శకతను పెంపొందించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

# నియోజకవర్గంలో సాగునీటి సమస్యలను పరిష్కరించాలి

## రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కలిసిన ఎమ్మెల్యే విజయుడు



అలంపూర్ అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర బ్యూరో)హైదరాబాద్ లోని నీటిపారుదల శాఖ కార్యాలయం అలంపూర్ శాసనసభ్యులు విజయుడు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మంత్రి తో ఈ సందర్భంగా విన్నవిస్తూ తుంగభద్ర నదికి ఇండెంట్ పెట్టేలా తగిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా జూరాల ప్రాజెక్టుకు సంబంధించిన 99, 100 ప్యాకేజీల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ని కోరారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన పనులు వేగవంతమైతే నియోజకవర్గంలోని రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరడంతో పాటు, సాగునీటి అవసరాలు తీర్చుకోవడానికి మరింత అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధి, సాగునీటి సమస్యల పరిష్కారం, రైతులకు మేలు చేకూర్చే అంశాలపై ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తుల పట్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించడం జరిగిందని తెలియజేశారు.

# FMGE డాక్టర్ల స్టైఫండ్ పెంచాలి

## -- సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు

## విదేశీ వైద్య పట్టభద్రులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలి




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9; (విజన్ ఆంధ్ర)ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఫీవీ+ (ఫీశీతీవఱస్త్రఅ వీవఎఱషఋశీ +తీఎఱబ్ఖ్వం) డాక్టర్లు స్టైఫండ్ పెంచాలని చేపట్టిన సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశాల్లో ఎంబీబీఎస్ వైద్య విద్యను పూర్తి చేసి, అవసరమైన అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులై, భారతదేశంలో తప్పనిసరి వైద్య ఇంటర్న్‌షిప్ చేస్తున్న ఫీవీ+జు డాక్టర్లు ఆసుపత్రుల్లో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. విధి నిర్వహణలో వారు కూడా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ, భారతదేశంలో వైద్య విద్య పూర్తి చేసిన ఇంటర్న్‌లతో పోలిస్తే స్టైఫండ్‌లో వ్యత్యాసం ఉండటం అన్యాయమని ఏఐటీయూసీ అభిప్రాయపడింది. వైద్య విద్య కోసం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఈ యువ వైద్యులకు కనీస ఆర్థిక భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లిలిసమాన విధులు నిర్వహిస్తున్న వైద్య ఇంటర్న్‌లకు సమాన స్టైఫండ్ చెల్లించాలిలిలి అనే న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫీవీ+ డాక్టర్ల స్టైఫండ్‌ను రూ,,5000 నుండి 30000 లకు పెంచడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరించి సమ్మె విరమించేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి భోగే ఉపేందర్ మరియు నాయకులు పాల్గొన్నారు.

# మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు

## ఇంద్రవెల్లి ఘటనలో ఇరువర్గాల వారిపై కేసులు నమోదు.. ఆరుగురు అరెస్ట్

## సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

## వదంతులను నమ్మవద్దు.. అనుమానాలుంటే పోలీసులను సంప్రదించాలి

## ఇంద్రవెల్లి ఎస్ఐ సాయన్న




ఆదిలాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 9( విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి కేంద్రంలో బుధవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి ఇరువర్గాల వారిపై కేసులు నమోదు చేసి, ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇంద్రవెల్లి ఎస్ఐ ఈ. సాయన్న తెలిపారు. ఈ ఘటనను కొందరు వ్యక్తులు వక్రీకరిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం, ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టడం, నిర్ధారణ కాని సమాచారాన్ని ప్రచారం చేయడం చట్టరీత్యా సమస్యలకు దారితీస్తుందని స్పష్టం చేశారు. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని గుడ్డిగా నమ్మవద్దని, నిజానిజాలు తెలుసుకోకుండా ఇతరులకు షేర్ చేయవద్దని సూచించారు. తప్పుడు ప్రచారాలకు, వదంతులకు ప్రభావితమై ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడవద్దని కోరారు. ప్రాంతంలో శాంతి సామరస్యాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఏవైనా అనుమానాలు లేదా సమస్యలు ఉంటే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ ఈ. సాయన్న తెలిపారు. ప్రజలు సంయమనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

# స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర);మహబూబాబాద్: మహబూబాబాద్‌లోని స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఈ వేడుకలను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. పూల పండుగైన బతుకమ్మ గొప్పతనాన్ని చాటుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణం పూల అందాలతో, విద్యార్థుల సందడితో పండుగ వాతావరణాన్ని సంతరించుకుందిఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ప్రేమకు, ఐకమత్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను కూడా తెలుసుకొని వాటిని భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మధు మాట్లాడుతూ, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మన సంప్రదాయాల పట్ల గౌరవం, ప్రకృతి పట్ల ప్రేమ, ఐకమత్య భావన పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, సాంస్కృతిక అవగాహన కల్పించడం పాఠశాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. విద్యార్థుల ఉత్సాహం, పూల అలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటుతూ నిర్వహించిన ఈ ప్రీ బతుకమ్మ వేడుకలు విద్యార్థుల్లో ఆనందోత్సాహాలను నింపాయి.

# భారతీయులకు ట్రంప్ మరో షాక్

హైదరాబాద్, అక్టోబరు 9అమెరికాలో పనిచేస్తున్న విదేశీ టెక్ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ ఐటీ రంగానికి అమెరికా ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. విదేశీ ఉద్యోగులకు గ్రీన్ కార్డ్ మంజూరు ప్రక్రియలో కీలకమైన పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ నుంచి ప్రపంచ ప్రఖ్యాత ఐటీ అవుట్‌సోర్సింగ్ దిగ్గజాలను సస్పెండ్ చేస్తూ ట్రంప్ యంత్రాంగం సంచలన నిర్ణయం తీసుకుంది. అమెరికన్ల ఉద్యోగాలను కొల్లగొడుతున్నారన్న ఆరోపణలతో ఈ కఠిన చర్యలు చేపట్టింది. జాబితాలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, కాప్‌జెమినిలతో పాటు ప్రముఖ టెక్ సంస్థలు మైక్రోసాఫ్ట్, అడోబ్ కూడా ఉన్నాయని అమెరికా కార్మిక శాఖ స్పష్టం చేసింది. అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ నేతృత్వంలోని యాంటీ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్ సమక్షంలో వైట్‌హౌస్ వేదికగా ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఇకపై ఈ కంపెనీల నుంచి ఎలాంటి కొత్త పెర్మ్ దరఖాస్తులను స్వీకరించబోమని, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను కూడా పూర్తిగా నిలిపివేస్తున్నామని వెల్లడించారు. పెర్మ్ ప్రక్రియ అంటే.. అమెరికాలో ఒక కంపెనీ విదేశీ ఉద్యోగికి గ్రీన్ కార్డ్ ఇః-2, ఇః-3 కేటగిరీలు స్పాన్సర్ చేయాలంటే, మొదటగా కార్మిక శాఖ నుంచి ఈ లేబర్ సర్టిఫికేషన్ పొందడం తప్పనిసరి చట్టబద్ధమైన మొదటి మెట్టు. సదరు ఉద్యోగం చేసేందుకు స్థానికంగా అర్హులైన అమెరికన్ పౌరులు ఎవరూ అందుబాటులో లేరని, విదేశీయుడిని తీసుకోవడం వల్ల అమెరికన్ వర్కర్ల వేతనాలపై ప్రతికూల ప్రభావం పడటం లేదని కంపెనీలు సాక్ష్యాధారాలతో కార్మిక శాఖకు నిరూపించాల్సి ఉంటుంది. కార్మిక శాఖ ఈ సర్టిఫికేట్‌ను ఆమోదించిన తర్వాతే కంపెనీలు యూఎస్‌సీఐఎస్ వద్ద ఐ-140 పిటిషన్ దాఖలు చేయగలవు. ఇప్పుడు ఈ ప్రధాన మార్గాన్నే నిలిపివేయడంతో, ఈ కంపెనీలు తమ విదేశీ ఉద్యోగుల తరఫున కొత్తగా గ్రీన్ కార్డ్ ప్రక్రియను ప్రారంభించే అర్హతను తాత్కాలికంగా కోల్పోయినట్లయింది. అమెరికా అధికార యంత్రాంగం ఈ కఠిన చర్యకు దిగడానికి హెచ్-1బీ , పెర్మ్ నిబంధనల దుర్వినియోగమే ప్రధాన కారణమని స్పష్టం చేసింది.

# బోడుప్పల్‌లో వైభవంగా శ్రీ మాతా నిమిషాంబ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

## అక్టోబర్ 11 నుంచి అక్టోబర్ 20 వరకు వేడుకలు

## తొలిసారిగా మాలధారణ దీక్ష ప్రారంభం




బోడుప్పల్,అక్టోబర్ 09(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : శ్రీ సోమవంశ క్షత్రియ నకాష్ కులస్తుల కులదేవత శ్రీ మాతా నిమిషాంబ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు బోడుప్పల్‌లో అక్టోబర్ 11 నుంచి 20 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం,హంపీ పీఠం ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.అశోక్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాది నుంచి తొలిసారిగా శ్రీ మాతా నిమిషాంబ దేవి మాలధారణ దీక్షను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. తొలిరోజు మాలధారణ చేసుకున్న భక్తులు అక్టోబర్ 20న విజయదశమి సందర్భంగా దీక్ష విరమించవచ్చని పేర్కొన్నారు. ప్రతిరోజూ అమ్మవారికి విశేష అలంకరణలు,సామూహిక చండీ హోమం నిర్వహించనున్నారు. సరస్వతీ దేవి అలంకరణ రోజున విద్యార్థులతో సామూహిక సరస్వతీ హోమం, అన్నపూర్ణ దేవి అలంకరణ రోజున సామూహిక అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారుభక్తులకు ప్రత్యేక సౌకర్యాలునవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీరు, ప్రసాదం ఉచితంగా అందించడంతోపాటు ప్రదక్షిణలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఆలయం వద్ద పార్కింగ్ సౌకర్యం పరిమితంగా ఉన్నందున భక్తులు ప్రజా రవాణాను వినియోగించాలని నిర్వాహకులు సూచించారు. మెట్రో రైలులో ఉప్పల్ వరకు చేరుకుని అక్కడి నుంచి ఇతర రవాణా మార్గాల్లో ఆలయానికి రావచ్చన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఆలయ దర్శనంతోపాటు 16 వెయిల 108 ప్రదక్షిణలు చేసేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. భక్తులందరూ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని చైర్మన్ కామరౌతు వినోద్‌కుమార్,ప్రధాన కార్యదర్శి కె.అశోక్‌కుమార్ కోరారు.

# నేడు బోడుప్పల్ లో విద్యుత్ సరఫరాలో అంతరాయం




బోడుప్పల్,అక్టోబర్ 09( విజన్ ఆంధ్ర ప్రతినిధి) : నేడు చిలుకానగర్ విద్యుత్ డివిజన్ సరస్వతి కాలనీ ఫీడర్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు చిల్కానగర్ విద్యుత్ శాఖ ఏఈ వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు. సరస్వతి కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంటల వరకుశ్రీనగర్ కాలనీ,సరస్వతి కాలనీ, విజయపురి కాలనీ,సాయిరాం నగర్,ఉదయ్ నగర్,అశోక్ నగర్, ప్రశాంత్ నగర్ వరకు ప్రధాన రహదారి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందనివినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకొని విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ వినయ్ కుమార్ రెడ్డి కోరారు.

## ఐదో ఏడాది కేఎల్ఈఎఫ్‌కు ఐఐసీ 4-స్టార్ రేటింగ్

హైదరాబాద్, అక్టోబర్ 09 (విజన్ ఆంధ్ర) : కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వరుసగా ఐదో ఏడాది ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐఐసీ) అత్యున్నత 4-స్టార్ రేటింగ్ సాధించినట్లు యూనివర్సిటీ చాన్స్‌లర్ ఇంజినీర్ కోనేరు సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024--25 సంవత్సరానికి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ ప్రకటించిన ఈ గుర్తింపుతో పాటు, కేఎల్ఈఎఫ్‌కు చెందిన ఏడు విద్యార్థి బృందాలు ఫైనల్స్‌కు చేరాయని తెలిపారు. వీటిలో నాలుగు బృందాలు ఏఐసీటీఈ ప్రొడక్షన్ ఫెలోషిప్(ఏపీఎఫ్), మూడు బృందాలు యుక్తి ఇన్నోవేషన్ ఛాలెంజ్‌కు ఎంపికయ్యాయని తెలిపారు. ఆరు బృందాలు హానర్స్ త్రూ ఇన్నోవేషన్(హెచ్.టీ.ఐ) కార్యక్రమానికి చెందినవని చెప్పారు. ఈ కార్యక్రమాలు డా.జి.పార్థసారథి వర్మ నాయకత్వంలో, ఎండీఐఅండ్ఈ విభాగాధిపతి డా.కె.నరసింహరాజు పర్యవేక్షణలో అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో కొనసాగుతున్నాయని తెలిపారు.

# రోటరీ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర):మహబూబాబాద్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక వికాస్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఈకార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు దూదికట్ల సత్యం అధ్యక్షత వహించగా ప్రధానకార్యదర్శి శశీతన్ రామరాజు, కోశాధికారి ముల్లంగి మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భగా దూదికట్ల సత్యం మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానమైందని అన్నారు. ఈఅంశంపై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు 1992నుండి ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్య ప్రతియేటా అక్టోబర్ 10వ. తేదీన వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వికాస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. క్షణం తీరికలేని ఈ ఆధునిక కంప్యూటర్ యుగంలో వయసు బేధం లేకుండా ప్రతిఒక్కరూ మానసికాందోళనకు గురవుతున్నారని వాపోయారు. జీవన వ్యయం, పోటీతత్వానికి తోడు దుర్వ్యసనాలకు లోనై మానసికంగా క్రుంగి పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వత్తిడి, నిరాశనిస్పృహలకు లోనైనప్పుడు మనల్ని ప్రేమించే వ్యక్తులతో సమస్యను పంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. తద్వారా మానసికం ప్రశాంతత, జీవితానికి భరోసా కలుగుతుందని అన్నాడు. మనిషి శారీరకంగా ఎంత దృడంగా ఉన్నప్పటికీనీ మానసిక ఆరోగ్యమే జీవితాన్ని ఆత్మవిశ్వాసం వైపు నడిపిస్తుందన్నాడు. అచంచలమైన మనస్సును ఎప్పుడూ మన ఆధీనంలోనే ఉండాలన్నారు. తద్వారా మనస్సు మస్తిష్కంలో గూడుకట్టుకున్న చెడు ఆలోచనలవైపు పయనించదన్నాడు. మానసికాందోళనలో వున్నవారికి ఒక మంచిమాట, ధైర్యాన్ని అందించడం ద్వారా వారి మనస్సు తేలిక పడుతుందన్నారు. ఆరోగ్యకరమైన మనస్సులు, బలమైన వ్యక్తులు, ఆనందకరమైన సమాజం కోసం మనందరం కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈకార్యక్రమంలో సీనియర్ రోటేరియన్ బిక్కివెంకటేశ్వర్లు వల్లాల రమేష్ , కళాశాల అధ్యాపక బృందంతో పాటు విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

# భారత్ సముద్ర రంగ అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యాలు




హైదరాబాద్, అక్టోబర్ 09 (విజన్ ఆంధ్ర) : యువత, మహిళల భాగస్వామ్యం, అంతర్జాతీయ సహకారంతో భారత్ సముద్ర రంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రకటించినట్లు ఆ శాఖ కార్యదర్శి విజయ్ కుమార్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'సాగరమంథన్-2026'లో భాగంగా సౌదీ అరేబియా, బెల్జియం, భూటాన్ ప్రతినిధులతో ఓడరేవుల పెట్టుబడులు, గ్రీన్ షిప్పింగ్, వాణిజ్య మార్గాలు, నైపుణ్యాభివృద్ధిపై చర్చించారని తెలిపారు. సహాయ మంత్రి శంతను ఠాకూర్ గ్రీస్, లిథువేనియా, మొజాంబిక్, మయన్మార్ ప్రతినిధులతో పోర్టుల అభివృద్ధి, నౌకల నిర్మాణం, మరమ్మతులు, సముద్ర భద్రతపై చర్చలు జరిపారని చెప్పారు. 2030 నాటికి సముద్ర రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు 'మిషన్ 20 శాతం' లక్ష్యంగా పెట్టుకున్నట్లు సోనోవాల్ వెల్లడించారని తెలిపారు. 2070 నాటికి నెట్ జీరో లక్ష్య సాధనకు గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా, మిథనాల్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

## అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్ పనులను పరిశీలించిన మంత్రి కొల్లు

మచిలీపట్నం మంత్రి కొల్లు రవీంద్ర గురువారం అర్ధరాత్రి మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ కు వెళ్లారు. అర్ధాంతంగా పనులు నిలిపి వేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. అధికారుల బాధ్యతారాహిత్యం, గుత్తేదారు నిర్లక్ష్య వైఖరిపై అసహనం వ్యక్తం చేసారు. హార్బర్ నుండే కలెక్టర్ కు ఫోన్ చేసి మాట్లాడారు. కాంట్రాక్టర్ ఉద్దేశ్య పూర్వకంగా పనులు జాప్యం చేస్తున్నారని కలెక్టర్ కి ఫిర్యాదు చేసారు. మీరెందుకు దృష్టి పెట్టడం లేదని కలెక్టర్ ని ప్రశ్నించారు. మూడేళ్ల కాలపరిమితితో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఐదేళ్లు పూర్తయినా ఎందుకు పనులు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని నిలదీసారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేయాలని కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చారు. ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు సూచించారు. పనులు పూర్తి చేయడానికి నాలుగు నెలలు సమయం ఇవ్వాలని మంత్రిని గుత్తేదారు కోరారు. ఇంకెంత సమయం ఇవ్వాలని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇప్పటికే రెండు సంవత్సరాలు కాల పరిమితిని పెంచినా పురోగతి లేదని మండిపడ్డారు. సీ మౌత్ డిజైన్ రాకపోవడం వల్ల పనుల్లో ఆలస్యం అయిందని గుత్తేదారు తెలిపాడు. కుంటిసాకులు ఇంకెన్ని రోజులు చెబుతారని గుత్తేదారుపై మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరికలు జారీ చేసారు. తక్షణం పనులు ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేయకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేసి కాంట్రాక్టర్ ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.

# దివ్యాంగులకు వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, ట్రైసైకిళ్లు, వాకింగ్ స్టిక్స్, కళ్లద్దాలు, కృత్రిమ అవయవాలు తదితర పరికరాలు ఉచితంగా పంపిణీ

### అర్హులైన ప్రతి ఒక్కరికీ పరికరాలు అందేలా చర్యలు తీసుకోవాలి - అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9: (విజన్ ఆంధ్ర)హుస్నాబాద్ నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ (ఏ ఎల్ ఐ ఎం సి సహకారంతో ఏ డి ఐ పి పథకం కింద ఉచితంగా సహాయ పరికరాలు అందించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ డా,, బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో సహాయ పరికరాలు అవసరమైన దివ్యాంగులు, వృద్ధులు ఒక్కరు కూడా మిగిలిపోకూడదని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, ట్రైసైకిళ్లు, వాకింగ్ స్టిక్స్, కళ్లద్దాలు, కృత్రిమ అవయవాలు తదితర సహాయ పరికరాలను ఉచితంగా అందించనున్నారు. 80 శాతానికి పైగా వైకల్యం ఉన్న అర్హులకు ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లు అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.ప్రతి గ్రామంలో అర్హులను గుర్తించాలిఅర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలని మూడు జిల్లాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారులను డి డబ్ల్యు ఓమంత్రి ఆదేశించారు. ప్రతి గ్రామంలో



పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో సహాయ పరికరాలు అవసరమైన వారిని గుర్తించి, ఎవరూ మిస్ కాకుండా దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో డప్పు చాటింపు ద్వారా కూడా విస్తృత ప్రచారం కల్పించి, అర్హులందరికీ ఈ పథకంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.దరఖాస్తుకు అవసరమైన పత్రాలుఅర్హత కలిగిన వారు యు డి ఐ డికార్డు లేదా సదరం కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, దివ్యాంగుల పెన్షన్ కార్డు వంటి పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.ఈ నెల 15వ తేదీలోపు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎంపికైన లబ్ధిదారులకు ఈ నెల 27, 28, 29 తేదీల్లో సహాయ పరికరాలను పంపిణీ చేయనున్నారు.మూడు జిల్లాల పరిధిలో ప్రత్యేక పంపిణీ కేంద్రాలుహుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు మూడు జిల్లాల పరిధిలో ఉన్నందున, లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా వేర్వేరు ప్రాంతాల్లో పంపిణీ కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రి సూచించారు. – సిద్దిపేట జిల్లా: హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల లబ్ధిదారులకు హుస్నాబాద్ పట్టణంలో. – హనుమకొండ జిల్లా: భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల లబ్ధిదారులకు ముల్కనూరులో.కరీంనగర్ జిల్లా: చిగురుమామిడి, సైదాపూర్ మండలాల లబ్ధిదారులకు అందుబాటులో ఉండే ప్రాంతంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి పరికరాలు పంపిణీ చేయనున్నారు.సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామం నుంచి దివ్యాంగులు, వృద్ధులను ప్రత్యేక బస్సుల ద్వారా పంపిణీ కేంద్రాలకు తీసుకువచ్చేందుకు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే వారికి భోజన సదుపాయాలతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి, వారికి అవసరమైన సహాయ పరికరాలను అందించడమే లక్ష్యంగా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, మూడు జిల్లాల డీడబ్ల్యూఓలు, రాంగోపాల్ రెడ్డి (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ డిజేబిలిటీ), రవిశంకర్ (జాయింట్ మేనేజర్, ఈడీపీ), రవికృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాదానికి సింహస్వప్నం చేగువేరా

### చేగువేరా ఆశయాలను చంపలేరు.. విప్లవ స్ఫూర్తిని ఆపలేరు

### పదవులను వది ప్రజల విముక్తి కోసం పోరాడిన మహా విప్లవకారుడు చేగువేరా



నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర): అక్టోబర్ 9కామ్రేడ్ చేగువేరా 59వ వర్ధంతి సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా సీపీఐ కార్యాలయం లక్ష్మాచారి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చేగువేరా ప్రపంచ విప్లవోద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహా విప్లవకారుడని అన్నారు. పేదరికం, దోపిడీ, సామాజిక అసమానతలు, అణచివేతకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. 1928 జూన్ 14న అర్జెంటీనాలోని రొసారియోలో జన్మించిన చేగువేరా వైద్య విద్యను అభ్యసించి, ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన తర్వాత సామాజిక మార్పు కోసం విప్లవ మార్గాన్ని ఎంచుకున్నారని తెలిపారు. క్యూబా విప్లవ నాయకుడు ఫిడెల్ కాస్ట్రోతో కలిసి బాటిస్టా నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, 1959 క్యూబా విప్లవ విజయంలో కీలక పాత్ర పోషించారని వివరించారు.విప్లవం అనంతరం క్యూబాలో జాతీయ బ్యాంకు అధ్యక్షుడిగా, పరిశ్రమల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించిన చేగువేరా.. పదవులు, వ్యక్తిగత సౌకర్యాలకంటే తన ఆశయాలకే ప్రాధాన్యత ఇచ్చారని కొత్త సంతోష్ అన్నారు. అనంతరం కాంగో, బొలీవియా దేశాల్లోనూ విప్లవ పోరాటాలకు తన వంతు కృషి చేశారని తెలిపారు. ఆస్తమా వంటి ఆరోగ్య సమస్యలను సైతం లెక్కచేయకుండా పోరాటంలో కొనసాగిన ఆయన జీవితం త్యాగానికి, నిబద్ధతకు ప్రతీకగా నిలిచిందన్నారు. 1967 అక్టోబర్ 9న బొలీవియాలో 39 ఏళ్ల వయసులో చేగువేరా హతమైనప్పటికీ, ఆయన ఆశయాలుప్రపంచవ్యాప్తంగా సామాజిక న్యాయం కోసం పోరాడే ప్రజలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఒక మనిషిని అంతమొందించగలరేమో కానీ, ప్రజల హక్కుల కోసం ఆయన రగిలించిన చైతన్యాన్ని అంతం చేయలేరని అన్నారు.నేటి యువత చేగువేరా స్ఫూర్తితో చెడువ్యసనాలకు దూరంగా ఉండి, శాస్త్రీయ దృక్పథాన్నిఅలవర్చుకోవాలని, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, ఉపాధి అందరికీ సమానంగా అందే సమాజ నిర్మాణం కోసం యువత ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా సమితి నాయకులు సంతోష్, జగన్, విజయ్, యోగి, శరత్ తదితరులు పాల్గొని చేగువేరాకు ఘనంగానివాళులర్పించారు. విప్లవ జోహార్లు కామ్రేడ్ చేగువేరా!సామాజిక న్యాయం వర్ధిల్లాలి.. విద్యార్థి ఉద్యమం వర్ధిల్లాలి!

# వర్షాభావ పరిస్థితులపై సమగ్ర నివేదిక ఇవ్వండి

### కలెక్టర్ ఆదర్శ్ సురభి

### క్షేత్రస్థాయిలో పంట నష్టాలు, భూగర్భ జలాల అంచనా

### ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనుల విస్తరణ






?వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర) జిల్లాలో వర్షాభావ పరిస్థితులపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా అంచనా వేసి, పంట నష్టాలు, భూగర్భ జలాలు, తాగునీటి సరఫరా, విద్యుత్ అవసరాలు, ఉపాధి హామీ పనుల అమలుపై పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిన ప్రాంతాలను గుర్తించాలని సీఎస్ ఆదేశించినట్లు తెలిపారు. సాధారణ వర్షపాతం కంటే 20 శాతం లేదా అంతకంటే ఎక్కువ లోటు ఉన్న మండలాల వివరాలను సేకరించి, కరువు మండలాల గుర్తింపునకు అవసరమైన నివేదికలను సిద్ధం చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయం, సాగునీరు, తాగునీరు తదితర అంశాలపై ఈ నెల 12న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంత్రులతో నిర్వహించనున్న ప్రత్యేక సమావేశంలో చర్చించనున్న నేపథ్యంలో, అధికారులు శాఖల మధ్య సమన్వయంతో క్షేత్రస్థాయి డేటాను వేగంగా సేకరించాలని సూచించారు.పంట నష్టాలు, భూగర్భ జలాలపై దృష్టి

వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎండిపోయిన పంటలు, వర్షాభావంతో దెబ్బతిన్న భూములు, సాగు విస్తీర్ణంలో వచ్చిన మార్పులపై సమగ్ర వివరాలు సేకరించాలన్నారు. వ్యవసాయ గణాంకాలతో పాటు భూగర్భ జలాల స్థితిగతులు, సాగు, తాగునీటి లభ్యతపై నీటిపారుదల, వ్యవసాయ శాఖలు కలిసి పనిచేయాలని స్పష్టం చేశారు.

ఉపాధి హామీ పనుల వేగవంతంవర్షాభావ పరిస్థితుల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పని కొరత రాకుండా ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కూలీలకు స్థానికంగానే ఉపాధి కల్పించడంతో పాటు నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చెరువుల్లో పూడికతీత, సాగునీటి కాలువల మరమ్మతులు, ఫార్మ్ పాండ్స్ నిర్మాణం, ఇంకుడు గుంతల ఏర్పాటు వంటి పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఎస్పీ బాలాజీ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి (ణూూ) ఆంజనేయులు, సీపీఓ హరికృష్ణ, నీటిపారుదల శాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సీట్ల సర్దుబాటు ఎలా

విజయవాడ, అక్టోబరు 9,ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగనున్న వేళ, అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల సర్దుబాటు అత్యంత సంక్లిష్టమైన ఘట్టంగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉండవల్లిలో సమావేశమై పొత్తులు, మేయర్, జెడ్పీటీసీ, చైర్‌పర్సన్ స్థానాల విభజనపై సుదీర్ఘంగా చర్చించారు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో అగ్రనేతలు ఇద్దరూ కలిసి ఒక నిర్ణయం తీసుకుంటే నియోజకవర్గ స్థాయి వరకు కేడర్ క్రమశిక్షణతో పనిచేసింది. కానీ, గ్రామీణ, పట్టణ స్థాయి పోలింగ్ బూత్‌ల వద్ద ముఖాముఖి తలపడే స్థానిక పోరులో కేవలం బాబు–పవన్‌ల భేటీలు, పిలుపులు కింది స్థాయి శ్రేణులను పూర్తిగా ఒకే తాటిపైకి తేగలవా అనేది ఇప్పుడు ఏపీ రాజకీయంలో అసలైన ప్రశ్న.శాసనసభ ఎన్నికల్లో 21 స్థానాల్లో పోటీ చేసి 100% స్ట్రైక్ రేట్ సాధించిన తర్వాత జనసేన కేడర్ ఆత్మవిశ్వాసం, ఆకాంక్షలు ఆకాశాన్ని తాకాయి. సార్వత్రిక ఎన్నికల సమయాన రాష్ట్ర ప్రయోజనాల కోసం 21 సీట్లకే పరిమితమయ్యామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం తమ ఆత్మగౌరవానికి భంగం కలగనివ్వబోమని పవన్ కళ్యాణ్ తో పాటు జనసేన ముఖ్య నేతలు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో జనసేన గ్రాఫ్ బలంగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల నాటి ఫార్ములా ఇక్కడ వర్తించదని కేడర్ ఇప్పటికే తెగేసి చెబుతోంది. 30 శాతానికి పైగా స్థానాలు దక్కించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో సొంత నాయకత్వాన్ని బలపరుచుకోవాలని జనసేన పట్టుబడుతోంది.అటు తెలుగుదేశం పార్టీకి గ్రామీణ ఏపీలో ఐదు దశాబ్దాల బలమైన ఓటు బ్యాంకు, బూత్ స్థాయి బలగాలు ఉన్నాయి. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులు ఎదుర్కొని, స్థానికంగా పార్టీ జెండాను నిలబెట్టిన టీడీపీ గ్రామ స్థాయి నేతలు ఈసారి ఎలాగైనా పదవులు చేజిక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. చంద్రబాబు ఎన్ని సర్దుబాట్లు చెప్పినా.. తమకు దక్కాల్సిన సర్పంచ్, ఎంపీటీసీ లేదా కౌన్సిలర్ సీటును జనసేనకో, బీజేపీకో కేటాయిస్తే ఊరుకునే పరిస్థితి క్షేత్రస్థాయి టీడీపీ నేతల్లో లేదు. ఒకవేళ పార్టీ నుంచి అధికారికంగా బి–ఫామ్ రాకపోయినా 'రెబెల్స్'గా అభ్యర్థులను దింపడానికో లేదా స్వతంత్రంగా పోటీ చేయడానికో స్థానిక టీడీపీ శ్రేణులు వెనుకాడేలా లేవు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ కూటమిలోని అసమ్మతిని అనుకూలంగా మార్చుకోవడానికి వేచి చూస్తోంది. నియోజకవర్గ స్థాయిలో చంద్రబాబు, పవన్ ఎంత మైత్రిని ప్రదర్శించినా, పంచాయతీ, వార్డు స్థాయిలో కుటుంబాలు, పాత కక్షలు, వ్యక్తిగత ప్రాబల్యాలే గెలుపోటములను శాసిస్తాయి. కూటమిలో సీటు దక్కని టీడీపీ లేదా జనసేన అసంతృప్త నేతలు తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేస్తే ఓట్లు చీలిపోవడం ఖాయం. ఆ చీలిక ద్వారా తాము పుంజుకోవచ్చని వైఎస్సార్‌సీపీ ఆశిస్తోంది. ఈ రకమైన సాంప్రదాయ స్థానిక వైరుధ్యాలను అగ్రనేతలు పైస్థాయి నుంచి నియంత్రించడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి.ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనేందుకు చంద్రబాబు బలం ఉన్న చోట మిత్రపక్షానికే ప్రాధాన్యం అనే ఫార్ములాను ప్రతిపాదించారు. అయితే, ఒక నిర్దిష్ట పంచాయతీలో లేదా వార్డులో టీడీపీకి ఎక్కువ బలముందా, లేక జనసేనకు ఉందా అని తేల్చడం కత్తిమీద సాము లాంటిది. పార్టీ కమిటీల నిర్వహణ, ఉమ్మడి సర్వేలు, నామినేటెడ్ పదవుల హామీలతో అసంతృప్తిని చల్లార్చాలని బాబు–పవన్ ప్రయత్నిస్తున్నప్పటికీ, అధికారం తలుపు తడుదుతున్న వేళ పదవుల కోసం ద్వితీయ శ్రేణి నేతల మధ్య పోటీ రాపిడికి దారితీస్తోంది. రాష్ట్రస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఐక్యత ఎంత పటిష్టంగా ఉన్నప్పటికీ, స్థానిక ఎన్నికలు అనేది పూర్తిగా కింది స్థాయి నాయకుల ఉనికి, భవిష్యత్తుకు సంబంధించిన అంశం. పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో చోటుచేసుకునే ఫ్రెండ్లీ ఫైట్లు లేదా తిరుగుబాట్లు ప్రధాన కూటమి ఐక్యతను దెబ్బతీయకుండా, కేడర్‌ను సమన్వయం చేయడమే అమరావతి పెద్దలకు రాబోయే రోజుల్లో అతిపెద్ద సవాలు కానుంది.

# బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాజీ సీఎం కేసీఆర్



తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 09:తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా ఆడబిడ్డలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు.ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే ఆటపాటల సాంస్కృతిక వైభవమే బతుకమ్మ పండుగ అని ఆయన పేర్కొన్నారు. పువ్వులనే దేవతగా కొలుస్తూ, ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడబిడ్డల బతుకమ్మ పండుగ దేశంలోని సంప్రదాయ పండుగలన్నింటిలో ప్రత్యేకమైనదని కేసీఆర్ అన్నారు.తొమ్మిది రోజుల పాటు సందడి:ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగిసే తొమ్మిది రోజుల పండుగ రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య జరుగుతుందని కేసీఆర్ తెలిపారు. ఆడపడుచులు కుటుంబ సభ్యులు, పిల్లాపాపలతో కలిసి ఒకచోట చేరి బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో పండుగను ఘనంగా జరుపుకుంటారని అన్నారు. ప్రకృతిని పూజిస్తూ, తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ ప్రజల మధ్య ఐక్యత, ఆత్మీయతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు.బతుకమ్మకు రాష్ట్ర పండుగ హోదా:తెలంగాణ తొలి ప్రభుత్వం బతుకమ్మకు రాష్ట్ర పండుగ హోదా కల్పించడంతో పాటు, ఆడబిడ్డలకు కానుకగా చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని కేసీఆర్ గుర్తుచేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని తెలిపారు.తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలందరికీ కేసీఆర్ మరోసారి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# మలుపులు తిరుగుతున్న రాజకీయం

### రేవంత్ టార్గెట్ గా కేటీఆర్ 'ఓపెన్ లెటర్స్'

హైదరాబాద్, అక్టోబరు 9, తెలంగాణ రాజకీయం ప్రతిరోజూ కొత్త మలుపులు తిరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనా నిర్ణయాలు, వివాదాస్పద వ్యాఖ్యలు, బిఆర్ఎస్ శ్రేణులపై జరుగుతున్న పోలీసు కేసుల విచారణల సందర్భంలో.. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పదే పదే కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖలు రాయడం , ఎక్స్ వేదికగా నేరుగా ట్యాగ్ చేస్తూ రేవంత్‌ను అదుపులో పెట్టుకోండి అని డిమాండ్ చేయడం చర్చనీయాంశమవుతోంది. అయితే, కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత సన్నిహితుడిగా, తెలంగాణలో పార్టీని అధికారంలోకి తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డిపై ప్రత్యర్థి పార్టీ నాయకుడు ఫిర్యాదు చేస్తే రాహుల్ గాంధీ చర్యలు తీసుకుంటారా అంటే.. అసలు అటువంటి అవకాశమే లేదనేది అందరికీ తెలిసిన సత్యం. మరి లాజిక్‌కు అందని ఈ ఫిర్యాదుల వ్యూహం వెనుక కేటీఆర్ బిఆర్ఎస్ ఆశిస్తున్న అసలు రాజకీయం ఏమిటి?కేటీఆర్ లక్ష్యం రాహుల్ గాంధీ ద్వారా రేవంత్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకునేలా చేయడం కాదు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ప్రచారం చేసే భారత రాజ్యాంగ పరిరక్షణ , ప్రజాస్వామ్య విలువలు , వ్యక్తి స్వేచ్ఛ అనే సిద్ధాంతాలలోని నైతిక వైరుధ్యాన్ని జాతీయ స్థాయిలో ఎండగట్టడమే బిఆర్ఎస్ ప్రధాన వ్యూహం. ఢిల్లీలో ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు ఇచ్చే రాహుల్ గాంధీ, తెలంగాణలో తమ సీఎం రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ సోషల్ మీడియా నేతలను అరెస్ట్ చేస్తుంటే , విపక్షాల ప్రతినిధులపై కేసులు పెడుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారనే ప్రశ్నను కేటీఆర్ సమాజం ముందుకు తెస్తున్నారు.ఈ వ్యూహంలో ఉన్న మరో కీలకమైన అంశం.. నైతిక బాధ్యత ను అధిష్ఠానం భుజాన పెట్టడం. రేవంత్ రెడ్డి చేసే వ్యాఖ్యలు , నిర్ణయాలు కాంగ్రెస్ పార్టీ అధికారిక విధానమా కాదా అని ప్రశ్నించడం ద్వారా, రేవంత్ చర్యలకు రాహుల్ గాంధీ కూడా నైతిక బాధ్యత వహించక తప్పని పరిస్థితిని బిఆర్ఎస్ కల్పిస్తోంది. రాహుల్ గాంధీ ఈ ఫిర్యాదులపై స్పందించకపోయినా లేదా మౌనంగా ఉన్నా.. అది రేవంత్ నిర్ణయాలకు రాహుల్ మద్దతు ఉందనే సంకేతం అని, కాంగ్రెస్ మార్క్ సిద్ధాంతాలు కేవలం ప్రచారానికేనని నెటిజన్లలో ప్రచారం చేయడానికి బిఆర్ఎస్‌కు ఒక బలమైన లీడ్ లభిస్తోంది. దీనికితోడు, తెలంగాణ రాజకీయాలను కేవలం హైదరాబాద్ బోర్డర్లకే పరిమితం చేయకుండా జాతీయ మీడియా , ఢిల్లీ రాజకీయ వర్గాల్లోకి తీసుకెళ్లడానికి ఈ 'ఓపెన్ లెటర్స్' వ్యూహం తోడ్పడుతోంది. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీని నేరుగా ట్యాగ్ చేస్తూ లేఖలు రాసినప్పుడు లేదా విమర్శలు చేసినప్పుడు నేషనల్ మీడియా కూడా దీనిపై దృష్టి సారిస్తోంది.

# కాంగ్రెస్ వ్యూహాలకు ఎదురుదెబ్బలు

హైదరాబాద్, అక్టోబరు 9, తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ దూకుడు పెంచింది. ఆ పార్టీ దూకుడును అడ్డుకునేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలపై నమోదవుతున్న కేసులు కోర్టుల్లో నిలవట్లేదు. బలమైన సెక్షన్లు నమోదు చేయకపోవడంతో కేసులు కోర్టుల్లో వీగిపోతున్నాయి. ఇది అధికార పార్టీ వర్గాల్లో తీవ్ర కలవరం రేపుతోంది. రాజకీయ ప్రత్యర్థుల దూకుడుకు కళ్లెం వేయాలని భావిస్తున్న కాంగ్రెస్ వ్యూహాలు అడుగడుగునా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తమను అప్పటి ప్రభుత్వం ఎలా వేధించిందో, ఎన్నిసార్లు జైలుకు పంపిందో కాంగ్రెస్ నేతలు పదే పదే గుర్తుచేసుకుంటున్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అదే స్థాయిలో ప్రతిపక్ష నేతలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని భావించినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డిని, ఇతర ప్రముఖ నాయకులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై అధికార పార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు.అయితే.. పోలీసులు నమోదు చేస్తున్న కేసుల్లో గట్టి సెక్షన్లు ఉండటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నామమాత్రపు సెక్షన్ల కారణంగా నిందితులు సులభంగా కోర్టుల నుంచి ఊరట పొందుతున్నారు. జ్యుడీషియల్ రిమాండ్ దక్కకపోగా, కొద్ది గంటల్లోనే బెయిల్ పై బయటకు వస్తున్నారు. ఇది కాంగ్రెస్ శ్రేణులను నిరుత్సాహపరుస్తోంది. పోలీసుల తీరుపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. గతంలో తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కఠినమైన పోలీసు చర్యలను ఎదుర్కొన్నామని.. కానీ ఇప్పుడు ప్రతిపక్షాలపై అలా ఎందుకు వ్యవహరించలేకపోతున్నారని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ భవిష్యత్తులో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి ఏమిటనే అభద్రతాభావం కొందరు నేతల్లో కనిపిస్తోంది.పోలీస్ యంత్రాంగం సరైన లీగల్ సెక్షన్లను ప్రయోగించడంలో విఫలమవుతోందని, దీనివల్ల అధికార పార్టీ పరువు పోవడంతో పాటు ప్రత్యర్థులకు రాజకీయ మైలేజీ దక్కుతోందని పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము ఫిర్యాదులు ఇస్తున్నప్పటికీ, తగిన ఆధారాలతో కూడిన పటిష్టమైన ఎఫ్ఐఆర్‌లు నమోదు కాకపోవడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని వాపోతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో కీలక చర్చ జరుగుతోంది. ఎంతమందిపై కేసులు పెట్టామనేదాని కంటే, పెట్టిన కేసులు ఎంత బలంగా ఉన్నాయనే దానిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకత్వం భావిస్తోంది.

# జిల్లాల పునర్వ్యవస్థీకరణతో పరిపాలనా సౌలభ్యం

**- పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సంబరాలు**

**- విద్యాసంస్థల్లో విద్యార్థులకు స్వీట్ల పంపిణీ**





వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్రంలో నూతన జిల్లాల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో స్వీట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పీజీ కళాశాల, జేఎన్‌టీయూ, నర్సింగ్ కళాశాల, మెడికల్ కళాశాల తదితర విద్యాసంస్థల ప్రాంగణాల్లో విద్యార్థినీ విద్యార్థులకు నాయకులు స్వీట్లు అందజేశారు..?ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ... జిల్లాల ఏర్పాటు వల్ల పరిపాలన ప్రజలకు మరింత చేరువైందని, స్థానికంగానే పరిపాలనా సౌలభ్యం పెరిగిందని అభిప్రాయపడ్డారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లేలా నిర్ణయం తీసుకున్నందుకు గాను మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి విద్యార్థులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ?అనంతరం బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ... తెలంగాణలో చిన్న జిల్లాల ఏర్పాటు వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశాలను, దాని ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందాలనే లక్ష్యంతోనే కొత్త జిల్లాలు అమల్లోకి వచ్చాయని, పదేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మానసిక దివ్యాంగులపై వివక్ష చూపవద్దు

**- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి దీప కాసరగడ్డ**



వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర) : మానసిక అనారోగ్యం, మేధో వైకల్యం ఉన్న వారి పట్ల సమాజంలో ఎటువంటి వివక్ష చూపకూడదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి దీప కాసరగడ్డ పిలుపునిచ్చారు. అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మండల వికలాంగుల పునరావాస కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.?ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ... 'నల్సా- మానసిక అనారోగ్యం మరియు మేధో వైకల్యాలు ఉన్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు పథకం, 2024' ప్రకారం మానసిక వైకల్యం కలిగిన వారికి ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. వారి హక్కులను కాపాడటంలో చట్టం ఎల్లప్పుడూ తోడ్పడుతుందని తెలిపారు.?అనంతరం మనో వైద్యురాలు పుష్పలత మాట్లాడుతూ... మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు కౌన్సెలింగ్ కోసం మానసిక ఆరోగ్య కేంద్రాన్ని లేదా 'టెలి మానస్' ఉచిత టోల్ ఫ్రీ నంబర్ 14416 ను సంప్రదించి తగిన సహాయం పొందవచ్చని సూచించారు. ?ఈ కార్యక్రమంలో వికలాంగుల పునరావాస కేంద్రం జిల్లా ప్రాజెక్ట్ అధికారి ఆనంద్, ప్రిసైడింగ్ ఆఫీసర్, సీసీ, మానసిక దివ్యాంగులు మరియు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మాంటిస్సోరి స్కూల్‌లో అలరించిన బతుకమ్మ సంబరాలు



వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర) : దసరా సెలవులను పురస్కరించుకొని పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని మాంటిస్సోరి హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రకరకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి పాఠశాల ప్రాంగణంలో కొలువుదీర్చారు. అనంతరం బతుకమ్మ పాటలకు విద్యార్థులు వేసిన నృత్యాలు అందరినీ విశేషంగా అలరించాయి.?ఈ వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ డి.రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలుసుకొని, వాటిని కాపాడుకోవాలని సూచించారు. భావితరాలకు మన పండుగల విశిష్టతను అందించడంలో ఇటువంటి వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి

**- వనపర్తి ఎస్పీ డి.సునితా రెడ్డి**

**- బాధితులకు సకాలంలో న్యాయం అందించడమే లక్ష్యం**

**- పోలీసు అధికారుల నేర సమీక్షా సమావేశంలో ఆదేశాలు**



వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల త్వరితగతిన పరిష్కారం మరియు ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని వనపర్తి జిల్లా ఎస్పీ డి. సునితా రెడ్డి, ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

***ఈ-సాక్ష్య విధానంలో ఆధారాల సేకరణ***

ప్రతి ఎఫ్ఐఆర్‌ను ఈ-సాక్ష్య విధానంలోనే నమోదు చేయాలని, నిబంధనలకు అనుగుణంగా డిజిటల్, శాస్త్రీయ ఆధారాలను సేకరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. కేసుల దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు, నూతన భారతీయ న్యాయ సంహిత నిబంధనల ప్రకారం 60 రోజులు, 90 రోజుల కాలపరిమితి కలిగిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

***సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వాడాలి***

ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్‌లు, జీరో ఎఫ్ఐఆర్‌ల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. టీజీ కాప్, హెచ్ఆర్ఎంఎస్, సీఈఐఆర్ పోర్టల్లతో పాటు నాట్‌గ్రిడ్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణను పెంచి, నేర దర్యాప్తులో ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు.

***అత్యవసర ఫిర్యాదులపై తక్షణ స్పందన***

'డయల్-112' ద్వారా అందే అత్యవసర కాల్స్‌పై వెంటనే స్పందించి బాధితులకు సకాలంలో సహాయం అందించాలని తెలిపారు. ఈ-పెట్టీ కేసులు, ఐటీ యాక్ట్, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. చార్జ్‌షీట్ల దాఖలు శాతాన్ని పెంచడంతో పాటు, సమన్లు మరియు వారెంట్ల అమలును ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు.? ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ?ఈ సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీలతో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యకు పెద్దపీట

**--ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.22.88 కోట్ల నిధులు**

**--మున్సిపల్ చైర్ పర్సనల్ కృష్ణారెడ్డి హర్షం**




సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర , అక్టోబర్ 9: జోగిపేట పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ. 22.88 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ కృషితో కళాశాల నిర్మాణ, పునరుద్ధరణ పనుల కోసం ఈ నిధులు మంజూరయ్యాయి. మంత్రి దామోదర రాజనర్సింహ కృషితో నిధులు మంజూరు కావడం పట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ యస్. కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, డాకూర్ వెంకటేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి దామోదర్ రాజనర్సింహ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు కావడం విద్యార్థులకు, విద్యారంగానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిన్న జారీ చేసిన ఈ నిధులతో కళాశాలలో ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవకాశం కలగనుంది. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, ఉన్నత విద్యను మరింత బలోపేతం చేయడానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు జోగిపేట--ఆందోల్ నియోజకవర్గ అభివృద్ధిలో విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. విద్యారంగ అభివృద్ధికి మరో ముందడుగు.. జోగిపేట ఎన్టీఆర్ స్పోర్ట్స్ క్రీడారంగం అభివృద్ధికి గత నెల పది కోట్ల రూపాయలు కావడం విద్యార్థుల భవిష్యత్తుకు కొత్త ఆశలు! చిగురిస్తాయి అని పార్టీ నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు పడిగే సత్యం మున్సిపల్ వ కౌన్సిలర్ రాజశేఖర్ మాజీ కౌన్సిలర్ సురేందర్ గౌడ్ అల్లే శ్రీకాంత్ కోరబోయిన నాగరాజు అనిల్ తుపాకుల సునీల్ చిట్యాల మధు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మున్నూరు కాపులను విస్మరించిన ప్రభుత్వం హక్కుల సాధనకై పోరాటం చేస్తాం

***తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య***




సిద్ధిపేట, జిల్లా ప్రతినిధిఅక్టోబర్ 9: విజన్ ఆంధ్ర : సిద్దిపేట జిల్లా కేంద్రంలో గల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మున్నూరు కాపుల హక్కుల సాధనకై ఐక్య పోరాటం చేయాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, జిల్లా అధ్యక్షుడు ఆకుల బాలయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం రిజిస్ట్రేషన్ కు సంబంధించిన యాప్ ను సిద్దిపేట ప్రెస్క్లబ్లో సంఘం నాయకులు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.అధిక సంఖ్యలో జనాభా కలిగి ఉన్న మున్నూరు కాపులకు రాజ్యాధికారం రావడంలేదని.....అందరూ కలిసికట్టుగా ఉంటేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. మున్నూరు కాపులందరినీ ఐక్యం చేసేందుకు గ్రామ గ్రామాన తిరిగి సంఘాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే సంఘ సభ్యుల రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక ఆప్పు రూపొందించామని తెలిపారు. ఈ యాప్ ను జిల్లాలోని మున్నూరు కాపు సంఘ సభ్యులు అందరూ తమ మొబైల్ ఫోన్లలో ఘఘ.ఎబఅఅబ-తీబఝిఞూబయిఅస్థుఎ.శీతీస్త్ర అని సెర్చ్ చేసి డౌన్లోడ్ చేసుకొని తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా మున్నూరు కాపుల సంఖ్య ఎంత ఉందనేది రాష్ట్ర ప్రభుత్వానికి తెలుస్తుంది అన్నారు. అలాగే ఎన్నికల నిర్వహణకు కూడా రిజిస్ట్రేషన్ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్క మున్నూరు కాపు సంఘం సభ్యులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అలాగే జిల్లా కమిటీలు, నియోజకవర్గం, మండలం, గ్రామాల వారిగా కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు నాయకం మల్లయ్య, వెంకటేశ్వర్లు, రమేష్, ప్రభాకర్, శ్రీనివాస్, భగవాన్, భూషణం, దేవరాజు, సుధాకర్, బాల్ రెడ్డి, లింగం, వెంకటేష్, తిరుపతి, నారాయణ, సత్యం, నర్సయ్య, పలువురు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు స్నేహా సొసైటీ అండగా నిలవడం అభినందనీయం

***మానసిక దివ్యాంగులకు స్నేహా సొసైటీ అండగా నిలవడం అభినందనీయమని నిజామాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ముద్దసాని నీలిమ అన్నారు.***




నిజామాబాద్ అక్టోబర్09:( విజన్ ఆంధ్ర) : మానసిక దివ్యాంగులకు స్నేహా సొసైటీ అండగా నిలవడం అభినందనీయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్? సివిల్? జడ్జి ముద్దసాని నీలిమ అన్నారు. నగరంలోని మారుతినగర్?లో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు.

దివ్యాంగులను పెంచడం కష్టంగా భావించొద్దు..

ఈ సందర్భంగా సీనియర్? సివిల్? జడ్జి నీలిమ మాట్లాడుతూ.. దివ్యాంగులను పెంచడం కష్టంగా భావించొద్దన్నారు. అలాగే వారిని పెంచడం పెద్ద కష్టమైన పనేమి కాదని వివరించారు. అలాంటి వారికి స్నేహా సొసైటీ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అనిర్వచనీయమన్నారు. మానసిక ఆరోగ్యం పట్ల సమాజంలో అవగాహన లేని రోజుల్లో ఒక మానసిక వికలాంగుల పాఠశాల ఏర్పాటు చేయాలంటే సిద్దయ్య జ్యోతిలు ఎంతో శ్రమపడి ఉంటారన్నారు. వారి శ్రమకు ఫలితమే నేడు అనేకమంది దివ్యాంగులు విద్యను ఇతర సేవలను అందుకోగలుగుతున్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన మెడికల్? కళాశాల మానసిక వైద్యశాఖాధిపతి డాక్టర్ విశాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ దివ్యాంగ బాలలను చిన్న వయసులోనే గుర్తిస్తే వారి వైకల్యాన్ని తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య ఉపసంచాలకులు పురుషోత్తమ నాయక్, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇన్నమూరి రవితేజ, స్నేహ సొసైటీ కార్యదర్శి, అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, టాటా ఇన్సూరెన్స్ మేనేజర్ సాయిరాం, రాజశ్రీ, బాలాజీ, సత్యనారాయణమూర్తి, సుమన్, మానసిక దివ్యాంగుల తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఘన సన్మానం

***అమరవీరుల కుటుంబ సభ్యులు, కవులు, కళాకారులకు ఘనంగా సత్కారం***



నిజామాబాద్, అక్టోబర్ 9: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, కవులు, కళాకారులను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కొత్త జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, షకీల్ ఆమీర్, వీజీ గౌడ్ తదితర నాయకులు హాజరయ్యారు. వారి చేతుల మీదుగా తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, కవులు, కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పోరాటం, అమరవీరుల త్యాగాలు, ప్రజల భాగస్వామ్యం మరువలేనివని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ఉద్యమానికి నాయకత్వం వహించారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో జిల్లాలు, మండలాలు, గ్రామపంచాయతీల పునర్వ్యవస్థీకరణ చేపట్టినట్లు వివరించారు. స్థానిక ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేలా కొత్త పరిపాలనా విభాగాల ఏర్పాటు దోహదపడిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, కవులు, కళాకారుల సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాయకులు అన్నారు. ఈ సందర్భంగా సుజిత్ సింగ్, ప్రభాకర్ రెడ్డి, విశాలిని రెడ్డి, సత్య ప్రకాష్‌తో పాటు పలువురు తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, పట్టణ అధ్యక్షుడు సిర్ప రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు పకడ్బందీగా జరగాలి

**- డిసెంబరు 30న తుది జాబితా ప్రచురణ**

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**




వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర) : మహబూబ్‌నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా తయారీ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) పి. సుదర్శన్ రెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్‌తో కలిసి కలెక్టరేట్ నుంచి ఆయన పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఫారం-18 దరఖాస్తులతో పాటు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే నిర్ణయం తీసుకోవాలన్నారు. ముఖ్యమైన షెడ్యూల్ ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ.?నవంబర్ 25 నుండి అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ మరియు పరిష్కారం. అనుబంధ జాబితాల తయారీ, ముద్రణ పూర్తి. తుది ఓటరు జాబితా ప్రచురణ. ఓటరు జాబితా తయారీలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితత్వం, పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి మధు శేఖర్ గారిని ఎం జె హాస్పిటల్లో మర్యాదపూర్వకంగా కలిసిన రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్స్ జేమ్స్ అనిల్ కుమార్.



ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర) : గౌరవ చేయూత సంస్థల వ్యవస్థాపకులు పూర్వ జాతీయ అసోసియేషన్ ఆఫ్ సర్జన్ ఆఫ్ ఇండియా ఏఎస్ఐ కార్యదర్శి మరియు. కోశాధికారి డాక్టర్ బి మధు శేఖర్ గారిని ఆర్మూర్ లోని ఎం జె ఆస్పత్రి నందు మర్యాద పూర్వకంగా కలిసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జేమ్స్ అనిల్ కుమార్. ఈ సందర్భంగా డాక్టర్ మధుశేఖర్ నూతనంగా ఎన్నుకోబడిన రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జెమ్స్ అనిల్ కుమార్ ను అభినందించి శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువతో సత్కరించి రెడ్ క్రాస్ సొసైటీ సేవలు విస్తృత పరచాలని గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తేవాలని అత్యవసర రక్త సేవలను అందించే ప్రయత్నం చేయాలని యువకులలో రెడ్ క్రాస్ సొసైటీ సేవల విషయంలో అవగాహన కల్పించాలని రెడ్ క్రాస్ సొసైటీకి వైద్యుల సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఈ సందర్భంగా డాక్టర్ మధు శేఖర్ తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జక్కుల శ్రీధర్ ఐడియా సాగర్ భెన్నాజీ రాజేందర్ మార్వాడి భవాని పోశెట్టి రాజు. గంగా నరసయ్య నందకిషోర తదితరులు పాల్గొన్నారు.

# రబీలో ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలి

**- కలెక్టర్ ఇలా త్రిపాఠి**

నిజామాబాద్, అక్టోబర్ 09 :(విజన్ ఆంధ్ర )ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురవడంతో జలాశయాలలో నీటి వనరులు తక్కువ మోతాదులో అందుబాటులో ఉన్నందున రబీ సీజన్లో రైతులు ఆరుతడి పంటలే సాగు చేసేలా విస్తృత స్థాయిలో అవగాహన కలిగించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో వీబీ జీరాంజీ పనులకు పెద్ద ఎత్తున కూలీలు వస్తున్నందున దీర్ఘకాలంలో ఉపయోగపడే పనులను చేపట్టాలన్నారు. తెలంగాణకు జలసిరి కార్యక్రమంలో భాగంగా పంట కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టి జల సంరక్షణకు కృషి చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి వృధా జరగకుండా చూడాలన్నారు. వర్షపాతం, ఇతర శాఖల సమగ్ర వివరాలను నిర్దేశిత సమయంలోగా అందజేయాలని ఆదేశించారు. వీ.సీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాభావం వల్ల జలాశయాలలో నీటి నిల్వలు సరిపడా లేకపోవడంతో పాటు భూగర్భజలాలు కూడా పడిపోయే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వరి సాగు చేస్తే ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉన్నందున క్షేత్రస్థాయిలో రైతులకు వాస్తవ పరిస్థితి వివరిస్తూ ఆరుతడి పంటలు విత్తుకునేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డీఆర్ఓ గీత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలలో విద్యార్థులకు మెరుగైన వైద్య విద్యను అందించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,అక్టోబర్ 09,(విజన్ ఆంధ్ర); ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పన, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులకు అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చినప్పుడే వారి సామర్థ్యాలు పెరుగుతాయని, అలాగే వారు మంచి వైద్యులుగా తీర్చిదిద్దబడతారని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. వైద్య కళాశాలలోని విద్యార్థుల సంఖ్య, వారి విద్యా సంబంధిత విషయాలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు నిర్దేశిత పరీక్షలను నిర్వహిస్తూ, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆయా విభాగాల్లో అవసరమైన వైద్య సేవలను అందించేందుకు కావలసిన పరికరాలన్నీ ప్రాధాన్యత క్రమంలో సమకూర్చుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ రాజేందర్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, డిసిహెచ్ఓ కాశీనాథ్, ఇతర అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భూ రీసర్వే ప్రక్రియలు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పగడ్బందీగా పూర్తిచేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు



మెదక్ అక్టోబర్ 9, విజన్ ఆంధ్ర : మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం శాలిపేట్ గ్రామంలో భూభారతి భూముల రి సర్వే ను ఏడి సర్వే కిషన్ , తాసిల్దార్ సింధు రేణుక తో కలిసి క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు గ్రామ పరిధిలో మొత్తం .534 ఎకరాల రెండు కుంటల భూమి ఉండగా ఇప్పటివరకు సుమారు ..278 ఎకరాల 27 కుంటల మేర సరిహద్దుల నిర్ధారణ సర్వే పూర్తి చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ భూమి 341 ఎకరం 5 కుంటలు ఇనామ్ ల్యాండ్ 17 కుంటలు ,అసైన్డ్ ల్యాండ్ 240 ఎకరా లు12 కుంటలు శిఖం ల్యాండ్61 ఎకరాలకు సంబంధించి ఇంతవరకు సర్వే కంప్లీట్ చేయడం జరిగింది మిగిలిన సర్వే ప్రక్రియ రైతు వారి ఆధీనంలో ఉన్న భూములను సర్వే నిర్వహిస్తున్నామని దీనిలో హెచ్చుతగ్గులు ఏమైనా ఉంటే నోటీసులు ఇవ్వడం జరుగుతుందని అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలపాలని పునః పరిశీలన పగడ్బందీ మ్యాపులతో డిజిటల్ సర్వే పూర్తవుతున్నారు ఒకరి భూమి మరొకరికి పోయే ఆస్కారం ఉండదని వివరించారు ఆధునిక సాంకేతికతను వినియోగించి, పాత రికార్డులతో సరిపోల్చుతూ భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. సరిహద్దుల విషయంలో రైతుల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేయాలని సూచించారు. రీ-సర్వే తర్వాత రికార్డులు మరింత స్పష్టంగా ఉండి, భవిష్యత్తులో యాజమాన్య సమస్యలు తలెత్తకుండా రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ అధికారులు సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు

# నిర్ణీత గడువులోగా కస్టమ్ మిల్లింగ్ బియ్యం పంపిణీ పూర్తి చేయాలి

**- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 9(విజన్ఆంధ్ర) : నిర్ణీత గడువులోగా కస్టమ్ మిల్లింగ్ బియ్యం పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి జిల్లా లింగంపేటలోని ఉమా మహేశ్వర్ రైస్ మిల్లును శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తనిఖీ చేసి, మిల్లులో జరుగుతున్న ధాన్యం మిల్లింగ్ ప్రక్రియతో పాటు కస్టమ్ మిల్లింగ్ బియ్యం (సీఎంఆర్) పంపిణీ పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా మిల్లులో ధాన్యం మిల్లింగ్ కార్యకలాపాలను పరిశీలించిన కలెక్టర్, భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు సరఫరా చేయాల్సిన సీఎంఆర్ బియ్యం నిల్వలు, ఇప్పటివరకు పంపిణీ చేసిన బియ్యం పరిమాణం, ఇంకా పెండింగ్‌లో ఉన్న బియ్యం వివరాలపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బియ్యం పంపిణీని వేగవంతం చేసి, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఎఫ్‌సీఐ, పౌర సరఫరాల సంస్థకు బియ్యం సరఫరా పూర్తి చేయాలని మిల్లు యాజమాన్యాన్ని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, బియ్యం పంపిణీకి సంబంధించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని రైస్ మిల్లుల యాజమాన్యాలు తమకు కేటాయించిన సీఎంఆర్ బియ్యాన్ని నిర్ణీత గడువులోగా పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు. బియ్యం సరఫరాలో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఆర్డీఓ ప్రభాకర్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో సత్తా చాటాలి

**- ఆర్చరీ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల్ గౌడ్**



కామారెడ్డి బ్యూరో (దోమకొండ) అక్టోబర్ 9(విజన్ఆంధ్ర) : రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో సత్తా చాటాలని కామారెడ్డి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల తిరుమల్ గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ ఆర్చరీ పోటీల్లో దోమకొండకు చెందిన పది మంది క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని ఆయన శుక్రవారం అభినందించారు.

- ఇండియన్ రౌండ్ విభాగంలో పురుషుల కేటగిరీలో ఎం. శ్రీధర్ కాంస్య పతకం సాధించగా, ఎస్.కె. రెహాన్ నాలుగో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో ఎన్. ప్రీతి కాంస్య పతకం సాధించారు. జె. స్రిజ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.
- రికర్వ్ రౌండ్ విభాగంలో పురుషుల కేటగిరీలో ఎం. అనుదీప్ బంగారు పతకం, ఎ. నవీన్ కాంస్య పతకం సాధించారు. ఎస్. స్నేహిత్ నాలుగో స్థానంలో నిలిచారు. మహిళల విభాగంలో కె. సింధూజ బంగారు పతకం, బి. నిఖిత రజత పతకం, బి. ఇందు కాంస్య పతకం సాధించి ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కామారెడ్డి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు అనిల్ కామినేని, కార్యదర్శి మోహన్ రెడ్డి, కోచ్ ప్రతాప్ దాస్ సైతం అభినందించారు. క్రీడాకారుల విజయాలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**- రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం**

జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు 2026 అక్టోబర్ 11న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లోపాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా రాణించి దోమకొండకు, కామారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోచ్ ప్రతాప్ దాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలకు ఘన నివాళి.

**- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతల తీవ్ర విమర్శలు.**

**- బాల్కొండ మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**





నిజామాబాదు అక్టోబర్ 09:( విజన్ ఆంధ్ర ) తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల కుటుంబాలను, ఉద్యమకారులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనల మేరకు నిర్వహిస్తున్న పదేళ్ల పండుగ కార్యక్రమాల్లో భాగంగా, నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారులు, అమరుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి పద్నాలుగేళ్ల పోరాట చరిత్ర ఉందని, కేసీఆర్ నాయకత్వంలో సాగిన పదేళ్ల పాలనకు, నేటి కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య తేటతెల్లమైన వ్యత్యాసం ప్రజలు గమనిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. జిల్లాకు మంత్రి లేకపోవడంపై విమర్శిస్తూ, టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జిల్లా వాసి అయినప్పటికీ మంత్రి పదవి దక్కకపోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ హయాంలోని రైతుబంధు వంటి పథకాలను తొలగిస్తే రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సలహాలతో కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని నిజామాబాదు రూరల్ మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ కొనియాడారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం, 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా వంటివి రైతన్నలకు ఎంతగానో ఉపయోగపడ్డాయని, కాంగ్రెస్ పాలనలో హామీల అమలు గాలికి కొట్టుకుపోయిందని మండిపడ్డారు. కేసీఆర్ సుమారు పదిహేనేళ్లు కష్టపడి ఉద్యమాన్ని నడిపారని, అమరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరచిపోకూడదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో విద్యుత్ సరఫరా, యూరియా కొరత రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయని విమర్శించారు. కేసీఆర్ దార్శనికత వల్లే నిజామాబాద్ నూతన కలెక్టరేట్, బైపాస్ రోడ్డు వంటి అభివృద్ధి కార్యక్రమాలు సాధ్యమయ్యాయని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాలకు అందిన సంక్షేమ ఫలాలు దేశానికే రోల్ మోడల్ గా నిలిచాయని మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్ పేర్కొన్నారు. పల్లెప్రగతి ద్వారా గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారాయని, ఉద్యమకారులను గౌరవించడం ద్వారా మన చరిత్రను సజీవంగా ఉంచుకుంటున్నామని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు చెప్పారు. నిజామాబాద్ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ఘనత బీఆర్ఎస్ కే దక్కుతుందని మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. కేసీఆర్ పాలనలో నిజామాబాద్ నగరం ఎంతో అభివృద్ధి చెందిందని, మహిళలకు అనేక వసతులు కల్పించామని నగర మాజీ మేయర్ దండు నీతూ కిరణ్ గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, రైతుల అభ్యున్నతి కోసం కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని మాజీ ఎంపీపీ సుమనా రవి రెడ్డి తెలిపారు. కేసీఆర్ హయాంలోనే పేదలకు, యువతకు భవిష్యత్ దక్కిందని, కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని మాజీ కార్పొరేటర్ విశాలిని రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణ ఎందరో ఉద్యమకారుల త్యాగాల ఫలితమని, ఆ చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీఆర్ఎస్ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాజిరెడ్డి జగన్ పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకు కాలమే సమాధానం చెబుతుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు బీఆర్ఎస్ నగర అధ్యక్షులు సిర్ప రాజు, ప్యాట సంతోష్, సుజిత్ సింగ్ ఠాగూర్, నాగారం నర్సింగ్, రంగు సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పై అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవు

**- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్**



మెదక్ అక్టోబర్ 9, విజన్ ఆంధ్ర : మెదక్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాల పురోగతి, రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ఎలినో ప్రభావంతో రానున్న వేసవి కాలంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మళ్లించడం, సూపర్ ఎలినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం వివిజి రామ్ పథకం ద్వారా కూలీల సంఖ్య పెంచడం సంబంధిత అంశాలపై ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో మంజూరై ఇంకను మొదలు పెట్టని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లబ్ధిదారులపై ప్రత్యేక ఫోకస్ పెట్టి వెంటనే ఇండ్లు నిర్మించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు, ,అదే విధంగా ఆయా మండలాల పరిధిలో బేస్‌మెంట్ లెవల్, రూఫ్ లెవల్, రూఫ్ కాస్టెడ్ వంటి వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రెండో విడతలో అర్హత గల లబ్ధిదారుల జాబితా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు ఈ నెలలో దసరా తర్వాత వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. ఎల్ నీ నో ప్రభావం వల్ల రానున్న యాసంగి సీజన్ కు ప్రమాదం ఉందని, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. సూపర్ ఎల్ ని నో ప్రభావం వల్ల త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నీటిని వృధా చేయరాదన్నారు. బి వి జి రామ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీల సంఖ్య పెంచాలని, ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల గళం గుజ్జ సత్యంకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

**- తోటకూర శ్రీకాంత్.**



ములుగు అక్టోబర్ 09 విజన్ ఆంధ్ర ప్రతినిధి : బీసీ ఉద్యమ నేత, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలని బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీల హక్కుల కోసం సుదీర్ఘ పోరాటం చేస్తూ, 20 ఏళ్లుగా విద్యా, వైద్య రంగాల్లో సేవలందిస్తున్న గుజ్జ సత్యం సేవలను గుర్తించి, సీఎం రేవంత్ రెడ్డి ఆయన పేరును గవర్నర్ కోటాకు సిఫారసు చేయాలని కోరారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గా రేండ్ల సంతోష్ పటేల్



ములుగు అక్టోబర్ 09, విజన్ ఆంధ్ర ప్రతినిధి : తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ములుగు జిల్లా కన్వీనర్ గా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన రేండ్ల సంతోష్ పటేల్ ను నియమించారు. మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసినందుకు గుర్తించి ఈ పదవి ఇచ్చినట్లు రాష్ట్ర చైర్మన్ గుడిమల్ల రవికుమార్ తెలిపారు. బాధ్యతతో ముందుకు తీసుకెళ్తానని సంతోష్ పటేల్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కుడికాల భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జినుకల లక్ష్మణరావు పటేల్, ప్రచార కార్యదర్శి వ్యాసబట్టు మధుసూదన్ రాజు, పంచగిరి రమేష్ అడ్వకేట్ తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

**- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

**- పెబ్బేరు బీసీ బాలికల హాస్టల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**





**ముందుగా రుచి చూశాకే భోజనం వడ్డించాలి**

?వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబరు 9 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యం, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి స్పష్టం చేశారు. పెబ్బేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని బీసీ బాలికల వసతి గృహంలో బుధవారం రాత్రి విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో శుక్రవారం ఆయన హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించి పరిపరిస్థితులను పరిశీలించారు. ?విద్యార్థినులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, తాగునీరు, వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ రాత్రి చికెన్ భోజనం చేసిన తర్వాతే అస్వస్థతకు గురైనట్లు విద్యార్థినులు తెలపగా, ఘటనకు గల కారణాలపై అధికారులను విచారించారు. మొత్తం 22 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా, అందరినీ వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించామని బీసీ సంక్షేమ శాఖ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఆహారం కలుషితం కావడం వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురై ఉండవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వసతి గృహంలోని తాగునీటి శుద్ధి యంత్రం (ఆర్వో) ఫిల్టర్‌ను వెంటనే మార్చాలని, ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.?విద్యార్థినులకు భోజనం వడ్డించే ముందు సంబంధిత అధికారులు తప్పనిసరిగా ఆహారాన్ని రుచి చూసి, నాణ్యతపై పూర్తి నమ్మకం కలిగిన తర్వాతే వడ్డించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సురక్షితమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన సౌకర్యాలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కలెక్టర్ వెంట బీసీ సంక్షేమ శాఖ అధికారిణి ప్రమీల, ఇతర అధికారులు ఉన్నారు.

## జర్నలిస్టులకు లయన్స్ సన్మానం.



ములుగు అక్టోబరు 09; శుక్రవారం హన్మకొండ ప్రెస్ క్లబ్ లో లయన్స్ 320 ఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సన్మానం జరిగింది. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ సుధాకర్ రెడ్డి అధ్యక్షతన ములుగు జర్నలిస్ట్ చుంచు రమేష్ సేవలను గుర్తించి సత్కరించారు. చుంచు రమేష్ మాట్లాడుతూ .... తనను గుర్తించి సత్కరించినందుకుగాను డిస్ట్రిక్ట్ గవర్నర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# చేనేత కార్మికులకు అండగా ఉంటాం

**- మగ్గంపై చీర నేసిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- అమరచింతలో వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ సందర్శన**



వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో చేనేత రంగాన్ని అభివృద్ధి చేసి, కార్మికులకు అన్ని విధాలా అండగా ఉంటామని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శుక్రవారం అమరచింతలోని 'హ్యాండ్లూమ్ వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ'ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ చీరల తయారీ విధానాన్ని పరిశీలించడమే కాకుండా, స్వయంగా మగ్గంపై కూర్చొని చీర నేసి కార్మికులను ఉత్సాహపరిచారు.?అనంతరం కలెక్టర్ చేనేత కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అమరచింత చీరల విశిష్టతను పరిశ్రమల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు రుణాలు పొందేందుకు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని, తయారీ యూనిట్‌లో ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం 'రూఫ్‌టాప్ సోలార్' వ్యవస్థను ఏర్పాటు చేయాలని కార్మికులు ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు.

సులభంగా రుణాలు అందేలా చర్యలు

కార్మికుల విజ్ఞప్తులపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. చేనేత కార్మికులకు బ్యాంకుల ద్వారా సులభంగా రుణాలు అందేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే తయారీ యూనిట్‌లో సోలార్ వ్యవస్థ ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలించాలని పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులను (ఏడీ) ఆదేశించారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలో చేనేత శాఖ ఏడీ ఇందిర, స్థానిక మండల అధికారులు, పరిశ్రమల శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.







## నాగన్న బావి పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలి - కలెక్టర్



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 9 (విజన్ఆంధ్ర) : నాగన్న గారి బావి పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలని కలెక్టర్ అన్నారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని నాగన్న గారి బావిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సందర్శించి, అక్కడి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. బావి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నాగన్న గారి బావి పరిసరాల్లో ఎలాంటి అపరిశుభ్రతకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బావి పరిసరాల్లో ఆహార పదార్థాలను వినియోగించకుండా తగిన చర్యలు చేపట్టాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని ఆదేశించారు. పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, తహసిల్దార్ సురేష్, ఎంపీడీవో ప్రవీణ్, మండల స్పెషల్ ఆఫీసర్ సురేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# మాలల రోస్టర్ డిమాండ్ ని పరిష్కారం చేయాలి,

*మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి: డాక్టర్ పిడమర్తి రవి*



మాలల రోస్టర్ సమస్య మాదిగలకు అవరోధం కాకుండా పరిష్కరించి మాదిగలకు తెలంగాణ రాష్ట్రంలో 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పిడమర్తి రవి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాన్సిరాం 20వ వర్ధంతి సందర్భంగా లిబహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్ అధ్యక్షతనలి బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రంలో కాన్సీరామ్ ఆలోచన విధానం పునర్జీవం చేయగలమా అనే అంశంపై జరిగిన సమావేశంలో లిముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించిన డాక్టర్ పిడమర్తి రవిలి తెలంగాణ రాష్ట్రంలో మాల మాదిగలు కలిస్తేనే మాన్య కాన్సిరాం గారి ఆలోచన విధానం మరియు ఆయన ఆశయ సాధన సాధ్యమవుతుందని అన్నారు. మరో లిఅతిథి మాస్టర్ జిలి మాట్లాడుతూ కాన్షిరామ్ గారు ఆలోచన విధానం తెలంగాణ రాష్ట్రంలో పునర్జీవం చేయాలంటే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు అగ్రకులంలోని పేదలు ఏకమై బహుజన రాజ్య స్థాపన ఒక్కటే మార్గమని అన్నారు. మూఢనమ్మకాల నిర్మూలన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బైరి నరేష్లి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓట్లను అమ్ముకొని ఓటరే కాన్సిరాం వారసులు అని అన్నారు. రానున్న రోజుల్లో కానిషిరాం సిద్ధాంతాలు ఆశయాల కోసం అన్ని పార్టీలు కలిసి పనిచేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గద్ద యాదయ్య, నేషనల్ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు బుదాల బాబురావు, రజక సంఘం జాతీయ అధ్యక్షులు ముప్పురీ బిక్షపతి,ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నంద్రు నరసింహ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జల మల్లికార్జున్, చాగంటి రాములు, సాంసంగ్ రాజు, గిరిజన మహాశక్తి రాష్ట్ర అధ్యక్షులు చందర్ నాయక్,మాదిగ యూత్ జాక్ రాష్ట్ర అధ్యక్షులు నక్క మహేష్, రింగు రాంబాబు, జోగు గణేష్ దేవరకొండ నరేష్,మీసాల మహేష్ ,పోలేని నరేందర్, పరిగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలమర్రికి పర్యాటక శోభ.. ఆధునిక హంగులతో అభివృద్ధి!

- రూ.2.5 కోట్లతో అభివృద్ధి పనులు.. పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- సైన్స్ మ్యూజియం, చిల్డ్రన్స్ పార్కు, ఆక్వేరియం ఆధునికీకరణకు ప్రతిపాదనలు
- చారిత్రక ప్రదేశాల పరిరక్షణతో పాటు పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం





మహబూబ్‌నగర్, అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర): మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం పిల్లలమర్రిని ఆధునిక సౌకర్యాలతో ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. పర్యాటకులకు మెరుగైన అనుభూతి కల్పించేలా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు, చారిత్రక ప్రదేశాల పరిరక్షణ, పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శుక్రవారం పిల్లలమర్రిని సందర్శించిన కలెక్టర్.. పర్యాటక, అటవీ, మత్స్య, విద్య, పురావస్తు శాఖల ఆధ్వర్యంలో రూ.2.5 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, చేపట్టాల్సిన పనులు, ఆధునికీకరణకు అవసరమైన ప్రతిపాదనలు, బడ్జెట్ అంచనాలపై పలు సూచనలు చేశారు.

## సందర్శకులకు మెరుగైన మౌలిక సదుపాయాలు

పిల్లలమర్రి పర్యాటక ప్రాంతంలోని ప్రవేశ ద్వారం, టికెట్ కౌంటర్, మరుగుదొడ్లు, ప్రహరీ తదితర అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచి, పర్యాటక ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. సైన్స్ మ్యూజియాన్ని పరిశీలించిన ఆమె.. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియం తరహాలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. చిల్డ్రన్స్ పార్కులో పాతబడిన ఆట పరికరాలను తొలగించి, వాటి స్థానంలో రంగురంగుల ఆధునిక ఆట పరికరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన నిధుల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

## చారిత్రక సంపద పరిరక్షణకు చర్యలు

పురావస్తు శాఖ ఆధ్వర్యంలోని ప్రదర్శనశాలను సందర్శించిన కలెక్టర్.. ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు చారిత్రక ప్రాధాన్యత కలిగిన వస్తువులు, విగ్రహాలను పరిశీలించారు. వాటి చరిత్ర, ప్రత్యేకతలు, ప్రాధాన్యతను సందర్శకులకు తెలియజేసేలా సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పాత భవనాల స్థితిగతులను పరిశీలించిన ఆమె.. పైకప్పు పెచ్చులు ఊడుతున్న భవనాలకు మరమ్మతులు చేపట్టేందుకు లేదా పునరుద్ధరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. సైన్స్ మ్యూజియం పరిసరాల్లో చెత్తాచెదారం, గడ్డి లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. పిల్లలమర్రి ప్రసిద్ధ మర్రిచెట్టు పరిసరాలను పరిశీలించిన కలెక్టర్.. ప్రాంగణంలో పరిశుభ్రతను కాపాడుతూ, పచ్చదనం పెంపొందించేలా ల్యాండ్‌స్కేపింగ్ చేపట్టాలని సూచించారు. సందర్శకులకు తాగునీరు, చెత్తబుట్టలు వంటి సౌకర్యాలు కల్పించాలని, గడ్డి, మొక్కలు పచ్చగా ఉండేలా క్రమం తప్పకుండా నీటిని అందించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. కేఫ్‌టేరియా ప్రాంతంలోనూ పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు.

## జింకల సంరక్షణ.. ఆక్వేరియం ఆధునికీకరణ

జింకల పార్కును సందర్శించిన కలెక్టర్.. అక్కడి జింకల సంఖ్య, వాటికి అందిస్తున్న ఆహారం, తాగునీరు, సంరక్షణ చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్కులో సుమారు 85 జింకలు ఉన్నట్లు అధికారులు వివరించారు. జింకల సంరక్షణతో పాటు వాటి ప్రాధాన్యతపై సందర్శకులకు అవగాహన కల్పించేలా అటవీశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలోని ఆక్వేరియాన్ని పరిశీలించిన కలెక్టర్.. సుమారు 27 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాన్ని ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ, సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల సమన్వయంతో సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఆధునిక ఆక్వేరియంలు, 3డీ గ్రాఫిక్స్, ఆకర్షణీయమైన పెయింటింగ్స్‌తో పాటు సందర్శకులను ఆకట్టుకునే ప్రదర్శనలను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు అవసరమైన నిధుల కోసం మత్స్యశాఖ కమిషనర్ ద్వారా ప్రతిపాదనలు సమర్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆక్వేరియం, జంతు ప్రదర్శన ప్రాంతాల్లోని వివిధ రకాల జలచరాలు, పాములు, ఇతర జీవుల గురించి విద్యార్థులు, సందర్శకులకు అవగాహన కల్పించేలా సమాచార సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాటి జీవన విధానం, ప్రత్యేకతలు, పర్యావరణంలో వాటి పాత్రను వివరించే సమాచారాన్ని స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. పిల్లలమర్రిలోని అన్ని పర్యాటక ఆకర్షణలను సమగ్రంగా అభివృద్ధి చేసి, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు. అవసరమైన పనులకు సంబంధించి బడ్జెట్ అంచనాలు, ప్రతిపాదనలు, కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, జిల్లా అటవీ అధికారి ఎం. నవీన్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి జె. రాజశేఖర్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి రాధా రోహిణి, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి, విద్యాశాఖ ఏఎంఓ డి. శ్రీనివాస్, అటవీశాఖ అధికారులు, పర్యాటక శాఖ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా 13వ వార్షిక మెగా ఈవెంట్స్ అవార్డుల ప్రదానోత్సవం

**విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ రాణించాలి: అడిషనల్ డీసీపీ నరసయ్య**





హైదరాబాదు: అక్టోబర్ 09; అంబర్పేట్ డీడీ కాలనీలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో 13వ వార్షిక మెగా ఈవెంట్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ జె. నరసయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకాడమిక్ హైట్స్ రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డైరెక్టర్లు రూపా రెడ్డి, కౌశిక్ రెడ్డి, ప్రిన్సిపల్ సులక్షణ లతో కలిసి క్రీడలు, వివిధ పోటీలు, ఇతర రంగాల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు అడిషనల్ డీసీపీ నరసయ్య బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన అలవర్చుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర సృజనాత్మక రంగాల్లోనూ పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో పనిచేస్తూ విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని డైరెక్టర్ రూపా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు తమ బహుమతులను అందుకుని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనలు, ఉత్సాహభరిత వాతావరణం మధ్య వార్షిక అవార్డుల ప్రదానోత్సవం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ప్రయోజనానికే భూముల రీసర్వే

- కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి
- ఫతేపూర్ లో నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియ పరిశీలన
- పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశం
- రైతుల సమక్షంలో సర్వే నిర్వహించాలని మార్గనిర్దేశం





నిజామాబాద్, అక్టోబర్ 09 :( విజన్ ఆంధ్ర) రైతులు, భూ యజమానుల ప్రయోజనాలను కాపాడుతూ, భవిష్యత్తులో వారికి ఎలాంటి భూ సమస్యలు తలెత్తకూడదు అనే సదుద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే జరిపిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. ఈ ప్రక్రియకు రైతులు పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. సాలూర మండలం ఫతేపూర్ లో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, రోవర్ సహాయంతో సర్వే నిర్వహిస్తున్న తీరును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా పాటిస్తూ, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, తద్వారా ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కావని అధికారులకు సూచించారు. రైతులు, పట్టాదార్లకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ప్రతిరోజు సగటున 30 ఎకరాల చొప్పున సర్వేను నిర్వహిస్తూ, వేగవంతంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే, తమ దృష్టికి తేవాలన్నారు. సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం అందించి, వారి సమక్షంలో సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. భూమి హద్దుల వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాగా, సాలూర మండలంలో తొలి విడతలో మూడు గ్రామాలలో భూముల రీసర్వే జరుగుతోందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటికే బోధన్ రెవెన్యూ డివిజన్ లోని పోతంగల్, రెంజల్ తదితర మండలాల్లో 3వేల ఎకరాల వరకు విస్తీర్ణంలో సర్వే ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. రీసర్వే వల్ల భవిష్యత్తులో సరిహద్దు సమస్యలు ఉత్పన్నం కావని, తద్వారా భూ వివాదాలకు ఆస్కారం ఉండదని, భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్వే విషయంలో రైతులకు, భూ యజమానులకు ఏవైనా సందేహాలు ఉంటే గ్రామ పంచాయతీ అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ విజయకుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు శ్రీనివాస్ రావు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు ఉన్నారు.

# సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**- అదనపు కలెక్టర్ వి.భుజంగరావు**



నిజామాబాద్, అక్టోబర్ 09 :( విజన్ ఆంధ్ర ) సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు సూచించారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాన్ని నిజామాబాద్ కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ నేతృత్వంలో ఆయా శాఖల అధికారులు ఎల్.సీ.డీ తెరపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. సమాచార హక్కు చట్టం అమలు ఆవశ్యకతపై రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, ఇతర అతిథుల ప్రసంగాలను ఆలకించారు. ఆర్.టి.ఐ అమలుపై చేయించిన ప్రతిజ్ఞలో అన్ని శాఖల పీఐఓలు, ఏపీఐఓలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. సమాచార హక్కు చట్టాన్ని గౌరవిస్తూ, పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో అందిస్తామని, స్వచ్ఛందంగా ఇవ్వవలసిన సమాచారాన్ని పౌరులకు అందుబాటులో ఉండేలా వ్యవహరిస్తామని, పనితీరులో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పాటిస్తూ పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సమాచార చట్టాన్ని పక్కాగా అమలు చేస్తూ, నిజామాబాద్ జిల్లాకు కూడా అవార్డులు సాధించి ప్రత్యేక గుర్తింపు తేవాలని అదనపు కలెక్టర్ సూచించారు. నిర్ణీత గడువు లోపు సమాచారాన్ని అందిస్తూ, రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలన్నారు. లేనిపక్షంలో అప్పిలేట్ అథారిటీ చేపట్టే చర్యలకు గురి కావాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి గీత, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అమ్మవారికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం

## ధన్ పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టు చీరల పంపిణీ...



నిజామాబాద్ అక్టోబర్09:( విజన్ ఆంధ్ర ) దుర్గామాతకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని ధన్ పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్లు ఉదయ్ కుమార్, ప్రణయ్ కుమార్, డాక్టర్ వినయ్ కుమార్ లు పేర్కొన్నారు. నగరంలోని మిర్చి కంపౌండ్ లో గల డీఎస్ఎన్ కార్యాలయంలో అమ్మవారి మండప నిర్వాహకులకు ట్రస్టు ఆధ్వర్యంలో పట్టు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా గత పది సంవత్సరాలుగా అమ్మవారి మండపాలకు పట్టుచీరలను పంపిణీ చేస్తున్నామన్నారు. నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నియమ నిబంధనలతో నవరాత్రులను జరుపుకోవాలన్నారు. ఇందూరు నియోజకవర్గంలోని ప్రతి మండపానికి తమ వంతు సహకారంగా చీరలను అందజేస్తున్నామన్నారు. హిందూ పండుగల్లో అమ్మవారి నవరాత్రులకు ఎంతో ప్రత్యేకత ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం ఇందూరులో మండపాలు పెరుగుతున్నాయని, యువత భక్తి మార్గంలో పయనిస్తున్నారన్నారు. లోకమాత దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు మఠం పవన్, బంటు రాము, మల్కాయి మహేందర్, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి మురళి, ధాత్రిక పరమేశ్వర్, నాయకులు పవన్ ముందడ, మారావార్ కృష్ణ, శ్రీనివాస్, బాబీ సింగ్, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ రాజాగౌడ్



నిజామాబాద్, అక్టోబర్ 09 :( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా (రెవెన్యూ) రాజాగౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్ కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన మర్యాదపూర్వకంగా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ కు స్వాగతం పలికి, పరిచయం చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా కొనసాగిన ఎస్.కిరణ్ కుమార్ పదవీ విరమణ చేయగా, ఆయన స్థానంలో జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా కొనసాగుతున్న రాజాగౌడ్ ను నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ప్రభుత్వం ఇటీవలే పోస్టింగ్ కల్పించింది. ఈ మేరకు ఆయన శుక్రవారం ఇక్కడికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్ఓ గీత, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ ను బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలిసి స్వాగతం పలికారు. కాగా, అదనపు కలెక్టర్ రాజాగౌడ్ ఇదివరకు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని బాన్సువాడ, బోధన్, ఆర్మూర్ లలో రెవెన్యూ డివిజనల్ అధికారిగా (ఆర్.డీ.ఓ)గా విధులు నిర్వర్తించారు.

# భూ భారతి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

**- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ అక్టోబర్ 9, విజన్ ఆంధ్ర : మెదక్ జిల్లా లో భూ భారతి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలనీ మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్,ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న పెండింగ్ భూ భారతి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలనీ అధికారులను ఆదేశించారు. భూ భారతి దరఖాస్తులను ఆర్డీవో,తహసిల్దార్ లాగిన్ లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిష్కరించాలన్నారు. భూభారతి దరఖాస్తులలో జిల్లా స్థాయి ప్రజావాణి దరఖాస్తులు, రాష్ట్రస్థాయి ప్రజావాణి దరఖాస్తులు, ఎస్సీ ,ఎస్టీ బీసీ కమిషనర్ల నుంచి వచ్చిన దరఖాస్తులను ఏ స్థాయిలో పెండింగ్లో ఉన్నాయో తెలుసుకొని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఏడి ల్యాండ్ సర్వే కిషన్,మెదక్ ఆర్డిఓ రమాదేవి, తాహసిల్దార్లు, రెవెన్యూ శాఖ ఉద్యోగులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక లారీలకు ఎస్పీ వార్నింగ్ వేగం తగ్గించకపోతే సీజ్!

**- ములుగు ఎస్పి రామ్నాథ్ కేకన్**



ములుగు అక్టోబర్ 09, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లాలో ఇసుక లారీల అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, అక్రమ పార్కింగ్ పై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవర్లతో పాటు యజమానులే బాధ్యులని, వాహనాలు సీజ్ చేస్తామన్నారు. తాగి నడిపితే చర్యలు తప్పవని, ప్రజలు కూడా అలాంటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# రావణ వధ ఉత్సవం ఏమైనా అంటరానిదా?

## చైర్మన్ తీరుపై కౌన్సిలర్ గండ్రకోట వాణి కుమార్ ఫైర్



ములుగు అక్టోబర్ 09, విజన్ ఆంధ్ర ప్రతినిధి : శుక్రవారం ఒక ప్రకటనలో వార్డు కౌన్సిలర్ గండ్రకోట వాణి కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ వ్యక్తులతో కలిసి మున్సిపాలిటీ నిధులను దోచుకుంటే ప్రశ్నించడం తప్పా అని అన్నారు. రావణ వధ మహోత్సవం 25 ఏళ్లుగా పారదర్శకంగా జరుగుతోందని, ఇప్పుడు దానిపై ఆరోపణలు చేయడం దొంగే దొంగ అన్నట్లు ఉందన్నారు. 2010లో కోశాధికారిగా ఉన్నప్పుడు చైర్మన్ బిక్షపతి 16 వేలు బకాయి పెట్టిన చరిత్ర కమిటీకి తెలుసని విమర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు మున్సిపాలిటీలు రావణ వధను అధికారికంగా నిర్వహిస్తున్నారు. తమ కమిటీ ప్రతి ఏటా సేకరించిన విరాళాలు ఖర్చులు, మిగులును 20 వేల మంది ముందు మైకులో, యూట్యూబ్ లైవ్ లో చెబుతుందని, ఇంత పారదర్శకత ఎక్కడా ఉండదన్నారు. 2013లో రెండు ప్రధాన పార్టీల నాయకులు దీన్ని రాజకీయ ఉత్సవంగా మార్చడంతో ప్రజల కోరిక మేరకు తాము దీపావళికి నరకాసుర వధను కూడా ప్రారంభించామన్నారు. మున్సిపాలిటీలో సెప్టెంబర్ లో కౌన్సిల్ తీర్మానం లేకుండా నర్సంపేటకు చెందిన ప్రైవేట్ వ్యక్తికి (విశ్వం సౌండ్) 12 లక్షల పనిని నామినేషన్ పై ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కమిషనర్ సంపత్ రెడ్డి ఆ వ్యక్తి 30 లక్షలు అడిగాడని 19వ వార్డు కౌన్సిలర్ ఓంప్రకాష్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఉదయ్ ముందు చెప్పడం వాస్తవం కాదా అన్నారు. చైర్మన్ కు దెబ్బ తగిలిందని మీటింగ్ పెట్టలేదనడం దొంగ సాకు అని, చైర్మన్ లేకపోతే వైస్ చైర్మన్, కమిషనర్ మీటింగ్ పెట్టాలని చట్టం చెబుతోందన్నారు. 25 ఏళ్ల హిందూ ధార్మిక ఉత్సవంపై ఆరోపణలు చేస్తే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తిరుగుబాటు వస్తుందని హెచ్చరించారు. సఫాయి సిబ్బంది జీతాలు 9 నెలలుగా 9 వేల నుండి 16 వేలకు పెంచకుండా మున్సిపాలిటీని లోటు బడ్జెట్ లోకి నెట్టారని ఆరోపించారు. రంజాన్ కు రూ.3500 మొరం ట్రిప్పర్ కు, రూ.1000 టెంట్ కు అయితే రూ.50 వేల బిల్లు పెట్టారని విమర్శించారు. మరోసారి చవకబారు ఆరోపణలు చేస్తే నాలుగేళ్ల అవినీతిని ఆధారాలతో బయటపెడతామని ఘాటుగా హెచ్చరించారు తాను డబ్బు పంచి గెలిచిన వ్యక్తిని కాదని, స్వతంత్రంగా ఎదుర్కొన్న కుటుంబం తమదని అన్నారు.

# కల్వకుర్తిలో పట్టభద్రుల ఓటర్ నమోదు ప్రక్రియ ప్రారంభం

**- నవంబర్ 6 వరకు గడువు, - మున్సిపల్ కమిషనర్ పిలుపు!**




కల్వకుర్తి, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 09: మహబూబ్ నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరూ వెంటనే పట్టభద్రుల ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ ప్రెస్ నోట్ ద్వారా పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టభద్రుల ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తప్పకుండా ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ ఓటర్ నమోదు ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం మరియు ఎన్నికల సంఘం నిర్దేశించిన అర్హతలు, నిబంధనలను పాటిస్తూ అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న అర్హులైన పట్టభద్రులందరూ ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా తమ ఓటర్ నమోదును పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకున్న వారు కూడా ఈసారి మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని గుర్తుచేశారు. ఓటర్ నమోదుకు 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ లేదా దానికి సమానమైన డిప్లొమా లేదా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండటం తప్పనిసరి అని, గ్రాడ్యుయేట్ ఓటర్ గా నమోదు చేసుకోవడానికి చివరి తేదీ నవంబర్ 6, 2026 అని కమిషనర్ తెలిపారు. గడువు తేదీలోగా నమోదు చేసుకోకపోతే ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఓటర్ నమోదుకు ఆధార్ కార్డు, డిగ్రీ లేదా గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో మరియు మొబైల్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు ఆన్‌లైన్ ద్వారా సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చని, దీనికోసం https://ceotserms2.telangana.gov.in/MLC/Form18.aspx అనే లింక్ ను ఓపెన్ చేసి Form-18 ద్వారా అప్లై చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఏవైనా సందేహాలు ఉంటే కల్వకుర్తి మున్సిపాలిటీ కార్యాలయాన్ని సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ తన తెలియజేశారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు!

**- పంటల సాగులో మార్పులు.. తాగునీరు, విద్యుత్‌కు ప్రత్యేక కార్యాచరణ**

**- వరి విస్తీర్ణం 2 లక్షల నుంచి 90 వేల ఎకరాలకు కుదింపు**

**- కంది, ఉద్యానవన పంటల సాగు పెంపునకు ప్రోత్సాహం**

**- కరువు నివారణ చర్యలకు నిధుల కొరత లేదు: సీఎస్ సంజయ్ జాజు**



మహబూబ్‌నగర్, అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర):దఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ సరఫరా, గ్రామీణ ఉపాధి తదితర రంగాల్లో ముందస్తు ప్రత్యామ్నాయ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లాలో వ్యవసాయ ప్రణాళికలో మార్పులు చేపట్టడంతో పాటు నీటి వనరుల సంరక్షణ, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఖరీఫ్ పంటల పరిస్థితి, వర్షపాతం లోటు, రాబోయే రబీ సీజన్ ప్రణాళిక, ప్రత్యామ్నాయ పంటల సాగు, విద్యుత్ డిమాండ్, తాగునీటి సరఫరా, వి.బి.జి. రామ్‌జీ పథకం అమలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తన క్యాంపు కార్యాలయంలోని ఛాంబర్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొని జిల్లాలో నెలకొన్న వ్యవసాయ పరిస్థితులను వివరించారు.

### *37 వేల ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం*

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా సుమారు 12,974 ఎకరాల్లో పంటలు ఒత్తిడికి గురయ్యాయని, దాదాపు 37 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా మొక్కజొన్న, పత్తి పంటలు వర్షాభావంతో తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. కరువు నిబంధనల ప్రకారం సీసీ కుంట మండలంలో 61 శాతం వర్షపాతం లోటు నమోదైనందున ఆ మండలం కరువు పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. మరో నాలుగు మండలాల్లోనూ 50 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైనట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. మండలాల వారీగా వర్షపాతం లోటు, పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### *రబీ సాగులో మార్పులు.. ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యం*

రాబోయే రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు ప్రణాళికను రూపొందించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు జిల్లాలో వరి సాగు విస్తీర్ణాన్ని గతంలో ఉన్న రెండు లక్షల ఎకరాల నుంచి సుమారు 90 వేల ఎకరాలకు తగ్గించినట్లు తెలిపారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా కంది సాగు విస్తీర్ణాన్ని 12 వేల ఎకరాల నుంచి 19 వేల ఎకరాలకు పెంచినట్లు తెలిపారు. అలాగే ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణాన్ని 17 వేల ఎకరాల నుంచి 23 వేల ఎకరాలకు పెంచినట్లు వివరించారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు నష్టం తగ్గించేలా పంటల ప్రణాళికను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

### *తాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి*

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో కరువు పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మండలాల వారీగా వర్షపాతం లోటును విశ్లేషించడంతో పాటు పంటల పరిస్థితి, భూగర్భ జలాల లభ్యత, తాగునీటి అవసరాలు, గ్రామీణ ఉపాధిపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. నీటి సంరక్షణలో భాగంగా వి.బి.జి. రామ్‌జీ పథకం కింద నీటి కుంటల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాతో పాటు ఎత్తిపోతల పథకాలకు అవసరమైన మేరకు విద్యుత్ అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఇందుకు నిధుల కొరత లేదని పేర్కొన్నారు.

### *పంచాయతీల వారీగా తాగునీటి ప్రణాళిక*

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారికి ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీల వారీగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమన్వయం చేసుకొని తాగునీటి సరఫరా పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. నీటి కొరత ఏర్పడే గ్రామాలను ముందుగానే గుర్తించి, అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి నర్సింహులు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆ క్లినిక్ లో అసలేం జరిగింది..?

## ఇంజక్షన్ అనంతరం బాలుడి మృతి..!




- పేరు ఒక డాక్టర్‌ది.. వైద్యం మరొకరిదా.?
- అనిరుషిక్ మృతితో కలకలం, అంతులేని ప్రశ్నలు..!
- పోలీసుల దర్యాప్తు, వైద్యశాఖ తనిఖీలపై ప్రశ్నలు..!
- ప్రైవేట్ క్లినిక్‌లపై పర్యవేక్షణ ఎక్కడ..?
- మరో చిన్నారి బలికావాలా..?

**వైద్యం చేసింది ఒకరు.. ప్రిస్క్రిప్షన్‌పై పేరు మరొకరిది! పిల్లల వైద్యుడి పేరుతో క్లినిక్ నిర్వహిస్తూ ఆర్ఎంపీ చికిత్స అందించారనే ఆరోపణలు.. ఇంజక్షన్, సెలైన్ ఇచ్చిన అనంతరం తొమ్మిదో తరగతి విద్యార్థి మృతి.. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు.. అయినా కీలక ప్రశ్నలకు సమాధానాలు ఎక్కడ?**




మేడ్చల్ జిల్లా/బోడుప్పల్, అక్టోబర్ 09 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : చెంగిచెర్ల క్రాంతి కాలనీలోని ఎస్ఎన్ఎల్ఎస్ క్లినిక్‌లో అనిరుషిక్ మృతి ఘటన ఇప్పుడు పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ అధికారుల దర్యాప్తుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఆర్ఎంపీ సాయికృష్ణ చికిత్స చేసినట్లు బాలుడి తల్లిదండ్రులు చెబుతుండగా, ఆయన రాసినట్లు పేర్కొంటున్న ప్రిస్క్రిప్షన్‌పై మాత్రం డాక్టర్ వినిత్ రెడ్డి, ఎంబీబీఎస్, ఎండీ, (పీడియాట్రిషియన్) అని ఉండటం ఈ వ్యవహారంలో కీలకంగా మారింది. అసలు చికిత్స చేసింది ఎవరు? మరో వైద్యుడి పేరు ఉన్న లెటర్‌హెడ్ పై మందుల వివరాలు ఎందుకు



రాశారు? ఆ వైద్యుడు అక్కడ ఉన్నారా? ప్రిస్క్రిప్షన్ నిజానిజాలను పోలీసులు పరిశీలించారా? బాలుడి మృతికి కారణం ఏమిటి? ఈ ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### ప్రిస్క్రిప్షన్‌పై ఒకరి పేరు.. చికిత్స మరొకరు చేశారా?

చెంగిచెర్ల క్రాంతి కాలనీలోని ఎస్ఎన్ఎల్ఎస్ క్లినిక్‌లో బాలుడు అనిరుషిక్ కు సాయికృష్ణ చికిత్స అందించినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.అయితే ప్రిస్క్రిప్షన్‌పై డాక్టర్ వినిత్ రెడ్డి పేరు, వైద్య అర్హతలు ముద్రించి ఉన్నాయని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రిస్క్రిప్షన్ ఎవరు రాశారన్నది అత్యంత కీలకమైన అంశం. వినిత్ రెడ్డి స్వయంగా పరీక్షించి మందులు సూచించారా? ఆయన పర్యవేక్షణలోనే సాయికృష్ణ చికిత్స అందించారా? లేక ఆయన పేరు, అర్హతలు ఉన్న లెటర్‌హెడ్‌ను మరొకరు ఉపయోగించారా? అనేది విచారణలో తేలాలి. ప్రిస్క్రిప్షన్ అసలు ప్రతిని స్వాధీనం చేసుకుని, వైద్యుడి రిజిస్ట్రేషన్ వివరాలు పరిశీలించి, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలు నమోదు చేస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

### ఇంజక్షన్ తర్వాత ఏమైంది?

పోలీసుల ఎఫ్ఐఆర్‌లో నమోదైన వివరాల ప్రకారం.. అనిరుషిక్ ను అక్టోబర్ 7వ తేదీ రాత్రి క్లినిక్‌కు తీసుకెళ్లారు. మరుసటి రోజు పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన బాలుడికి జ్వరం రావడంతో మళ్లీ అదే క్లినిక్‌కు తీసుకెళ్లారు.అక్కడ ఇంజక్షన్, సెలైన్ ఇచ్చిన అనంతరం పరిస్థితిని గమనించిన వైద్యుడు మేడిపల్లిలోని మిరాకిల్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు.అక్టోబర్ 8వ తేదీ రాత్రి ఆసుపత్రిలో చేర్పించగా సుమారు 50 నిమిషాలపాటు చికిత్స అందించారు. దాదాపు 30 నిమిషాలపాటు సీపీఆర్ చేసినప్పటికీ బాలుడు మృతి చెందాడు.ఇంజక్షన్ అధిక మోతాదు వల్లే బాలుడు చనిపోయాడని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే మరణానికి అసలు కారణం వైద్య, పోస్టుమార్టం నివేదికల ద్వారా నిర్ధారణ కావాల్సి ఉంది. ఇచ్చిన మందుల వివరాలు, మోతాదు, చికిత్సా విధానం, ఆసుపత్రికి తరలించడంలో జరిగిన పరిణామాలపై సమగ్ర విచారణ జరగాలి.

### ఎఫ్ఐఆర్ నమోదైంది.. తదుపరి చర్యలేవి?

అనురుషిక్ తండ్రి వంగపల్లి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు క్రైమ్ నంబర్ 1441/2026గా కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 194ను పేర్కొన్నారు. దర్యాప్తు బాధ్యతలను ఎస్ఐ ఉదయ భాస్కర్‌కు అప్పగించారు.అయితే కేసు నమోదు చేయడం మాత్రమే కాకుండా,బాలుడికి చికిత్స అందించిన వ్యక్తి అర్హతలు, ప్రిస్క్రిప్షన్‌పై ఉన్న వైద్యుడి వివరాలు, చికిత్సలో వైద్య నిర్లక్ష్యం జరిగిందా అనే అంశాలను దర్యాప్తులో తేల్చాలి.తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రిస్క్రిప్షన్‌ను పరిశీలించారా? క్లినిక్‌లో తనిఖీలు నిర్వహించారా? సంబంధిత వైద్యులను విచారించారా? పోస్టుమార్టం నివేదికపై వైద్యుల అభిప్రాయం తీసుకున్నారా? అనే విషయాలపై పోలీసులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

### పోస్టుమార్టం నివేదికపై ఉత్కంఠ...!!

బాలుడి మృతికి గల కారణాలను నిర్ధారించడంలో పోస్టుమార్టం నివేదిక కీలక ఆధారం. నివేదిక అందిందా? అందులో మరణానికి గల కారణంపై ఏమి పేర్కొన్నారు? వైద్యపరమైన అభిప్రాయం కోసం నివేదికను నిపుణులకు పంపారా? నివేదిక అందకపోతే దాని కోసం తీసుకుంటున్న చర్యలేమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాలి. నివేదిక ఆధారంగా తదుపరి దర్యాప్తు ఎలా సాగుతోందో బాధిత కుటుంబానికి తెలియజేయాలి. వైద్య నిర్లక్ష్యం జరిగిందని తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

### వైద్య ఆరోగ్యశాఖ ఏం చేస్తోంది?

క్లినిక్ నిర్వహణకు అనుమతులు ఉన్నాయా? అక్కడ చికిత్స అందిస్తున్న వ్యక్తులకు అవసరమైన అర్హతలు ఉన్నాయా? ప్రిస్క్రిప్షన్‌పై ఉన్న వినిత్ రెడ్డికి ఆ క్లినిక్‌తో సంబంధం ఏమిటి? సాయికృష్ణకు ఆధునిక వైద్యం అందించే అర్హత ఉందా? గతంలో తనిఖీల్లో పట్టుబడ్డారన్న స్థానికుల ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరిశీలించాలి. గత తనిఖీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, క్లినిక్ అనుమతులు, వైద్యుల అర్హతలను ధ్రువీకరించాలి.అర్హతలు లేని వ్యక్తి వైద్యం అందిస్తున్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలి. విచారణ పూర్తయ్యేలోపు ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకుండా నిబంధనల మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలి. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా క్లినిక్‌లపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి.

### అధికారులకు సూటి ప్రశ్నలు

చికిత్స చేసింది ఎవరు? తల్లిదండ్రుల ఆరోపణల్లో ఉన్న సాయికృష్ణ వైద్య అర్హతలను పోలీసులు, వైద్యశాఖ ధ్రువీకరించాయా?
వినిత్ రెడ్డి ఎక్కడ? ఆయన పేరుతో ఉన్న ప్రిస్క్రిప్షన్‌ను పరిశీలించారా? చికిత్స సమయంలో ఆయన క్లినిక్‌లో ఉన్నారా?
ప్రిస్క్రిప్షన్ ఎవరు రాశారు? అసలు పత్రాన్ని స్వాధీనం చేసుకుని, దానిపై ఉన్న వివరాలను ధ్రువీకరించారా?
పోస్టుమార్టం నివేదిక ఏమంటోంది? మరణానికి గల కారణంపై వైద్యుల అభిప్రాయం తీసుకున్నారా?
క్లినిక్‌కు అనుమతులున్నాయా? నిర్వహణ, వైద్య అర్హతలు, మందుల వినియోగంపై తనిఖీలు జరిగాయా?
తదుపరి చర్యలేమిటి? దర్యాప్తు పురోగతి, వైద్యశాఖ తనిఖీల వివరాలను అధికారులు ఎప్పుడు వెల్లడిస్తారు?

### మరో అనిరుషిక్ ప్రాణం పోకూడదు...!

ఒక కుటుంబానికి తీరని విషాదాన్ని మిగిల్చిన ఈ ఘటనలో నిజాలు వెలుగులోకి రావాలి. ప్రిస్క్రిప్షన్‌పై ఉన్న వైద్యుడి వివరాలు, చికిత్స అందించిన వ్యక్తి అర్హతలు, ఇచ్చిన మందుల మోతాదు, బాలుడి మరణానికి గల కారణాలపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలి. బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు క్లినిక్‌ను తనిఖీ చేసి, నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లయితే చట్టపరమైన చర్యలు చేపట్టాలి. అనిరుద్ధ్ కుటుంబానికి న్యాయం చేయడంతోపాటు,అర్హతలు లేని వ్యక్తుల చేతుల్లో మరో చిన్నారి ప్రాణం పోకుండా పర్యవేక్షణను పటిష్ఠం చేయాలి.

# రంగుల హరివిల్లులా కృష్ణవేణి వికాస్ క్యాంపస్!!

**- పూల సింగిడితో కదిలొచ్చిన గౌరమ్మ**

**- నేటితరం గుండెల్లో బతుకమ్మ వైబ్స్!**

**- సంప్రదాయానికి విద్యార్థినుల నీరాజనం**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 9 (విజన్ ఆంధ్ర): పుస్తకాల పేజీల మధ్య దాగిన రంగులేవో నేలమీదికి దిగివచ్చినట్టు.. నట్టింట్లో అమ్మ చేతి గాజుల సవ్వడి కాలేజీ ప్రాంగణమంతా మార్మోగినట్టు.. గోదావరిఖని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఆధునికత పరుగులు తీస్తున్న ఈ డిజిటల్ యుగంలోనూ, తమ సాంస్కృతిక వేర్లను గుండెలకు హత్తుకుంటూ కళాశాల విద్యార్థినులు చేసిన పూల పండుగ సరికొత్త వైబ్స్‌తో కళకళలాడింది. తంగేడు తళుకులు, గునుగు మెరుపులు, బంతి, చామంతి, గులాబీల సువాసనలతో తీరొక్క పూలను పేర్చి విద్యార్థినులు ముస్తాబు చేసిన బతుకమ్మలు చూపుతిప్పుకోనివ్వలేదు. కేవలం పూలను అమర్చడం మాత్రమే కాదు.. ప్రకృతిని దైవంగా భావించి పూజించే తరాల సంస్కృతిని, అమ్మతనాన్ని తమ అరచేతుల్లో ఒదిగించి గౌరమ్మగా నిలిపారు.

### *ఆధునికతకు జానపద లయ.. హోరెత్తిన ప్రాంగణం!*

పట్టు పరికిణీలు, సంప్రదాయ చీరకట్టులతో తెలుగింటి ఆడపడుచులుగా మారిన విద్యార్థినులు బతుకమ్మల చుట్టూ చేరి లయబద్ధంగా చప్పట్లు కొడుతూ, 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ సాగిన జానపద గీతాలకు గొంతుకలిపారు. ఆ లయలో ఒకరినొకరు కలుపుకుపోయే ఆప్యాయత, పల్లెటింటి పండుగ జ్ఞాపకాలు ప్రతిబింబించాయి. సెల్ఫీలు, రీల్స్ హంగామాతో పాటు నేటితరం అమ్మాయిలు తమ సాంప్రదాయ నృత్యాలతో ప్రాంగణాన్ని ఉర్రూతలూగించారు. కళాశాల డైరెక్టర్ అండ్ చైర్మన్ నాగండ్ల జమున రవి






కుమార్ మాట్లాడుతూ.. "చదువుతో పాటు మన మూలాలను, పండుగల్లో దాగున్న ఆత్మీయతను నేర్చుకోవడమే నిజమైన విద్య. కృష్ణవేణి వికాస్ ప్రాంగణంలో మన సంస్కృతి ఇలా చిగురిస్తుండటం గర్వకారణం" అని కొనియాడారు. తోటి విద్యార్థినులు, అధ్యాపక బృందం ఉత్సాహంగా పాలుపంచుకోవడంతో కళాశాల అంతా ఒక పెద్ద ఉమ్మడి కుటుంబంలా మారిపోయింది. చిరునవ్వుల చిరుజల్లులు, తాళాల సవ్వడులు, పూల పరిమళాల నడుమ కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ప్రతి ఒక్కరి మదిలో కలకాలం నిలిచిపోయే మధుర జ్ఞాపకంగా మిగిలాయి. ఈ వేడుకలలో కళాశాల ప్రిన్సిపల్ వెంకన్న, లెక్చరర్లు, సిబ్బంది అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.